# ఐక్య ఉపాధ్యాయ

విద్యా విషయక మాసపత్రిక

సెప్టెంబర్ - 2017

సంపుటి- 43 సంచిక : 09



## సంపాదక వర్గం

**ఎన్.కుమార్ రాజా**

ప్రధాన సంపాదకులు

**ఐ.వెంకటేశ్వరరావు**

**పి.బాబురెడ్డి**

**టిఎస్ఎల్ఎన్ మల్లేశ్వరరావు**

**సిహెచ్.శ్రీహరి**


## ఈ సంచికలో...


| | |
|---|---|
| జాతీయం అంతర్జాతీయం | -04 |
| ఉపాధ్యాయుడు నాడే-నేడు | -05 |
| డిటెన్షన్‌లో విద్యా హక్కుకు ... | -07 |
| ఆనాటి విలువలు తరిగి.... | -09 |
| సెప్టెంబర్ 1 ఉద్యోగులకు .... | -11 |
| శానిటరీ పన్ను శాతం | -12 |
| ఉమ్మడి సర్వీస్ రూల్స్ వెంటనే... | -13 |
| రాష్ట్ర మహాసభలకు సిద్ధంకండి | -15 |
| అక్షరాలు నేర్పడంలో మెళకువలు | -17 |
| ముఖ్యమైన ప్రాతినిధ్యాలు | -19 |
| ప్రభుత్వ పాఠశాలల పరిక్షణ.... | -20 |
| ప్రశ్నోత్తరాలు | -23 |
| ఉద్యమవార్తలు | -24 |
| ప్రభుత్వఉత్తర్వులు | -42 |



| | | | |
|---|---|---|---|
| దశాబ్దిచందా | : | ₹ | 1250-00 |
| 5 సం॥ చందా | : | ₹ | 650-00 |
| సం॥ చందా | : | ₹ | 150-00 |
| విడిప్రతి | : | ₹ | 15-00 |

Union Bank Online
A/c No. 346402010025027
IFSC Code : UBINO534641



**ఐక్య ఉపాధ్యాయ**

యుటియఫ్ ఆఫీస్, పాలపర్తివారి వీధి,
గవర్నర్‌పేట, విజయవాడ-520002

Ph.No. : 0866-2573763

Website: www.aputf.org

E-mail: ikyopadhyaya1975@gmail.com


# ఉపాధ్యాయ వృత్తి గౌరవం పెంచాలి

సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవం. ఈ సందర్భంగా భావి భారత నిర్మాతలైన ఉపాధ్యాయులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి సంవత్సరం అవార్డులతో సత్కరిస్తున్నారు. జిల్లా విద్యాశాఖలు సైతం ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి సన్మాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో కొందరికి ఈ సన్మానాలు దక్కుతున్నాయి. మరి దరఖాస్తు చేయడానికి ఇష్టపడని ఎందరో ఉత్తమ ఉపాధ్యాయుల సంగతేమిటి? పాలకులు, అధికారులు, మేధావులు ఆలోచించాలి. వారినీ గుర్తించి సత్కరించగలగాలి.

ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనది. ఉన్నత విద్యావంతులను ఉపాధ్యాయ వృత్తిలోకి ఆకర్షించేందుకు మెరుగైన వేతనాలు, సర్వీసు నిబంధనలు, ఉద్యోగ భద్రత కల్పించాలని దశాబ్దాల తరబడి పలు విద్యా కమీషన్లు, వేతన సవరణ కమీషన్లు సిఫారసు చేస్తూ వస్తున్నాయి. వాటిని పట్టించుకోకపోగా విద్యారంగ సంస్కరణల పేరుతో ఉపాధ్యాయుల స్థానాన్ని మరింత దిగజార్చడం జరుగుతున్నది. స్పెషల్ టీచరు, అప్రెంటీస్ టీచరు, కాంట్రాక్టు టీచరు పేరుతో పాలకులు కాలాన్ని కరిగించారు. ఇప్పుడు ప్రతియేటా జరుపవలసిన ఉపాధ్యాయ నియామకాలకే స్వస్తి పలికారు.

రాష్ట్రాన్ని నాలెడ్జ్ హబ్‌గా, విద్యా హబ్‌గా మార్చుతామంటూ ప్రకటనలు చేస్తున్నారు, మరోవైపు రేషనలైజేషన్‌తో పాఠశాలలను మూసివేస్తున్నారు. డిటెన్షన్ విధానం తెచ్చి పేద బడుగు వర్గాలను  ప్రాథమిక విద్యనుండి దూరం చేయనున్నారు. స్వయంపోషక స్వతంత్ర పాఠశాలల చట్టం తెచ్చి విద్యా వ్యాపారానికి చట్టభద్రత కల్పించనున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి సంవత్సరం 1.5లక్షలమంది విద్యార్థులు తగ్గిపోతున్నారు. వివిధ రూపాల్లో సర్వేలు చేయించి నాణ్యమైన విద్య లేదని ప్రచారం చేస్తున్నారు.

తాజాగా డొల్ల పాఠశాలలు (పిల్లలు తగ్గిన) పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్ షిప్‌కింద ఇచ్చేయాలని, అందులోని విద్యార్థుల సంఖ్యను బట్టి ప్రభుత్వం నిధులు అందించాలని నీతిఅయోగ్ సూచించడం చూశాం. డిటెన్షన్, తెలుగు మీడియం రద్దు, ఫీజు రీయింబర్స్‌మెంట్, హాస్టల్స్‌మూత తదితర చర్యలతో విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల నుండి పంపివేయడం, ఆ నెపం ఉపాధ్యాయులపై నెట్టడం చూస్తే ప్రభుత్వాలు తమ బాధ్యత తప్పకుని పాఠశాలల్ని పిపిపి పద్ధతిలో కార్పొరేట్‌లకు అప్పజెప్పేందుకు రంగం సిద్ధం చేసిందని స్పష్టం అవుతోంది. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయుల వృత్తికి అంకితంకావడమే కాదు, ప్రభుత్వ విద్యావ్యవస్థ కాపాడుకోనేందుకు సిద్దంకావాలి.

నిరంతర అధ్యయనం, వృత్తిపట్ల అంకితభావంగల ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రభావితం చేసి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దగలరు. ఉపాధ్యాయులను ఆ విధంగా ఉంచవలసిన పరిస్థితులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. కాని నేడు ఉపాధ్యాయులు పలు సమస్యలతో సతమతమవుతున్నారు.

కాంట్రిబ్యూటీరీ పెన్షన్ విధానం, ఉమ్మడి సర్వీస్‌రూల్సు అమలులో లేకపోవడం, ఎయిడెడ్, మున్సిపల్ టీచర్ల సమస్యలు, పాఠశాలల సమస్యలు నానాటికి పెరగడం ఉపాధ్యాయులను నిరంతరం ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఉద్యమబాట పట్టిస్తున్నాయి.

ఇకనైనా ప్రభుత్వ విధానాలు మారాలి. గురుపూజోత్సవాలు ఆ ఒక్కరోజుకే పరిమితం కారాదు. ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరింపబడాలి. సమాజంలో ఉపాధ్యాయుని హెూదా పెరిగేలా విద్యా విధానాలు అమలు చేయాలి. విద్యావంతులను ఉన్నతమైన ఉపాధ్యాయ వృత్తివైపు ఆకర్షించేలా పథకాలు రూపొందించాలి. ఉపాధ్యాయ వృత్తి గౌరవం పెంచాలి. అప్పుడే పాలకులు, అధికారులు చేసే గురుపూజోత్సవాలకు సార్థకత వస్తుంది.

ఉపాధ్యాయులు సైతం తమ వృత్తిపట్ల అంకితభావం పెంపొందించుకోవాలి. అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ లక్ష్యంగా పనిచేయాలి. సర్వేపల్లి స్ఫూర్తితో ఉపాధ్యాయ వృత్తికి గౌరవంతేవాలి. అందరికి ఆదర్శంగా నిలవాలి. ☯

# జాతీయం అంతర్జాతీయం



## రెండు చారిత్రాత్మక తీర్పులు

ఇటీవల సుప్రీంకోర్టు రెండు చారిత్రాత్మక తీర్పులిచ్చింది. అందులో ఒకటి త్రిపుల్ తలాక్ రద్దు. 1400 సం॥లుగా ఒక మత సాంప్రదాయంగా ముస్లీం మహిళల హక్కులకు తీవ్ర విఘాతం కల్గిస్తున్న త్రిపుల్ తలాక్ పద్ధతి రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సైరాబాను దాఖలు చేసిన పిటీషన్‌పై విచారణ చేపట్టిన ధర్మాసనం 3:2 మెజార్టీతో ఈ తీర్పు వెలువరించింది. బెంచ్‌లో జస్టీస్ కురియన్, జస్టీస్ లలిత్, జస్టీస్ నారిమన్‌లు తలాక్‌ను వ్యతిరేకిస్తూ తీర్పు ఇవ్వగా, ఛీఫ్ జస్టీస్ ఖేహార్, జస్టీస్ నజీర్‌లు తలాక్‌ను సమర్ధించారు. ఈ అంశం కోర్టుల పరిధిలోకి రాదని పార్లమెంట్‌కు వదిలేయాలని మైనార్టీ తీర్పు ఇచ్చారు. ఛీఫ్ జస్టీస్ ఖేహార్ 3:2 మెజార్టీతో త్రిపుల్ తలాక్ విధానాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

రెండవ తీర్పు వ్యక్తిగత గోప్యతకు సంబంధించింది. వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కుగా సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. వివిధ సంక్షేమ పథకాలతోపాటు, బ్యాంకు ఖాతా, పాన్‌కు ఆధార్ తప్పనిసరి అని చెప్తున్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి ఈ తీర్పు పెద్ద ఎదురుదెబ్బగా చెప్పాలి. గతంలో 1954లో వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కుకాదని ఎంపి శర్మ కేసులో 8మంది ధర్మాసనం తీర్పు చెప్పింది. 1963లో ఖారక్ సింగ్ కేసులో కూడా అదే రకమైన తీర్పు చెప్పింది. ఇప్పుడు తాజాగా గత రెండు తీర్పుల్ని కొట్టేస్తూ వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కుగా పేర్కొంటూ సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం విశేషం.

## కర్నాటకలో డిగ్రీ వరకు ఆడపిల్లలకు ఉచిత విద్య

కర్నాటక రాష్ట్రంలో ఆడపిల్లలకు 1 నుండి డిగ్రీ వరకు ఏ రకమైన ఫీజులు లేని ఉచిత విద్య అందించనున్నారు. అది ఎయిడెడ్ స్కూలా, అన్‌ఎయిడెడ్ స్కూలా తో నిమిత్తం లేకుండా వచ్చే విద్యా సంవత్సరం నుండి అమలు చేయబోతున్నారు. 10 లక్షలకంటే తక్కువ ఆదాయంగల కుటుంబాలలోని 18 లక్షలమంది ఆడ పిల్లలు లబ్ది పొందబోతున్నారు. దీనికి అదనంగా 110కోట్లు ఖర్చు అవుతున్నట్లు ఉన్నత విద్యాశాఖామంత్రి బసవరాజ్ రాయరెడ్డి తెలిపారు. ఇప్పటికే తెలంగాణా రాష్ట్రంలో ఆడపిల్లలకు కిండర్‌గార్డన్ నుండి పోస్టు గ్రాడ్యుయేషన్ వరకు, పంజాబ్ రాష్ట్రంలో పిహెచ్‌డి వరకు ఉచిత విద్య అమలవుతున్నది. “అయితే మేము ఆ రాష్ట్రాలను అనుకరించడం కోసం కాదు. ఆడ పిల్లల సాధికారికత కోసం చేస్తున్నాం. దీంతోపాటు ఇప్పటికే ఇస్తున్న అన్ని వర్గాల ఆడ పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కొనసాగుతుంది” అని రాయరెడ్డి చెప్పారు.

## పూర్వప్రాథమిక విద్యా ప్రణాళిక

ఇప్పటికైతే ప్రాథమిక విద్యకు ఒక విద్యాప్రణాళిక (ఎన్‌సిఎఫ్) వుంది. పూర్వ ప్రాథమిక విద్యకు ఒక నిర్దిష్ట ప్రణాళిక అంటూ ఏమీ లేదు. ఎల్‌కెజి, యుకెజిల పేరుతో ఎవరికిష్టం వచ్చింది, ఇష్టం వచ్చినట్లుగా చెప్పేసుకొంటున్నారు. అందులోనూ బట్టీ పట్టించడం, వేళ్ళు అరిగేటట్లు రాయిం చడం ప్రధానంగా జరిగేది. 1వ తరగతికి వచ్చేసరికి 1వ తరగతి సిలబస్ అంతా వచ్చే పండితుల్ని తయారుచేయడంగా ఈ వ్యవహారం వుంటోంది. ఈ నేపథ్యంలో ఎన్‌సిఇఆర్‌టి పూర్వ విద్య ప్రణాళిక తయారుచేసే పనిలో నిమగ్నమైవుంది. 2018-19 విద్యా సంవత్సరం నుండి అమలులోకి రానుంది. ఈ ప్రణాళికలో రెండు సంవత్సరముల పాటు ఏమీ, ఎలా బోధించాలో చెపుతారు. జ్ఞానాత్మక, భావనాత్మక రంగాల్లో పిల్లలకు ఎలా శిక్షణ ఇవ్వాలో వివరిస్తారు.

## నోట్లరద్దు గాయాలు

నల్లడబ్బు పట్టేయడానికి, అవినీతిని అంతమొందించడానికి, ఉగ్రవాదానికి చెక్‌పెట్టడానికి పెద్దనోట్లు రద్దు చేసిన తరువాత పైవేమీ జరగకపోగా భారత ఆర్ధిక వ్యవస్థ గాయాలపాలైంది. నిన్నటికి నిన్న 1000 రూపాయల నోట్లన్నీ ఆర్‌బిఐకు చేరాయని ప్రకటించారు. వెనక్కిరాని డబ్బు అంతా నల్లడబ్బు అవుతుంది అన్నారు కదా. ఇప్పుడు 99% తిరిగి వచ్చేసింది. దీన్నేమనాలి? నల్లడబ్బు తెల్ల డబ్బుగా మారిందనాల్నా? అవును నల్లడబ్బు, దొంగడబ్బు తెల్ల డబ్బుగా మారింది. అవినీతి అంతం కాలేదు, టెర్రరిస్టులకు ఏమీ కాలేదు. అసంఘటిత రంగం దెబ్బతినింది. పారిశ్రామిక ఉత్పత్తి పడిపోయింది. ఇదికాక రోకటిపోటులా కొత్తనోట్లు ముద్రించడానికి 8000కోట్లు అదనపు ఖర్చయింది. కొత్తనోట్లకనుగుణంగా ఏటిఎం లను మార్చడానికి 35,000 కోట్లు ఖర్చుకాగా దాన్ని బ్యాంకులు చార్జీల రూపంలో కష్టమర్లపై రుద్దారు. క్యూలలో చనిపోయిన 100మంది ప్రాణాలు కొండెక్కిన దీపాలయ్యాయి.

నోట్లను రద్దుచేస్తే వచ్చే దుష్పరిణామాలను కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరించినట్లు రిజర్వ్ బ్యాంకు మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొనడం విశేషం.

## పాఠశాలల్ని ప్రైవేట్‌కు అప్పగించాలి!
## చైనా కంపెనీలను భారత్‌కు ఆహ్వానించాలి!!


**- నీతి అయోగ్**

ప్రభుత్వ పాఠశాలల్ని ప్రైవేటు భాగస్వామ్యంతో నడపాలని తన మూడేళ్ళ (2017-20) ప్రణాళికలో నీతిఅయోగ్ పేర్కొంది. ప్రభుత్వానికి భారంగా మారిన స్కూళ్ళను పిపిపి (పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యం) విధానంలో నడపడమే పరిష్కారమని తెలిపింది.

అలాగే అర్హతకు తగ్గ ఉద్యోగాలు లేకపోవడం భారత్‌లో యువత ఎదుర్కొంటున్న పెద్ద సమస్య అని అందుకు చైనా కంపెనీలను భారత్‌కు ఆహ్వానించాలని నీతిఅయోగ్ పేర్కొంది. అన్ని రకాల కార్మిక చట్టాలను సవరించాల్సిన అవసరం వుందని తెలిపింది. ఈ మూడేళ్ళ ప్రణాళికలో సంస్కరణలను వేగవంతం చేసే ధోరణి, ప్రభుత్వ వ్యవస్థలను నిర్వీర్యం చేసే దుర్మార్గం కనిపిస్తూ వుంది.

# ఉపాధ్యాయుడు నాడు - నేడు

భారతీయ విద్య గురుకేంద్రకం. ఇది మన సాంస్కృతిక వారసత్వం. బౌద్ధ సంప్రదాయం కూడా ఇదే. అమెరికా, యూరప్ విద్య దీనికి భిన్నం. అక్కడి విద్య విద్యార్థి కేంద్రకం. సహజంగానే అందువల్ల మన సమాజంలో గురువుకు చాలా ప్రత్యేక స్థానం వుంది. ఆయన సర్వజ్ఞుడు, త్యాగశాలి, అఖండ వాత్సల్యమూర్తి, ఆరాధనీయుడు. యూరప్‌లో శిష్యుడు అఖండ ప్రజ్ఞామూర్తి, జ్ఞానపిపాసి, స్వతంత్ర ప్రాణి, చైతన్యశీలి. అతణ్ణి అలానే గుర్తించి సహకరించి, తోడుండి నడిపించడం గురువు పని.



వి. బాలసుబ్రహ్మణ్యం
శాసనమండలి సభ్యులు

ఈ రెండు ధోరణులు విద్యారంగాన్ని తీవ్రంగా ప్రభావితం చేసేవి. పాఠశాలతో ఆగక సమాజాన్ని కూడా శాసించేవి. దేని ప్రత్యేకత దానిది అని సరిపెట్టుకొంటే చాలదు. రెండవది ప్రజాస్వామ్య పునాదులు పదిలం చేసేదని మరువ రాదు. అదలా వుంచుదాం.

**అలనాటి గురువులు:**

జాతీయోద్యమం నాటికి ఇప్పటిలా ప్రభుత్వ విద్యాసంస్థలు లేవు. ఉన్నత విద్యా సంస్థలు మరీ మృగ్యం. అప్పటి ఉపాధ్యాయుడికి ఆదరణ అయినా, ఆదరువు అయినా సమాజమే. మరోమాటలో చెప్పాలంటే గ్రామమే. అప్పటికి ఊళ్ళో ఆయనే చదువు కొన్నవాడు. మంచి, చెడ్డా చెప్పగలవాడు. చాలమంది ఉపాధ్యాయులు అంతో ఇంతో వైద్యులు కూడా. సమాజం నుంచి అతన్ని విడదీయడం ఆనాడు అసాధ్యం. ఇంతగా సామాజిక జీవిగా మరొక ఉపాధ్యాయుడికి ఆ సమాజాన్ని నడిపించే బాధ్యతా, శక్తి కూడా వచ్చాయి. సమాజమే అతనికాచైతన్యాన్ని ఇచ్చింది. అందువల్ల చాలామంది ఉపాధ్యాయులు గ్రామాలకు పెద్ద దిక్కులుగా చలామణి అయ్యారు. దీనికి పునాది కారణం కూడా ఉంది. అదేమంటే అసలు బడే ఆనాడు సమాజానిది. ఊళ్ళో వాళ్ళే ఉపాధ్యాయుడికి భత్యం ఇస్తారు. బడిని నడిపిస్తారు. ఊరి అవసరాలే బడిలో పాఠాలు కూడా. అగ్రవర్ణాల పిల్లలే ఆనాటి బడి పిల్లలనే అపప్రథ వున్నా బడిలో అందరూ సమానులే అనే నీతి కూడా వుంది. క్రమంగా బ్రిటిష్ వారి సాహచర్యంతో పెద్దలంతా తమపిల్లలలకి విద్య ఎంత అవసరమో గుర్తించాక బడికి మరింత కళ, శక్తి వచ్చి చేరాయి. సామజికావసరాల్లో మార్పులొచ్చే కొద్దీ బడిలోనూ మార్పులొచ్చాయి. బడిలో మార్పులొచ్చే కొందీ గురువుల స్థితిగతుల్లోనూ మార్పులు రాక తప్పలేదు. తెల్లవారి బడాయి అంతా వాళ్ళ చదువుల్లో, నాగరికతలో, విజ్ఞానంలో, లౌకిక జీవితంలో వున్నదని గుర్తించిన గురువులు ఇవన్నీ మనవాళ్ళకి మాత్రం ఎందుకు దక్కదని గాకున్నా ఇవిలేక పోవడమే మనం వాళ్ళ చేతుల్లో బందీలు కావడానికి కారణమని గుర్తించారు. మరికొందరు సమాజాన్ని నడిపించి, తిరుగుబాటు జెండా చేతికి తీసుకొన్నారు. ఇంకొందరు బతకలేని బడిపంతుళ్ళుగా మిగిలిపొయ్యారు.

ఏది ఏమైనా అలనాటి గురువుకు ఒక బలము, బలహీనత ఉన్నాయి. బలం అతడు ఒంటరివాడు కాదు. ఊరి మనిషి, సామాజిక జీవి, సమాజానికి అంతో ఇంతో ముందున్న వాడు. బలహీనత అతని బతుకు తెరువు. చాల మంది గురువులు కూడు గడవనివారు. పిల్లల పెళ్ళిళ్ళు వాళ్ళకి మొయ్యలేనంత బరువు. సమాజాన్ని నమ్ముకొని బతకడమంటే చాలా వాటిని సర్దుకొని లేదా చంపుకొని బతకడం కూడా అన్న జీవనతత్వాన్ని ఒంటబట్టించు కొన్నవాళ్ళు ఆనాటి బడిపంతుళ్ళు.

**జాతీయోద్యమం–ఉపాధ్యాయుడు:**

క్రమంగా జాతీయోద్యమం పుంజుకొనింది. భారతీయుల్లోనూ ఒక వర్గం విద్యావంతం కాసాగింది. ప్రశ్నించడం నేర్చుకొంది. చాలా రుగ్మతల్ని వదిలించు కొని ఆధునికతను పులుముకోసాగింది. వీరిలో కొందరు తెల్ల దొరలకు ప్రతిరూపాలయ్యారు. చాణక్యం నేర్చుకొన్నారు. ఆర్థికంగా, అధికారపరంగా ఎదిగారు. కొందరు ఆధునిక విద్వాంసులూ, తత్వవేత్తలూ, సాహితీమూర్తులూ అయ్యారు. జాతీయ పునరుజ్జీవన కర్తలుగా, యుగపురుషులుగా గర్తింపు పొందారు. మరికొందరు జనం పక్షాన నిలబడ్డారు. ఇదంతా విద్య మహిమేనని, సమాజంలోని కింది పొరల వారికీ అవగతంకాసాగింది. విద్య సార్వజనీయనం కాకున్నా సార్వత్రికం కాసాగింది.

విద్యకున్న ఈ అభివృద్ధికరపార్శ్వాన్ని ఇటు జాతీయోద్యమమూ, అటు తెల్లదొరలూ ఇద్దరూ గుర్తించారు. మనవాళ్లు జాతీయ విద్యకు పూనుకొన్నారు. విద్యకు కొత్త నిర్వచనం ఇచ్చారు. విద్యాలయాల్ని ఆధునిక భావజాల కేంద్రాలుగా, ఉద్యమ కేంద్రాలుగా ఇవి మార్చారు. ప్రజాస్వామిక విద్యకు పునాదులు వేశారు. ఈ సందర్భంలో దేశంలో అత్యున్నత విద్యాస్థాయి సంస్థల్నీ, ప్రపంచంలోనే గణతికెక్కిన విద్యా వేత్తల్నీ మనం చూడొచ్చు.

ఇదంతా పాలకుల పాపిష్టి కళ్ళలో పడింది. వాళ్ళ అంచనా వాళ్ళకుంది. వాళ్ళ కనుసన్నల్లో నడిచేలా కొత్త విధానాలొచ్చాయి. కొత్త విద్యాసంస్థలు వచ్చాయి. కొత్త నిర్వచనాల విద్యలొచ్చాయి. మెకలే దీన్ని స్థిరీకరించాడు. విద్యావసరాల్ని సర్కారు కొలువుల అవసరాల స్థాయికి దిగజార్చారు. ఆంగ్లవిద్యకు శ్రీకారం చుట్టారు.

ఈ క్రమంలో టీచరు సర్కారు మీద కూడా ఆధారపడే వాడుగా, ఒక ఉద్యోగిగా రూపాంతరం చెందడం ప్రారంభించాడు. సమాజం నుంచి జరిగి జరిగి సర్కారు దగ్గరికి చేరసాగాడు. అయినా బలమైన జాతీయోద్యమం గురువుల్ని గురుస్థానంలో నిలబెట్టింది. కాకుంటే గ్రామాలని సగటు ఉపాధ్యాయుడి స్థితిగతుల్లో చెప్పుకోదగ్గ మార్పులు లేకపోవచ్చు. కానీ అతని పీఠం కదలసాగిందనేది సత్యం.

జాతీయోద్యమం ముందుకు సాగే కొద్దీ విద్యారంగం పై విస్తృత చర్చ మొదలైంది. విద్యకుండాల్సిన లక్ష్యాలూ, విలువలూ, దేశీయ అవసరాలూ, దీనికి తగ్గ విద్యావిధానమూ ఇవన్నీ ముగ్గులోకి వచ్చాయి. విద్యారంగంలోకి ప్రజాస్వామిక వీచికలు బలంగా జొరబడ్డంతో ఉపాధ్యాయుల అవసరాలు హక్కులుగా మారజొచ్చాయి. సంఘాలు పుట్టాయి. బలహీనులైనా తెలివిగల వాళ్ళు కావడంతో, కార్మికోద్యమాలు విస్తరించడంతో వీటికి ఒక పునాది ఏర్పడింది. ఒక స్పష్టత కూడా వచ్చింది. ఇప్పుడు టీచరు తన కోసం ప్రశ్నించడం మొదలెట్టాడు. అతడు సామాజిక జీవి నుండి 'సంఘాల' జీవిగా కూడా మారడం మొదలైంది.

### గొప్ప చర్చ–గొప్ప సందర్భం

బహుశః దేశచరిత్రలో విద్యారంగం గూర్చి ఇంతకన్నా మధించిన, కలలుగన్న సమయం మరొకటి లేదు. జాజ్వల్యమైన భవిష్యత్ భారతం కోసం భారతీయ సమాజం ఇంతకన్నా స్వప్నించి శపథం చేసిన వేళ మరొకటిలేదు. కామన్ స్కూలు గురించీ, అందరికీ విద్య గురించీ, స్వదేశీ మేధావుల గురించీ, తనదైన ఆధునిక జాతీయ విద్య గురించీ చాలాచాల చర్చలు జరిగాయి. తీర్మానాలు జరిగాయి. గ్రామీణ భారతాన్ని కూడా ఇది శక్తివంతంగా స్పృశించింది. వేలాది జాతీయ విద్యాసంస్థలు వెలిశాయి. భారతీయ ప్రజల్లో మరీ ముఖ్యంగా ఎగువ, మధ్య తరగతి వర్గాల్లో విద్య పట్ల ఊహాతీత స్పృహ పెరిగింది. సహజంగానే ఉపాధ్యాయుడూ ఈ యుగంలో ఒక విద్యుత్ తేజాన్ని నింపుకొన్నాడు. ఒక వైపు మహోధృతంగా సాగుతున్న జాతీయోద్యమం అతన్ని మరింత ముందుకు నెట్టింది. అట్టడుగు ప్రజల్ని కదిలించే వైపు నడిపించింది. మరో వైపు గ్రామీణ పాఠశాలల రూపు మారసాగింది. పెద్ద ఎత్తున ఉపాధ్యాయుల స్థితిగతులపై కూడా ఉద్యమాలు జరిగాయి. కోర్టులకెక్కి, ఉద్యోగాలు పోగొట్టుకొని టీచర్లు సంఘాల్ని నిలబెట్టుకొన్నారు. అతని పోరాటం గొప్ప నైతిక పోరాటం. కనీస హక్కుల కోసం జరుగుతున్న పోరాటం. అది సువిశాల ప్రజానీకపు మహాపోరాట ప్రవంతిలో ఒక పాయ. అది దేశం మొత్తం కనీ వినీ ఎరుగని చలన శీలత సంతరించుకొంటున్న క్రమంలోని పోరాటం.

### స్వాతంత్ర్యానంతరం:

స్వాతంత్ర్యం సిద్ధించేనాటికి మన ఉపాధ్యాయుడు గ్రామల్లోనూ, పట్టణాల్లోనూ కూడా ఒక ప్రత్యేక వ్యక్తిత్వం, స్థానం గల సామాజిక జీవి. తన దేశం కోసం, తన కోసం కూడా పోరాడ్డం నేర్చిన చైతన్య శీలి. ఒక సంఘటిత శక్తిగా మారుతున్న వ్యక్తి. క్రమంగా ప్రభుత్వ విద్యావ్యవస్థ విస్తృతం కాజొచ్చింది. నిలదొక్కుకోవడం మొదలైంది. గొప్ప విద్యాసంస్థలు వెలిశాయి. శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారతదేశానికొక పటిష్టమైన స్థానం దక్కాలన్న సంకల్పమూ నాడుంది. మరొక వైపు సార్వజనీన విద్య, సమాన విద్య లౌకిక ప్రజాస్వామిక విద్య కూడా శక్తివంతంగా ముందు పీఠాన చేరాయి. ఎయిడెడ్ సంస్థలొక వైపు, ప్రభుత్వ సంస్థలొక వైపు అల్లిబిల్లిగా అల్లుకోసాగాయి. ఊరి బడి కనుమరుగై ప్రభుత్వ బడి వచ్చి చేరింది. ఊరిని నమ్ముకొన్న టీచర్ ప్రభుత్వాన్ని నమ్ముకోసాగాడు. టీచర్లు ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు టీచర్లుగా విభజితులైయ్యారు. వామపక్ష ఉద్యమ స్ఫూర్తి వారికుండనే వుంది.

ఉపాధ్యాయ ఉద్యమం టీచర్లకు చాలా సాధించిపెట్టింది. ఎవరికి వాళ్ళుగా ఉన్న వాళ్ళని అది ఒక సూత్రంగా బంధించింది. సామాజిక గౌరవం కూడుబెట్టదని ఉద్బోధించిది. మహాగురువులు మాహామన్ననలు పొందడంతో సరిపెట్టుకోకుండా వీధిలోకి రమ్మది. పెద్దగురువులు మొదట తటపటాయించారు. సన్మాన శాలువాలు వాళ్ళని ఎంత వెనక్కి నెట్టజూచినా, భౌతిక జీవితం ఈ భేషజాల్ని పటాపంచలు చేసింది. సహజంగానే వీరి డిమాండ్లకు సమాజం కూడా తోడు నిలబడింది. గొప్ప నైతికతతో, సామాజిక స్పృహతో వాళ్ళు ఉద్యమాల్లోకి వచ్చారు. ఆర్థికంగా గౌరవప్రద జీవితంలోని అడుగు పెట్టారు. అశేష శ్రామిక జన బృందావనంలోకి వీళ్ళుచేరారు. విద్యాసంస్థలు పెరిగే కొద్దీ వీరి సంఖ్య, శక్తి పెరిగాయి.

### కాలం మారిపోయింది:

కాని ఇది రెండు మూడు దశాబ్దాలకు మించి సాగలేదు. కారణం మన విద్యావ్యవస్థ ఇంకా ఫ్యూడల్ పునాదుల మీదే నిలబడ్డది. ప్రపంచమంతా విద్య జనాన్ని సమానత్వంలోకి తెస్తే, భారతీయ విద్య ప్రాచీన అసమానతల్ని పదిలం చేసేదిగానే వుండిపోయింది. అందరికీ విద్య కలగానే మిగిలింది. కామన్ స్కూల్ కల్లగా మారింది. మన విద్య పునాదులు చాలా బలహీనమైనవి. ప్రభుత్వం, సమాజం కూడా విద్యను జాతీయ అజండాలోకి తేవడంలో విఫలం అయ్యాయి. పై నున్న ఒక పొర తన అవసరాలు తీరుతున్నాక అడుగు పొరను తన దరిజేరడానికి అంగీకరించలేదు. దీన్ని అధిగమించే శక్తి రాజ్యానికి లేదు. మన సంస్కృతిక వారసత్వమే మనబడిని అందరిబడిగా మారడానికి పెద్ద అడ్డంకి. ఈ వారసత్వం మన కుల వ్యవస్థ నుంచి కూడా పుట్టింది.

భారతదేశం ఇతర ప్రపంచానికి ఒక మినహాయింపుగానే విద్యకు సంబంధించినంతవరకూ వుండిపోయింది. క్రమంగా ఇది పేదలకు పేద విద్య, ధనికులకు మంచి విద్యగా రూపాంతరం చెంది స్థిరపడి పోయింది. ఇప్పుడిది మరింత ఘనీభవించింది. బలమైన ప్రజాస్వామిక అధునిక సార్వజనీన విద్య స్థిరమైన పునాదుల మీద నిలిచి వుంటే దాని విలువ వేరు. అందులో భాగంగా టీచర్ల స్థానం వేరు. అలాగానప్పుడు టీచరుకూడ పై పొరవాడుగానే వుండి పోయే ప్రమాదం వుంది. అతడు జనం నుంచి విడగొట్టుకొన్న వేతన జీవిగా మాత్రమే మిగిలిపోయాడు. అతని సంఘటిత శక్తి కూడా అతన్ని ఇంకొంత పైకి నెట్టి మరింతగా సమాజానికి దూరం చెయ్యడానికే తోడ్పడింది. ఇదెంత వికృతంగా వున్నా పెట్టుబడిదారీ సమాజ సహజ లక్షణమిది.

ఇప్పుడు తొండ ఊసరవెల్లిగా మారింది.ప్రైవేటు విద్య రంగంలోకి వచ్చింది. అంతర్జాతీయ పరిణామాలు, ఒప్పందాలు దీన్ని మరింత వేగిరం చేస్తున్నాయి. ప్రభుత్వ విద్యాసంస్థలు బక్కచిక్కి పోతున్నాయి. నోరు లేని నిరుపేదలే వాటిలో మిగిలారు. విద్యాలక్ష్యాల్లోకూడా వ్యాపారతత్వం జొరబడింది. చదువూ, టీచరూ కూడా సరుకుగా మారారు. ఉమ్మడి సామాజిక ప్రయోజనాల స్థానే వ్యక్తిగతం ముందుకొచ్చింది. రాజ్యాంగ విలువలు విద్య నుంచి దూరం కాసాగాయి. చూస్తుండగానే ఫక్తు వ్యాపార సామ్రాజ్యధిపతుల చేతుల్లోకి విద్య వెళ్ళిపోయింది. ప్రజాస్వామ్యం అనేది అటు పిల్లలకూ, ఇటు తల్లితండ్రులకూ కనుమరుగైంది. ఇక ఒక్క ఉపాధ్యాయుడు మాత్రం నిటారుగా ఎలావుండల్గుతాడు ?

### ఇప్పటి ఉపాధ్యాయుడు:

ఇప్పుడు టీచర్ అనగానే ఏ టీచరు అనే ప్రశ్న ముందుకొస్తుంది. ప్రభుత్వ సంస్థల్లోని రెగ్యులర్ టీచరా?కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ టీచరా? ప్రైవేట్ టీచరా? కార్పొరేట్ టీచరా? ఇలా టీచరు ముక్కలై పోయాడు. వీరిలో ఒక వర్గం ఆర్థికంగా, హక్కుల పరంగా స్థితిమంతం. వీళ్ళ సంఘాలు బలమైనవి. వీళ్ళు హక్కుల్ని దాటి సదుపాయాల కొరకు పోరాడే దశల్లో వున్నారు. మిగిలిన వారికి సంఘాలు లేవు. డిమాండ్లు లేవు. క్రమంగా వీళ్ళ సంఖ్య పెరుగుతోంది. ఎక్కువ మంది పిల్లలు, నోరున్న వాళ్ళ పిల్లలు ఇప్పుడు వాళ్ళ దగ్గరున్నారు. విచిత్రం ఏమంటే బక్కచిక్కిన టీచర్ల దగ్గర స్థితిమంతుల పిల్లలున్నారు. శక్తివంతులైన టీచర్ల వద్ద బక్కచిక్కిన వాళ్ళ పిల్లలున్నారు.

(తరువాయి 16వ పేజీలో)

# డిటెన్షన్‌తో విద్యా హక్కుకు విఘాతం

ప్రాథమిక విద్యలో నాన్ డిటెన్షన్ విధానాన్ని ఎత్తివేయాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం విద్యా హక్కు చట్టాన్ని సవరించే బిల్లును పార్లమెంట్‌లో పెట్టబోతున్నట్లు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖామాత్యులు ప్రకాశ్ జవదేవకర్ ప్రకటించారు. రాజ్యాంగంలో ఆర్టికల్ 21ఏ ద్వారా ఎనిమిదవ తరగతి వరకు విద్యను ప్రాథమిక హక్కుగా ప్రకటించిన విషయం తెలిసిందే. 6-14 సంవత్సరాల వయస్సులో బాలల అందరూ నిర్బంధంగా బడుల్లో ఉండాలి. సెక్షన్-16 ప్రకారం బడిలో చేరిన విద్యార్థులను ఎనిమిదవ తరగతి పూర్తయ్యే వరకు మధ్యలో ఏ తరగతిలోనూ ఆపకూడదు. లేదా బహిష్కరించకూడదు. ఈ నిబంధనను సవరించి ఐదవ తరగతికి మరియు ఎనిమిదవ తరగతి పరీక్షలు నిర్వహించి అందులో ఫెయిల్ అయిన వారిని అదే తరగతిలో ఆపేయాలి (డిటెయిన్) అని కేంద్ర ప్రభుత్వం నిర్ణయిం చింది.



నాగటి నారాయణ
STFI జాతీయ ఉపాధ్యక్షులు

ప్రథమ్ సంస్థ సర్వేలు, విద్యాశాఖల నివేదికల ప్రకారం ప్రతి తరగతిలోనూ నిర్దేశిత కనీస అభ్యసన సామర్థ్యాలను సగంమంది విద్యార్థులు మాత్రమే సాధించ గలుగుతున్నారు. జాతీయ విద్యా ప్రణాళిక మరియు పరిపాలన విశ్వవిద్యాలయం (ఎన్‌యుఇపిఏ) ప్రచురించిన 2015-16 యు-డైస్ గణాంకాల ప్రకారం దేశంలో మొత్తం పాఠశాల విద్యార్థులు 26.06 కోట్లమంది ఉన్నారు. వారిలో 5వ తరగతిలో 2.50 కోట్లు మరియు 8వ తరగతిలో 2.20 కోట్లు వెరసి 4.70 కోట్లమంది ఉన్నట్లు నివేదికలో పేర్కొనబడింది. ఇప్పుడు కూడా దాదాపు అదే సంఖ్యలో ఉండవచ్చు. వారిలో 98% మంది 'నో డిటెన్షన్' పాలసీతో ప్రమోట్ అవుతుంటారు. డిటెన్షన్ పాలసీ వస్తే దాదాపు సగంమంది ఫెయిలవుతారు. వీరిలో అత్యధికులు ప్రభుత్వరంగ పాఠశాలల్లోని దళిత, గిరిజన, బహుజనుల విద్యార్థులే. బడిలో దక్కే అరకొర చదువు దిక్కయిన వారికి పాసయ్యే అవకాశం బహుతక్కువ.

పాఠశాల విద్యలో పాస్, ఫెయిల్ పరీక్షా విధానం సరైంది కాదని, అది బట్టీ చదువులకే పరిమితంచేసి విద్యార్థుల సృజనాత్మక శక్తిని చిదిమేస్తుందని చాలాకాలం చర్చ జరిగింది. ఏడాది చివరిలో ఒకేసారి జ్ఞాపకశక్తిని పరీక్షించడంకంటే విద్యార్థి సమగ్ర మూర్తిమత్వానికి తోడ్పడే నిరంతర మదింపు విధానం కావాలని అందరూ ఆశించారు. పరీక్షల సంస్కరణల్లో భాగంగానే నిరంతర సమగ్ర మూల్యాంకనం (సిసిఈ) విధానం వచ్చింది. విద్యార్థుల అభ్యసన సామర్థ్యా లను పాస్ ఫెయిల్‌గా కాకుండా గ్రేడ్‌లుగా ప్రకటిస్తారు. డి,సి, గ్రేడ్‌ల విద్యార్థుల అభ్యసనకు అదనపు అవకాశాలను కల్పించి బి,ఏ గ్రేడులకు ఎదగటానికి సహాయం చేయాలి. విద్యాహక్కు చట్టం ప్రకారం 1-8 తరగతులకు నిరాటంకంగా విద్యను కొనసాగించేందుకు సిసిఈ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించబడింది. ఈ విధానం సరిగా అమలు చేయకపోవడమే అసలు సమస్య. దానిని పట్టించు కోకుండా నో డిటెన్షన్ విధానం వలనే అభ్యసనా ప్రమాణాలు పడిపోతున్నా యని, అందుకే డిటెన్షన్ విధానం తేవాల్సి వస్తోందని ప్రభుత్వం చెబుతోంది. డిటెన్షన్ విధానం తో అభ్యసన సామర్థ్యాలు, విద్యా ప్రమాణాలు పెరుగు తాయని ఏ విద్యా కమీషన్ నివేదికలోనూ చెప్పలేదు. పరీక్షల వలన విద్యార్థులు ఆందోళనకు, మానసిక ఒత్తిడి కి గురవుతారని, ఫెయిలైన వారు న్యూనతా భావంతో, అవమానాలతో కుంగిపోయి ఆత్మహత్యల పాలవుతారనే విషయం తెలియని దేమీకాదు.

బడి పిల్లలు నిర్దేశిత అభ్యసన సామర్థ్యాలను సాధించలేక పోవడానికి ప్రధానంగా ఐదు కారణాలు ఉన్నాయి. విద్యాహక్కు చట్టంలో పేర్కొన్న వసతుల ప్రమాణాలతో పాఠశాలలు లేకపోవడం, ప్రభుత్వ పాఠశాలల్లో తగినంతమంది ఉపాధ్యాయులు లేకపోవడం, విద్యా సంవత్సరంలో 220 పని దినాలతో వేయిగంటల ఇన్‌స్ట్రక్షన్ అమలు జరగకపోవడం, ఇంట్లో తల్లిదండ్రులు బిడ్డల చదువు గురించి తెలుసుకుంటూ అవసరమైన మద్దతు అందించే పరిస్థితి పేద కుటుంబాల్లో లేకపోవడం. ఈ కారణాలకు బాధ్యుడు కాని విద్యార్థిని డిటెన్షన్‌తో శిక్షించడం న్యాయంకాదు. కారణాలుగా పేర్కొన్న లోపాలు అన్నింటికీ సర్కారు బడులు నిలయాలు. అందువలన వాటిలో చదువుకునే బడుగు, బలహీన వర్గాల విద్యార్థులే డిటెన్షన్ ప్రయోగానికి బలవుతారు.

కేంద్రంలోని బిజెపి పరిపాలనలో ప్రభుత్వ విద్యను నియంత్రించి, ప్రైవేటు విద్యను ఎగదోయడం ఎక్కువైంది. అందులో భాగంగానే డిటెన్షన్ విధానాన్ని తీసుకొస్తోంది. ఏ చట్టాన్ని లెక్కచేయని ప్రైవేటు స్కూళ్ళ యాజమాన్యాలు డిటెన్షన్ కోసం తెచ్చే సవరణ చట్టాన్ని అమలు చేయవు. విద్యార్థులు ఫెయిలైతే విద్యావ్యాపారానికి నష్టం. అందువల్ల ప్రైవేట్ స్కూళ్లు విద్యార్థులను ఫెయిల్‌కానివ్వవు. 'సర్కార్ బడుల్లో ఫెయిలవుతారు', 'ప్రైవేట్ స్కూల్స్‌లో అయితే పాసవుతారు' అనే పబ్లిసిటీతో ప్రైవేట్ విద్యావ్యాపారం మరింత పెరిగిపోతుంది. ప్రభుత్వ పాఠశాలలు పతనమవుతుంటాయి. వెరసి పాఠశాల

విద్యను ప్రైవేట్‌రంగానికి కట్టబెట్టాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతోంది. అందరికీ కనీసం పాఠశాల విద్యను నిర్బంధంగా అందించాలనే రాజ్యాంగ ఆదేశాల అమలుకు నాన్ డిటెన్షన్ విధానాన్నే కొనసాగిం చాలి. పాస్, ఫెయిల్‌కు నిమిత్తంలేకుండా ప్రతి విద్యార్థి కనీస అభ్యసన సామర్థ్యాలను సాధించగలిగే ఏర్పాట్లు ప్రభుత్వమే చేయాలి. ప్రతి పాఠశాలకూ తరగతికి ఒక ఉపాధ్యాయుడు చొప్పున ఉండాలి. దీర్ఘకాలిక సెలవుల్లో ఉండే ఉపాధ్యాయుల బాధ్యతల నిర్వహణకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి. ఉపాధ్యాయులకు శిక్షణ, సమావేశా లను పనిదినాల్లో నిర్వహించకూడదు. బడి పనిదినాలు, టైమ్ టేబుల్, సిలబస్ కవరేజీ, మూల్యాంకన కర్తవ్యాలను సకాలంలో సమర్థ వంతంగా అమలు చేయించే పర్యవేక్షణ, మోనిటరింగ్ వ్యవస్థను పటిష్టంగా పనిచేయించాలి. పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, లెర్నింగ్ మెటీరియల్ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులు అందరికీ ఉచితంగా అందించాలి. అభ్యసనలో వెనకబడే, మందకొడిగా వుండే విద్యార్థులకు అదనపు బోధన ఏర్పాట్లు చేయాలి. నిరంతర సమగ్ర మూల్యాంకన విధానాన్ని సరళతరం చేసి సమర్థవంతంగా అమలు చేయడానికి అవసరమైన సాధనాలను సమకూర్చి ఉపాధ్యాయులను సంసిద్ధం చేయాలి. ఈ చర్యలతో విద్యార్థులను ఎనిమిదవ తరగతి వరకు ఏ తరగతిలోనూ డిటెయిన్ కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

డిటెన్షన్ విధానాన్ని తేవటానికి కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖామాత్యులు చెబుతున్న కారణాలు సమంజసంగా లేవు. అభ్యసన సామర్థ్యాలు, విద్యా ప్రమాణాలను పరిశీలించిన ప్రథమ్, న్యూపా నివేదికల్లోనే కారణాలు, పరిష్కార మార్గాలు కూడా సూచించబడినవి. వాటి అమలుకు ప్రయత్నం చేయకపోగా గత మూడు సంవత్సరాల నుంచి కేంద్ర బడ్జెట్‌లో విద్యాహక్కు చట్టాన్ని అమలు చేసే సర్వశిక్షా అభియాన్‌కి 15% నిధులు తగ్గించడం జరిగింది. కేంద్రం నిర్బంధం చేసిన టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) వలన చాలా రాష్ట్రాల్లో ఉపా ధ్యాయ నియామకాలు స్థంభించిపోయాయి. కంటిన్యూస్ కాంప్రి హెన్సివ్ ఎవాల్యూవేషన్ (సిసిఈ) విధానాన్ని చాలామంది ఉపాధ్యాయులే అర్థం చేసుకోలేదని నివేదికల్లో తేలింది. వారు అర్థం చేసుకునే ఏర్పాట్లను చేయకపోవడం వల్లనే ఆచరణలో అసంతృప్తి పాలయింది. 25 రాష్ట్రాలు కోరినందున డిటెన్షన్ విధానాన్ని తేవాల్సి వస్తోందని చెప్పడం కేంద్ర ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనం. రాష్ట్రాలు ఎత్తిచూపే సమస్యలను పరిష్కరించాలే తప్ప చట్టాన్నే సవరించడం సరైందికాదు. 'చట్టాన్ని సవరిస్తాం, దానిని అమలు చేయాలా లేదా అనేది రాష్ట్రాల ఇష్టం' అని జవదేకర్ చెప్పడం మరీ విడ్డూరం. అయితే అసలు విద్యాహక్కు చట్టమే అమల్లో లేదని కాగ్ నివేదిక కడిగేసింది. ఆ విషయాన్ని పరిశీలించకుండా సవరణ చేయడం ఎందుకు? విద్యాహక్కును దెబ్బతీసే విధానాన్ని తెచ్చి పెట్టే డిటెన్షన్ బిల్లు సమర్థనీయం కాదు. దానిని ఉపసంహరింప జేసేందుకు విద్యారంగ శ్రేయోభిలాషులు తమ శక్తిమేరకు కృషి చేయాలి. పార్లమెంట్ సభ్యులు బిల్లును వ్యతిరేకించాలి. బడిఈడు పిల్లలకు నిర్బంధ ఉచిత ప్రాథమిక విద్యకు భరోసా కల్పించాలి.

## రచయితలకు ఆహ్వానం

సృజనాత్మకత, అభ్యుదయ భావజాలం కల్గిన రచనలను ఐక్య ఉపాధ్యాయ పాఠకులకు అందించాలనే లక్ష్యంతో కథలు, వ్యాసాలు, కవితలు పంపవలసిందిగా రచయితలను ఆహ్వానిస్తున్నాము. సామాజిక వాస్తవాన్ని ప్రతిబింబించే ఏ అంశాన్నైనా వస్తువుగా తీసుకుని రచనలు పంపండి. అనుకరణ, అనువాదం కాకుండా స్వీయ రచన అయి ఉండాలి. హామీ పత్రం జత పరచండి. ప్రచురనార్హమైన రచనలను సమయాను కూలంగా "ఐక్య ఉపాధ్యాయ" లో ప్రచురిస్తాము. రచనతోపాటు రచయిత ఫోటో, చిరునామా, ఫోన్ నంబరు పంపండి.

**– సంపాదకవర్గం, ఐక్యఉపాధ్యాయ**

**రచనలు పంపవలసిన చిరునామా :**

**చీఫ్ ఎడిటర్, ఐక్యఉపాధ్యాయ,** 27–31–11, గవర్నపేట,
పాలపర్తివారి వీధి,
విజయవాడ– 520002
మెయిల్ : ikyopadhyaya1975@gmail.com

## పాఠకుల అభిప్రాయాలు పంపండి


**"ఐక్యఉపాధ్యాయ"** మాసపత్రిక ఉపాధ్యాయ సమస్యలు, ఉద్యమాలతో పాటు అనేక సామాజిక, ఆర్థిక, అకడమిక్ అంశాలపై వ్యాసాలు ప్రచురిస్తోంది. కథలు, కవితలతో పాటు పలు శీర్షికలు నిర్వహిస్తోంది. వీటిపై పాఠకుల ప్రతిస్పందనను ఆహ్వానిస్తున్నది. పత్రికలో ప్రచురితమైన అంశాలపై మీ అభిప్రాయాలు మరియు ఏ అంశాలు వుంటే బాగుంటుందో మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. మీ అభిప్రాయాలు క్లుప్తంగా, సూటిగా ఉత్తరాల ద్వారాగానీ, మెయిల్ ద్వారాగానీ తెలియజేయగలరు.

**ఉత్తరాల ద్వారా ....** **"ఐక్యఉపాధ్యాయ",** యుటియఫ్ ఆఫీస్, పాలపర్తివారివీధి, గవర్నరుపేట, విజయవాడ– 520002.

**E-Mail** : **ikyopadhyaya1975@gmail.com**కి పంపవచ్చు.

**– సంపాదకవర్గం**

# ఆనాటి విలువలు తరిగిపోయాయా?



చుక్కా రామయ్య

దేశంలో ఏటా మనం రెండు ప్రజా పండుగలు చేసుకుంటున్నాం. ఒకటి పంద్రాగస్టు కాగా, రెండోది రిపబ్లిక్ డే. పంద్రాగస్టు వేడుకల సందర్భంగా స్వాతంత్ర్య ఉద్యమ కాంక్షలు ఎంతవరకు నెరవేరాయో నెమరు వేసుకుంటే... రిపబ్లిక్ డే రోజున రాజ్యాంగ లక్ష్యాలు ఎంతవరకు పరిపుష్టమయ్యాయో ఆత్మావలోకనం చేసుకొని కొత్త లక్ష్యాలను ఎంచుకుంటూ ముందుకెళ్తున్నాం. మన దేశంలో స్వాతంత్ర్యం కోసం పోరాటం ఎన్నో ఒడిదుడుకులకు గురైంది. భావితరాల స్వేచ్ఛ కోసం, స్వతంత్రంగా బతకడం కోసం ఎంతోమంది మహనీయులు ప్రాణ త్యాగాలు చేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో మనం సాధించుకున్నది లౌకికవాదం. మహత్తర పోరాటం ద్వారా మనకు సంక్రమించిన గొప్ప వారసత్వం కూడా అదే. అందుకే మన రాజ్యాంగంలో సెక్యులరిజానికి ఎక్కువ ప్రాధాన్యం కల్పించారు. అదే నాటి పోరాటం గొప్ప విలువ. ప్రస్తుత పరిస్థితుల్లో దేశంలో సెక్యులరిజానికి విలువ తరుగుతున్నదా? పెరుగుతున్నదా? అనేది నేడు ఆత్మావలోకనం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

ఆనాటి మహా పోరాటంలో కొంతభాగం చూసే అవకాశం నాకు లభించింది. దేశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా దాన్ని నేను ప్రస్తావించక తప్పడంలేదు. నాటి మన 'స్వాతంత్ర్య సాధన స్వప్నం' ఒకేరకమైన నాయకత్వం కింద సాకారం కాలేదు. వంద పూలు వికసించాలనే భావన ఆ రోజుల్లో ఉండేది. అందువల్లే ఓవైపు అంబేద్కర్ వస్తే... మరోవైపు నుంచి గాంధీజీ వచ్చారు. అలాగే సుభాష్ చంద్రబోస్, జవహర్‌లాల్ నెహ్రూ, ఈఎంఎస్, డాంగే ఇలా... రక రకాల భావజాలం, ఆలోచనలతో కలగలిసిన గొప్ప నాయకత్వం పుట్టుకొచ్చింది. ఆనాడు నాయకత్వం ఎక్కడా కేంద్రీకృతం కాలేదు. అందువల్లే గొప్ప రాజ్యాంగాన్ని ఏర్పాటు చేసుకోలిగాం. వారు వేసిన ఆ పునాదులే ఈ దేశాన్ని ఇప్పటికీ సమైక్య భావనతో ఉంచగలుగుతున్నాయి అనడంలో ఎలాంటి సందేహం లేదు. దేశంలో ఆనాటి మహనీయులు ఏ ఆశయాల కోసం ప్రాణత్యాగం చేశారో ఆ స్ఫూర్తి నేడు కరువైపోతోంది. కేంద్రీకృతమైన రాజకీయాలవైపు పోతున్నాం. తద్వారా ప్రజా సమస్యల్ని పరిష్కరించడంలో విఫలమవుతున్నామనే చెప్పాలి.

స్వాతంత్ర్య సంగ్రామంలో స్వాతంత్ర్యం, జాతీయవాదమే నినాదం. యూనివర్సిటీల్లోనైనా, గ్రామాల్లోనైనా జనాలను సమీకరించడం, వారిని పోరాటంలో భాగస్వాముల్ని చేయడం ఆనాడు ప్రధానంగా భావించేవారు. ఈ నేపథ్యంలో ఎక్కువగా రైతులు, కార్మికులపైనే కేంద్రీకరించారు. కాబట్టి ఆ తరం వారికి అవే విలువలు వారసత్వంగా వచ్చాయి. అయితే కొందరు మతం ప్రాతిపదికన జనాన్ని సమీకరించి తద్వారా వారిని ఏకం చేసేందుకు ఆ దిశగా ప్రయత్నాలు చేశారు. అందుకే బ్రిటిష్ వాళ్లు మత ప్రాతిపదికన దేశాన్ని చీల్చారు. సిమ్లా కాన్ఫరెన్స్ వరకు కాంగ్రెస్ దాన్ని వ్యతిరేకించినా చివరకు బ్రిటిష్‌వారి పెత్తనం నుంచి దేశాన్ని విముక్తిచేసేందుకు రాజీపడక తప్పలేదు. ఆనాడు ప్రగతిశీల ఉద్యమమంతా మత ప్రాతిపదికన కాకుండా సెక్యులర్ భావాలపైనే కొనసా గింది. వికేంద్రీకరణ ఆధారంగా పోరాటాలు జరిగాయి. ఆనాటి ఉద్యమంతో నేటి పరిస్థితుల్ని బేరీజు వేసుకొని చూస్తే... మత శక్తులు మళ్లీ ప్రతి అంశాన్ని రాజకీయాలతో ముడి పెడుతున్నట్లు కనబడుతోంది. ఈ నేపథ్యంలో స్వాతంత్ర్య ఉద్యమంలో మనం సాధించుకున్న విలువలు తరిగిపోయాయా? అనిపిస్తోంది.

నేడు దేశంలో విపరీతంగా పెరుగుతోన్న జనాభాతో పాటు అనేక కొత్త సమస్యలు కూడా పుట్టుకొస్తున్నాయి. అవినీతి ప్రధానంగా ప్రతిస్థాయిలోనూ పట్టి పీడిస్తోంది. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో నల్లధనం విపరీతంగా పేరుకుపోతోంది. నల్లధనం ఉత్పత్తి జరుగుతున్న దేశాల్లో భారత్‌ది నాలుగోస్థానం అంటేనే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. అంతేకాదు! మహిళలకు భద్రత కరువవుతోంది. ఎన్ని చట్టాలు తీసుకొచ్చినా ఏమాత్రం వ్యవస్థలో మార్పు రావడంలేదు. దేశంలో ప్రతి రెండు గంటలకు సుమారు ఏడుగురు మహిళలు లైంగిక దాడులకు గురవుతున్నారని ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి. ఇక కిడ్నాప్‌లు, వేధింపులకు గురవుతున్న మహిళల సంఖ్య వేల సంఖ్యలోనే ఉంది. ఇక శిశు మరణాలు, ఆకలి చావులు ఇలా చెప్పుకుంటూపోతే సమస్యల చిట్టా చాంతాడంత ఉంది. ఎన్ని ప్రభుత్వ శాఖలు ఏర్పాటుచేసినా వాటి మధ్య సమన్వయ లోపం, పర్యవేక్షణ కరువవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉంటున్నాయి. ఏ పార్టీలు అధికారంలోకి వచ్చినప్పటికీ... ఎన్నికలను డబ్బుమయం చేసి రాజకీయాలను భ్రష్టు పట్టించారు. దేశంలో రైతుల ఆత్మహత్యలు ఆగడం లేదు. కార్మికుల హక్కులకు రక్షణ కరువవుతోంది. స్వాతంత్ర్యం తొలి రోజుల్లో వచ్చిన ప్రభుత్వాలు కార్మికులకు అనుకూల విధానాలను తీసుకుంటూ అభివృద్ధిలో నడిస్తే... నేడు కొద్దిమంది పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉండే విధానాలతో మన ప్రభుత్వాలు నడుస్తున్నాయి. అదే ఆనాటికి నేటికీ ఉన్న ప్రధాన తేడా. ఉద్యమ స్వరూపాన్ని నాటి పార్లమెంట్ ప్రతిబింబిస్తే... ఈనాడు పార్లమెంట్‌కు వెళ్తున్న అధికశాతం మందికి అనుకూలంగా విధానాలను ప్రభుత్వాలు తీసుకొచ్చేలా వ్యవహరిస్తున్నాయి.

నాటి ఉద్యమంలో ఫ్యూడల్ శక్తుల్ని బలహీనపరిచే దిశగా విధానాలు కొనసాగిస్తే... ఈనాడు మళ్లీ అవే శక్తులను బలపరిచే విధానాలు వస్తున్నాయి. తద్వారా అణగారిన వర్గాల సంక్షేమాన్ని పెడచెవిన పెడుతూ స్వాతంత్ర్య ఉద్యమస్ఫూర్తి నుంచి తప్పుతున్నామా అనే అనుమానం కలుగుతోంది. ఆనాడు స్వేచ్ఛ ఎక్కువగా ఉండేది. స్వాతంత్ర్య ఉద్యమంలో భిన్నాభిప్రాయాలు, వైరుధ్యాలు కనబడేవి. అందరి అంతిమ లక్ష్యం ఒక్కటే అయినప్పటికీ దాన్ని సాధించేందుకు అనుసరించాల్సిన మార్గాలపై వేరువేరు అభిప్రాయాలను వ్యక్తం చేసేవారు. కాంగ్రెస్‌తో పాటు కమ్యూనిస్టు పార్టీ, సోషలిస్టు పార్టీలు వచ్చాయి. అయితే, ఈనాడు అలాంటి వైరుధ్యాలను భరించే పరిస్థితి కనబడకపోవడం ఆందోళనకరం. ఈనాడు సెన్సార్‌షిప్ వస్తోంది. నాటి

ప్రజాస్వామ్యంలో అందరి అభిప్రాయాలను గౌరవించేవారు. ఈనాడు అలాంటి వాటిని భరించే పరిస్థితి కూడా లేకుండా పోతోంది. ప్రతిపక్షాలు చేసే విమర్శల్ని సైతం తట్టుకోలేని పరిస్థితులు దాపురించాయి. ప్రజాస్వామ్య మనుగడకు ఇదెంతో ప్రమాదం. ఒక ప్రజా ప్రతినిధి మాట్లాడిన దాన్ని సెన్సార్ చేయడం వాక్ స్వాతంత్ర్యంపై దాడి చేయడమే అవుతోంది. ఈనాడు దేశంలో ఇలాంటి పరిస్థితులే తలెత్తుతుండటం బాధాకరం. గతంలో అమెరికాలోని బర్కిలీ విశ్వ విద్యాలయంలో వాక్ స్వాతంత్ర్యంపై దాడిని నిరసిస్తూ పెద్దఎత్తున ఉద్యమం వచ్చింది. విద్యార్థి సంఘాల నేతల ఉపన్యాసాలను వీసీ సెన్సార్ చేసేవారు. దీన్ని వ్యతిరేకిస్తూ అక్కడి విద్యార్థులు కదంతొక్కి చివరకు అపూర్వమైన విజయం సాధించారు. ఏ దేశంలోనైనా వాక్ స్వాతంత్ర్యంపై దాడి జరిగితే దానిపై రాజీలేని పోరాటం చేయాల్సిందే.

స్వాతంత్ర్య ఉద్యమం మనకు రెండు సందేశాలను ఇచ్చింది. ఒకటి సోషలిజం కాగా, రెండోది సామాజిక న్యాయం. ఈ రెండింటినీ సాధించేందుకు అద్భుతమైన రాజ్యాంగాన్ని కూడా రూపొందించారు. ఇది 'రాజ్యాంగం' అనేకంటే 'గత తరం వీలునామా' అంటే బాగుంటుందేమో. మనం ఆ త్యాగధనుల వారుసలం. వాటిని ఎంతవరకు నిలబెట్టుకుంటామోనని చరిత్ర ఎదురుచూస్తోంది. ఆ ఉద్యమంలో ఎంతోమంది మహానుభావులు రక్తతర్పణం చేశారు. కష్టాలు అనుభవించారు. వారి ఆశయాలను కొనసాగించేందుకు ఉద్యుక్తులు కావడమే నేటితరం ముందున్న సవాల్.

స్వాతంత్ర్య సంగ్రామంలో స్వాతంత్ర్యం, జాతీయ వాదమే నినాదం. యూనివర్సిటీల్లోనైనా, గ్రామాల్లోనైనా జనాలను సమీకరించడం, వారిని పోరాటంలో భాగస్వాముల్ని చేయడం ఆనాడు ప్రధానంగా భావించేవారు. వికేంద్రీకరణ ఆధారంగా పోరాటాలు జరిగాయి. ఆనాటి ఉద్యమంతో నేటి పరిస్థితుల్ని బేరీజు వేసుకొని చూస్తే... మత శక్తులు మళ్లీ ప్రతి అంశాన్ని రాజకీయాలతో ముడి పెడుతున్నట్లు కనబడుతోంది. ఈ నేపథ్యంలో స్వాతంత్ర్య ఉద్యమంలో మనం సాధించుకున్న విలువలు తరిగిపోయాయా? అనిపిస్తోంది.! ☯

– ప్రజాశక్తి దినపత్రిక సౌజన్యంతో



## ఉపాధ్యాయ దినోత్సవం

–కుప్పలి కామేశ్వరరావు, శ్రీకాకుళం జిల్లా

**అందుకో వందనాలు - డాక్టర్ సర్వేపల్లి**
**గగన తారగ వెలిగిన - గురువుల రాజలె&**
**మా గురువుల రాజలె "అందుకో"**

**సీతమ్మ, వీరాస్వామయ్యల - గారాల బిడ్డగ**
**తిరుత్తరణిలో జన్మించి - తిరుపతిలో చదివావు**
**సెప్టెంబరు ఐదు మీ పుట్టిన రోజంట**
**ఉపాధ్యాయులకందరికది - పండగరోజంట "అందుకో"**

**వివిధ మతాలసారము - విద్యార్థి దశలోనె**
**ఔపోసన చేసుకొని - తార్కిక ఆలోచనతో**
**తత్వశాస్త్రాన్ని నీవు - తర్కించుకున్నాము**
**అరిస్టాటిల్, ప్లేటోల వారి సరసన చేరావో "అందుకో"**

**శివకాశమ్మను - భాగస్వామిగ పొంది**
**వేదాంతమున నీతి - శాస్త్రమునే రచియించి**
**ప్రపంచ మేధావులచే - మన్ననలే పొందావు**
**సత్యాన్వేషణతోనే - సాగమన్నావయ్యా "అందుకో"**

**గురువుగా జీవితం - ప్రారంభించావు**
**గురుతర బాధ్యతలెన్నో - గుర్తెరుగమన్నావు**
**విశ్వ విద్యాలయాల - ఆచార్యునిగా వెలిగి**
**రాష్ట్రపతిగా నీవు - రాజ్యం ఏలావో "అందుకో"**

**జాతీయ నాయకునిగ - జనం మధ్య నిలిచావు**
**గురుదేవుల గుండెలలో - గుర్తుండి పోయావు**
**కులం, మతంకంటే - మానవతే ముఖ్యమని**
**ఖండ, ఖండాలలో - ఖ్యాతిని పెంచావో**
**భరత ఖ్యాతిని పెంచావో "అందుకో"**

# విద్యా వ్యాపారానికే సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ చట్టం

విద్యను వ్యాపారం చేసేందుకే ఏపి సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ ఇండిపెండెంట్ పాఠశాలల చట్టం–2017ను రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిందని ఫ్యాప్టో విమర్శించింది.

యాక్ట్–2017పై ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఆగస్టు 13వ తేదీన విజయవాడలో రాష్ట్ర సదస్సు జరిగింది.

సదస్సుకి అధ్యక్షత వహించిన ఫ్యాప్టో చైర్మన్ పి.బాబురెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేయుటకే ఈ చట్టం తెస్తున్నారని ఇది అమలు అయితే రాష్ట్ర విద్యారంగం కార్పొరేట్ వ్యాపారవేత్తల చేతుల్లోకి వెళుతుందని విమర్శించారు.

ముఖ్య అతిథులుగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఈ చట్టం రూపొందించే ముందు ప్రభుత్వం ఎవరితో చర్చించిందని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రతియేటా 25వేల కోట్ల విద్యా వ్యాపారం జరగొచ్చని ఫిక్కి అంచనా వేసిందని, వారి సలహాలతో ఈ చట్టం రూపొందిందని అన్నారు.

ఏపి విద్యా పరిరక్షణ కమిటీ కన్వీనర్ రమేష్ పట్నాయక్ మాట్లాడుతూ విద్యారంగం ప్రభుత్వం చేతిలో ఉంటేనే అందరికి విద్య అందుతుందని, ప్రజలు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు.

ఉపాధ్యాయ మాస పత్రిక ప్రధాన సంపాదకులు షేక్ జిలానీ మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలల ఫీజులు ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నారని, సొంత సిలబస్, పాఠ్యపుస్తకాలు ఉపయోగిస్తున్నారని ఈ చట్టం వాటికి ఆమోదముద్ర వేయనుందని అన్నారు.

టీచర్ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ ఈ చట్టం వల్ల కార్పొరేట్ విద్య బలపడుతుందని, దీన్ని శాసనమండలిలో ఎదుర్కొంటామని అన్నారు.

ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ జి.హృదయరాజు మాట్లాడుతూ ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ పోరాటాలు చేపట్టాల్సిన బాధ్యత ఉపాధ్యాయ సంఘాలపై ఉందన్నారు.

ఈ సదస్సులో ఫ్యాప్టో కో–చైర్మన్‌లు పాండురంగ వరప్రసాద్, జోసెఫ్ సుధీర్‌బాబు, డి.కృష్ణయ్య, జి.నారాయణరెడ్డి, జెఏసి సెక్రటరీ జనరల్ ఐ.వెంకటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు సిహెచ్.వెంకటేశ్వర్లు, కె.వెంకటేశ్వరరావు, ఎన్.వి.రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 1 ఉద్యోగులకు చీకటి రోజు





ఆంధ్రప్రదేశ్‌లోని ఉద్యోగుల, ఉపాధ్యాయులు, కార్మికులకు "సెప్టెంబర్ 1వ తేదీ చీకటి రోజు". ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న ట్రిపుల్ బెన్‌ఫిట్ పెన్షన్ పథకం రద్దు చేస్తూ ఆనాటి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఉద్యోగులందరికీ జీవితాల్లో చీకటి నింపిన రోజు.

కేంద్ర ప్రభుత్వం 1.1.2004 నుండి తెచ్చిన నూతన పెన్షన్ పథకంలో భాగంగా 1.9.2004 నుండి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం అమలులోకి వచ్చింది.

2003 డిసెంబర్ 22 ఆనాటి ఎన్‌డిఏ (బిజెపి) ప్రభుత్వం తెచ్చిన కార్య నిర్వహక ఉత్తర్వులతో మొదలైన 2013 సెప్టెంబర్ 4వ తేదీన ఆనాటి యుపిఏ-2 కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రతిపక్షం (బిజెపి)తో కలిసి పిఎఫ్‌ఆర్‌డిఏ చట్టం తేవడంతో ఉద్యోగులంతా పెన్షన్ కోల్పోయారు. ఉద్యోగి రిటైర్ అయిన తర్వాత వృద్ధాప్యంలో సాధారణ జీవితం గడపాలని, ఇది ఒక సామాజిక భద్రతగా ఉండాలని, పెన్షన్ ఉద్యోగి హక్కు అని దేశంలోని అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును సైతం అమలు చేయకుండా రాజకీయ నిర్ణయంతో తెచ్చిన పిఎఫ్‌ఆర్‌డిఏ చట్టం ఉద్యోగుల జీవితాలను తారుమారు చేసింది.

గడిచిన 13 సం॥లు దేశవ్యాపితంగా 56 లక్షలమంది సిపిఎస్ పరిధిలోకి వచ్చారు. మన రాష్ట్రంలో 1.84వేలు మందివరకు ఉన్నారు. ఈ కాలంలో కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం ప్రభావం ఉద్యోగుల్లో తీవ్ర అభద్రతను కల్పించింది. ఉద్యోగానంతరం కుటుంబాల పరిస్థితి ఏమిటి? అనే ప్రశ్న, ఆందోళనగా మారింది. ఆందోళన ఉద్యమంగా మారింది. 19 రాష్ట్రాల్లో సిపిఎస్ రద్దు కోసం ఉద్యమాలు ఊపందుకున్నాయి. 2017 సెప్టెంబర్ 1వ తేదీన విజయవాడలో జరిగిన సిపిఎస్ మిలినీయం మార్చ్‌కి యుటియఫ్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని ఉపాధ్యాయ సంఘాలు, జెఏసిలు మద్దతు ప్రకటించాయి.

ఈ దశలో ఉద్యమానికి సరైన దిశానిర్దేశం ఉండాలి. కొన్ని అంశాలపై స్పష్టత ఉండాలి. సిపిఎస్ రద్దు చేయాలనేదే ప్రధాన డిమాండ్‌గా ఉండాలి.

### చట్టం ఎవరు తెచ్చారు?

2003 ఎన్‌డిఏ (బిజెపి) ప్రతిపాదించిన నూతన పెన్షన్ విధానాన్ని 2013లో యుపిఏ-2 ప్రభుత్వం, ప్రతిపక్షమైన బిజెపి సహకారంతో పిఎఫ్‌ఆర్‌డిఏ చట్టాన్ని తెచ్చింది. ఎప్పుడూ కార్మికుల, ఉద్యోగులకు మద్ధతుగా ఉండే వామపక్షాలు తప్ప దాదాపు అన్ని పార్టీలు బిల్లును ఆమోదించాయి. వామపక్షాల అభ్యంత రాలతో 10 సం॥లు పాటు బిల్లు ఆగింది.

కాని 2013లో పాలక పార్టీ (కాంగ్రెస్) ప్రతిపక్షం (బిజెపి) ఒక్కటై పిఎఫ్‌ఆర్‌డిఏ చట్టాన్ని తెచ్చి మన పెన్షన్ రద్దు చేశారు. ఆనాటికి వామ పక్షాలు అధికారంలో ఉన్న కేరళ, బెంగాల్, త్రిపుర రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రమే నూతన పెన్షన్ పథకాన్ని వ్యతిరేకించాయి. పాత పెన్షన్ కొనసాగిస్తూ తీర్మానించాయి. ఇప్పటికీ త్రిపుర, బెంగాల్ రాష్ట్రాలు పాత పెన్షన్ పథకంలో కొనసాగుతున్నాయి.

పిఎఫ్‌ఆర్‌డిఏ చట్టం కాకుండానే 2004 సెప్టెంబర్ నుండి ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం (వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా) అమలు చేసింది.

2014లో నూతనంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రానికి పాత పెన్షన్ పథకం లేదా కాంట్రిబ్యూటరీ పెన్షన్ దేనిలో కొనసాగాలనే ఆప్షన్ ఉన్నప్పటికీ సిపిఎస్‌నే ఆమోదించింది. పిఎఫ్‌ఆర్‌డిఏ చట్టాన్ని ఆమోదించిన వారిలో తెలుగు దేశం పార్టీ కూడా ఉంది. 2017 మార్చి బడ్జెట్ సమావేశాల్లో ఆంధ్రప్రదేశ్ ఆర్థికమంత్రి సిపిఎస్ అమలు చేసినందుకు మన రాష్ట్రానికి 3 అవార్డులు వచ్చాయని గొప్ప విజయంగా సాక్షాత్తు అసెంబ్లీలో ప్రకటించారు.

రాష్ట్ర వ్యాపితంగా జరిగిన అనేక పోరాటాలు, ప్రాతినిధ్యాలు ఫలితంగా ఆంధ్రప్రదేశ్‌లో గ్రాడ్యుటీ, ఫ్యామిలీ పెన్షన్ ఉత్తర్వులు ఇవ్వడం కొంత ఉపశమనం కల్గించే విషయమే అయినా సిపిఎస్ రద్దు చేయాలి.

### ఎవరు రద్దు చేయాలి?

ఎవరు చట్టం చేశారో వారే రద్దు చేయాలి. మన పెన్షన్ హక్కును రద్దుచేసిన పాలకులే (రాజకీయ పార్టీలే) దీన్ని రద్దు చేయాలి.

కమిటీలు వేసినా, తీర్మానాలు చేసినా మనకు ఒరిగేదిలేదు. కాలయాపన తప్ప. అందుకే సిపిఎస్ రద్దు అయ్యేవరకు పోరాటాలు కొనసాగాలి. యుటియఫ్‌తో పాటు అనేక సంఘాలు స్వతంత్ర పోరాటాలు, ఐక్యపోరాటాలు, సమ్మెలు నిర్వహించాయి. నేటి రాజకీయ పరిస్థితుల్లో ఐక్యపోరాటాలను మరింత ఉధృతం చేయాలి. చట్టం తెచ్చిన రాజకీయ పార్టీలు వారి వైఖరి ప్రకటించాలి.

ఫ్రెండ్లీ ప్రభుత్వం అని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం సిపిఎస్ పథకం నుండి వైదొలగుతున్నట్లు కేబినేట్‌లో నిర్ణయించాలి.

కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తేవాలి. అవసరం అయితే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల పక్షాన నిలబడి పోరాడాలి.

**సిపిఎస్ రద్దు చేయాలి**
**పాత పెన్షన్ పునరుద్ధరించాలి**

# శానిటరీ పన్ను శాపం



శానిటరీ నాప్‌కిన్స్‌ను కూడా జిఎస్‌టి బిల్లు వదిలిపెట్టలేదు. 2017 జులై 1 నుంచి దేశవ్యాప్తంగా ప్రారంభమైన ఈ బిల్లు మహిళల ఆరోగ్యాన్ని లగ్జరీ వస్తువుల జాబితాలో చేర్చింది. సహజంగా ప్రకృతి నియమాలలో భాగంగా ప్రతినెలా రుతుక్రమం జరుగుతుంది. 12 ఏళ్ళ నుంచి 50 ఏళ్ల వరకుగల మహిళలందరూ అంటే దేశంలో కోట్లాది మంది ఎదుర్కొనే సమస్య ఇది. ఆరోగ్యం పట్ల శ్రద్ధ వున్న కొంతమంది వీటిని వినియోగిస్తారు. ఇవేమీ విలాస వస్తువులు కావు. వినోదం కోసం వాడేవి అంతకంటే కాదు. ఆరోగ్య సూత్రాలలో భాగంగా వినియోగించే వీటిపై ఏకంగా ఏడు శాతం పన్ను పెంచుతూ కేంద్ర ఉత్తర్వులు జారీ చేసింది. దీన్ని బట్టే మహిళల పట్ల కేంద్ర ప్రభుత్వ చిత్తశుద్ధి ఏమిటో అర్థమౌతుంది. కేవలం కార్పొరేట్లకు లాభాలు చేకూర్చడానికే ఈ జిఎస్‌టి బిల్లును ప్రవేశపెట్టారు. అసలు రుతుస్రావ సమస్యను మహిళల ఆరోగ్య సమస్యగా చూడటం లేదు. గౌరవప్రదంగా భావించడం లేదు. అన్ని రకాలుగా ఆడవాళ్ల అభివృద్ధి దేశ అభివృద్ధి అని చెప్తున్న పాలకులకు ఇది కనిపించడం లేదా? స్వచ్ఛభారత్ అంటే ఆరోగ్య భారత్‌గా ప్రధాని చెప్తున్నారు. పాఠశాలల్లో నీరులేక, మరుగుదొడ్లులేక, ఉన్నా నిర్వహించే వ్యవస్థ లేక, కాలికి చెప్పులు లేక, గ్రామాలలో, మురికివాడల్లో ఆరుబయట మల విసర్జనలు జరుగుతున్నాయి. వీటితో సామాన్య జనం ఆరోగ్య సమస్యలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ పరిస్థితులను మార్చాలనే కనీస బాధ్యతలేని కేంద్రం జిఎస్‌టి పేరుతో నాప్‌కిన్స్‌పై పన్ను వేయడానికి సిద్ధమైంది. కాటన్ బట్ట ఖరీదైన వస్తువుగా మారింది. పాఠశాలల్లో ఆడిపల్లల నూలు వస్త్రాలు దొరకక, నాప్‌కిన్లను కొనుక్కోలేక తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. సమయంలో పాఠశాలలకు రాలేకపోతున్నారు. బాలికల్లో డ్రాపవుట్స్ పెరగడానికి ఇదీ ఒక సమస్యగానే వుంది. కనీసం పరిశుభ్రం చేసుకునే పూర్తిస్థాయి టాయిలెట్స్ సౌకర్యం, నీరు సౌకర్యం వుండటంలేదు. దీంతో ఆరోగ్య సమస్యలు, గైనిక్ సమస్యలు వారిని వెంటాడుతూ వుంటాయి. ఇదేం స్వచ్ఛభారత్.

**నెప్టల్ పథకానికి తిలోదకాలు :**

జాతీయ విద్యలో బాలికల నైపుణ్యాభివృద్ధికి, వారి అవసరాలను తీర్చేందుకు 2013 వరకు నెప్టల్‌ను కేంద్ర పథకంగా కొనసాగించింది. అందులో భాగంగా విద్యార్థినులతోనే శానిటరీ నాప్‌కిన్లు తయారు చేసేవారు. వాటిని ఐదు రోజులకు సరిపడే విధంగా ఆ క్లస్టర్లలో గల ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు సరఫరా చేసేవారు. అయితే 2013 నుంచి బడ్జెట్‌లో నిధులను పూర్తిగా నిలిపివేశారు. ఎస్ఎస్ఏకు బాధ్యత అప్పగించినప్పటికీ నిధులు లేక రెండేళ్ళుగా సంక్షేమ హాస్టళ్లకు, కెజిబివి పాఠశాలలకు, గిరిజన ఆశ్రమ పాఠశాలలకు సరఫరా ఆగిపోయింది. అయితే ఎంతోకొంత చైతన్యంతో నాప్‌కిన్లను కొనుగోలు చేసుకొని వినియోగిస్తున్న వారికి జిఎస్‌టితో మూలిగే నక్కమీద తాటికాయ పడ్డట్లు అయ్యింది. అందుకే దేశవ్యాప్తంగా మహిళా టీచర్లు, ఉద్యోగులు, విద్యార్థినులు, ఆడవాళ్లు దీన్ని అంగీకరించడం లేదు. ఈ దేశంలో కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ల పక్షాన వుందా? మహిళల పక్షాన వుందా తేలాల్సిందేనని శానిటరీ నాప్‌కిన్ల ఉద్యమాన్ని చేపట్టబోతున్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుకునే ఆడపిల్లలందరికీ ప్రత్యేక బడ్జెట్ కేటాయించి ఉచితంగా నాప్‌కిన్ ప్యాడ్లను సరఫరా చేయాలి. పెంచిన పన్నును వెంటనే రద్దు చేయాలి. మహిళల ఆరోగ్య సమస్యలైన శానిటరీ సమస్యలు, రక్తహీనత, టాయిలెట్లు, నీటి సమస్యలు వెంటాడుతున్నన్ని రోజులు స్వచ్ఛ భారత్ కేవలం ప్రచారంగా మిగిలి పోతుందని కేంద్రం గుర్తించాలి. లేదంటే భవిష్యత్తులో ఒక పెద్ద మహిళా ఉద్యమాన్ని ఎదుర్కోవాల్సి వస్తుంది.



కె.విజయగౌరి
UTF రాష్ట్ర సహాధ్యక్షులు

# నూతన ఉప రాష్ట్రపతిగా ఎం.వెంకయ్య నాయుడు

భారత 15వ ఉప రాష్ట్రపతిగా ఎం.వెంకయ్యనాయుడు ఎన్నికయ్యారు. ఆగస్టు 5వ తేదీన జరిగిన ఎన్నికలలో బిజెపి (ఎన్‌డిఏ) అభ్యర్థిగా పోటీచేసిన వెంకయ్యనాయుడు ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థి గాంధీజీ మనువడు గోపాలకృష్ణ గాంధీపై 272 ఓట్ల తేడాతో విజయం సాధించారు.

ఆగస్టు 11న వెంకయ్యనాయుడు ఉప రాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లోని దర్బార్ హాలులో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఉప రాష్ట్రపత్తిగా బాధ్యతలు నిర్వహించిన తెలుగువారిలో వెంకయ్యనాయుడు మూడవ వ్యక్తి. 1952లో సర్వేపల్లి రాధాకృష్ణన్



తొలిసారిగా ఉప రాష్ట్రపతిగా రెండు పర్యాయాలు బాధ్యతలు నిర్వహించారు. 1967లో మరో తెలుగు ప్రముఖుడు వరాహగిరి వెంకటగిరి ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వహించారు. ఇరువురు అనంతరం రాష్ట్రపతిగా కూడా బాధ్యతలు నిర్వహించారు.

# ఉమ్మడి సర్వీస్‌రూల్సు వెంటనే అమలు చేయాలి

సుదీర్ఘకాలంగా ఉపాధ్యాయులు చూస్తున్న ఎదురు చూపులకు తెరపడనున్నది. ఉమ్మడి సర్వీస్‌రూల్స్‌కు డ్రాఫ్ట్ రూల్స్ విడుదల చేయటంతో ఉపాధ్యాయులలో ఆశలు రెక్కలు విచ్చుకున్నాయి. జూనియర్ లెక్చరర్ల ప్రమోషన్లకూ అవకాశం కల్పించటంతో ఆశలు రెట్టింపు అవుతున్నాయి. ఈ ఆశలు వొమ్ముకాకుండా ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలి.



కెఎస్ఎస్ ప్రసాద్
యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి

**ఉమ్మడి సర్వీస్‌రూల్స్ చరిత్ర పరిశీలిస్తే :**

"ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రాతినిధ్యాల మేరకు 18 కేటగిరీల ఉద్యోగుల సర్వీసులను ప్రొవెన్షియలైజ్ చేస్తూ జిఓ నం.168; తేది.20.03.1981 ద్వారా అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. వాటిలో పంచాయితీరాజ్ ఉపాధ్యాయులు కూడా ఉన్నారు. అనేక పరిణామాల అనంతరం రాష్ట్ర ప్రభుత్వం అన్ని డిపార్టుమెంట్‌లకు ఉమ్మడిగా "ఏపి స్టేట్ సబ్‌ఆర్డినేట్ సర్వీస్‌రూల్స్-1996" పేరుతో సర్వీసురూల్స్ ప్రకటించింది. దీనిని అనుసరించే ప్రతీ 'డిపార్టుమెంట్' తమ తమ ఉద్యోగుల సర్వీసురూల్సు తయారు చేసుకోవలసి ఉంటుంది."

ఏపి స్టేట్ సబార్డినేట్ సర్వీసురూల్సు ఆధారంగా ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు ఉమ్మడి సర్వీస్‌రూల్స్ పేరుతో జిఓ ఎంఎస్ నం.505, 538 సర్వీసు రూల్సు రూపొందించారు. లోకల్ క్యాడరైజేషన్ జరిగిన ప్రభుత్వ ఉపాధ్యాయులను, లోకల్ క్యాడరైజేషన్ జరుగని ఉపాధ్యాయులతో కలిపి సర్వీసురూల్సు రూపొందించడం సరికాదన్న హైకోర్టు తీర్పు ఉమ్మడి సర్వీస్‌రూల్సుకు విఘాతం కలిగించింది. తరువాత అనేక మార్పులు, చేర్పులతో జిఓలు వెలువరించినా అవి కోర్టులముందు నిలవలేదు. అయితే రాష్ట్రపతి ఆమోదంతో లోకల్ క్యాడరైజేషన్‌ను రీ-ఆర్గనైజ్ చేస్తూ ఉమ్మడి సర్వీస్‌రూల్సును రాష్ట్ర ప్రభుత్వం రూపొందించి పదోన్నతులు చేపట్టాలని, 2015 సెప్టెంబర్ 30వ తేదీన సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పు ఉమ్మడి సర్వీస్‌రూల్సుకు తిరిగి ప్రాణంపోసింది.

దీని ప్రకారమే ఉమ్మడి సర్వీస్‌రూల్సు పునరుద్ధరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ముందుగా లోకల్ కేడర్‌ను "Organization of the local cadre and regulation of Direct Recruitment (Amendment) Order, 2017" పేరిట రీ-ఆర్గనైజ్ చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం రాష్ట్రాన్ని 4 జోన్‌లుగా విభజించారు. (1) విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం (2) తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా (3) గుంటూరు, ప్రకాశం, నెల్లూరు (4) చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం. తదుపరి మండల విద్యాశాఖాధి కారి, గవర్నమెంట్ మరియు జిల్లా పరిషత్ హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు/ప్రధానోపాధ్యాయురాలు పోస్టులు, డైట్ లెక్చరర్లు, సీనియర్ లెక్చరర్ పోస్టులను జోనల్ క్యాడర్ పోస్టులుగాను, స్కూల్ అసిస్టెంట్ తత్సమాన క్యాడర్లు, వాటి దిగువ క్యాడర్ల పోస్టులను జిల్లాస్థాయి పోస్టులుగాను క్యాటగరైజ్ చేయడం జరిగింది.

వీటి ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి సర్వీస్‌రూల్సుకు సంబంధించి డ్రాఫ్టు సర్వీసురూల్సు రూపొందించి విడుదల చేసింది. ఈ డ్రాఫ్టులో ఎక్కువ భాగం గతంలో ఇచ్చిన జిఓలు 505, 538లోని అంశాలనే పొందుపరిచారు. రిక్రూట్‌మెంటు లేని పోస్టులను తొలగించారు. దీని ప్రకారం ఉపాధ్యాయ సర్వీసురూల్సు ఏపి ఎడ్యుకేషనల్ సర్వీస్‌రూల్సు (ఏపిఇఎస్), ఏపి ఎడ్యుకేషనల్ సబ్-ఆర్డినేట్ సర్వీస్‌రూల్సు (ఏపిఇఎస్ఎస్) అను రెండు భాగాలుగా రూపొందించబడ్డాయి.

**ఏపి ఎడ్యుకేషనల్ సర్వీసురూల్సు :**

ఏపి ఎడ్యుకేషనల్ సర్వీసురూల్సును 4 తరగతులుగా విభజించారు. క్లాస్-1లో డైరెక్టరు, జాయింట్ డైరెక్టర్, రీజినల్ జాయింట్ డైరెక్టర్, ఐఎఎస్ఇ ప్రిన్సిపల్ కేటగిరీలను చేర్చారు. క్లాస్-2లో డిఇఓ, డిప్యుటీ డైరెక్టర్, సిటిఇ, డైట్ ప్రిన్సిపాల్స్, ఐఎఎస్ఇ/ఎస్‌సిఇఆర్‌టి ప్రొఫెసర్లు, ప్రభుత్వ వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్ కేటగిరీలను చేర్చారు. క్లాస్-3లో డివైఇఓ, పిఇఓ, డైట్ సీనియర్ లెక్చరర్స్, జిసిపిఇ/ఐఎఎస్ఇ/సిటిఇలలోని ఫిజికల్ ఎడ్యుకేషనల్ లెక్చరర్, ఫిజికల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్పెక్టర్ చేర్చగా క్లాస్-4లో మండల విద్యాశాఖాధికార్లు, గవర్నమెంట్, జిల్లా పరిషత్ హైస్కూల్సు ప్రధానోపాధ్యాయులు డైట్ లెక్చరర్లు, డైట్‌లో ఫిజికల్ ఎడ్యుకేషన్ లెక్చరర్, రీజినల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైట్‌లోని సైన్స్ ఆర్ట్స్/ పెర్ఫార్మింగ్ ఆర్ట్ లెక్చరర్లను చేర్చారు.

క్లాస్-4లోని కేటగిరీలలో ఫిజికల్ ఎడ్యుకేషన్ పోస్టులకు స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్) టీచర్లకు ప్రమోషను ఇస్తారు. తక్కిన పోస్టులన్నిటికి అనగా ఎంఇఓ, జిహెచ్ఎం, డైట్ లెక్చరర్ పోస్టులకు ప్రభుత్వ, పంచాయితీరాజ్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్లుగా పిఎస్‌హెచ్ఎంలుగా పనిచేసే వారి నుండి ప్రమోషను కల్పించబడుతుంది. దీనికి తగిన విద్యార్హతలతోపాటు ఇఓ, జిఓ టెస్టులు పాస్ కావలసివుంటుంది. 50 సం॥ల వయస్సు నిండిన వారికి డిపార్టుమెంటు టెస్టుల నుండి మినహాయింపు ఇవ్వబడుతుంది.

**ఏపి ఎడ్యుకేషనల్ సబార్డినేట్ సర్వీసు రూల్సు :**

ఏపి ఎడ్యుకేషనల్ సబార్డినేట్ సర్వీసురూల్సును రెండు తరగతులుగా విభజించారు. క్లాస్-1లో స్కూలు అసిస్టెంట్లు, తత్సమాన కేటగిరీలు, ప్రైమరీ స్కూలు ప్రధానోపాధ్యాయులను చేర్చగా క్లాస్-2లో ఎస్‌జిటిలు, లాంగ్వేజ్ పండిట్‌లు, పిఇటి, స్పెషలిస్టు టీచర్లను చేర్చారు. బి.కాం, బిఇడిలకు స్కూలు అసిస్టెంట్ (సోషల్ స్టడీస్)గా ప్రమోషను పొందేందుకు అర్హత కలిగించారు.

**ఇంటర్మీడియేట్ ఎడ్యుయేషన్ సర్వీసురూల్సుకు సవరణ :**

సుదీర్ఘకాలంగా యున్న ఉపాధ్యాయుల ఆకాంక్షలకనుగుణంగా జూనియర్ లెక్చరర్స్ పోస్టులలో స్కూలు అసిస్టెంట్లకు ప్రమోషన్ అవకాశం కల్పిస్తూ 'ఇంటర్మీడియేట్ ఎడ్యుకేషన్ సర్వీస్‌రూల్సు'కు డ్రాఫ్ట్ రూల్సు కూడా ఈ సందర్భంగా విడుదల చేయడం గమనార్హం.

గతంలో సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా నిలిచిపోయిన ప్రమోషన్లు తిరిగి పునరుద్ధరించబడనున్నాయి.

"వి.జగన్నాథరావు అండ్ అదర్స్ వర్సెస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం" కేసులో సుప్రీంకోర్టు స్కూలు ఎడ్యుకేషన్, హయ్యర్ ఎడ్యుకేషన్ రెండూ వేర్వేరు డిపార్టుమెంటులని, ఒక డిపార్టుమెంటు లోని వారికి వేరొక డిపార్టుమెంటులో ప్రమోషన్లు ఇవ్వబూనడం సరికాదని తీర్పునివ్వడంతో జిఓ ఎంఎస్ నం.223, తేది.18.09. 2008 ద్వారా జూనియర్ లెక్చరర్ ప్రమోషన్లు స్కూలు అసిస్టెంట్లకు ఇవ్వ నిరాకరించిన సంగతి విదితమే. అయితే జిఓ ఆర్టి నం.3009 జిఏడి; తేది.20.06.2009 ద్వారా ఇంటర్మీడియేట్ విద్యను స్కూలు ఎడ్యుకేషన్‌కు బదలాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం ఇంటర్మీడియేట్ విద్యను స్కూలు ఎడ్యుకేషన్‌లో భాగంగానే పరిగణించాలి. కానీ ఇంటర్మీడి యేట్ విభాగం హయ్యర్ ఎడ్యుకేషన్ సెక్రటరీ పరిపాలనలో ఉన్నందువల్ల స్కూలు అసిస్టెంట్లకు, జూనియర్ లెక్చరర్లుగా ప్రమోషను పొందే అవకాశం లేకుండాపోయింది. ఈ గందర గోళానికి తెరదించుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్మీడియేట్ విద్య స్కూలు ఎడ్యుకేషన్‌లో భాగమని స్పష్టంగా పేర్కొన్నందువల్ల ఉపాధ్యాయులకు జూనియర్ లెక్చరర్లుగా ప్రమోషన్‌కు మార్గం సుగమమైంది.

దీని ప్రకారం మొత్తం జూనియర్ లెక్చరర్ల పోస్టులలో 50% డైరెక్టు రిక్రూట్‌మెంట్ ద్వారాను, 40% స్కూలు అసిస్టెంట్లనుండి, 10% ఎడ్యుకేషన్ డిపార్టుమెంటులో పనిచేస్తున్న నాన్-టీచింగ్ స్టాఫ్ నుండి భర్తీ చేస్తారు.

**డ్రాఫ్టు సర్వీసురూల్సుపై యుటియఫ్ స్పందన :**

రాష్ట్ర ప్రభుత్వం డ్రాఫ్టు సర్వీసు రూల్సు ప్రకటించడం, ఇంటర్మీడియేట్ విభాగంలో జూనియర్ లెక్చరర్ల ప్రమోషన్‌కు అవకాశం కల్పించడం పట్ల యుటియఫ్ హర్షం వ్యక్తం చేస్తూ వుంది. అయితే సర్వీస్‌రూల్స్‌లో కొన్ని అంశాలు క్రొత్తగా చేర్చాలని, మరికొన్నిటిని సవరించాలని అభిప్రాయపడుతుంది. డ్రాఫ్ట్ సర్వీసురూల్స్ పరిశీలిస్తే సెకండరీ గ్రేడుగా సర్వీసులో చేరిన ఉపాధ్యాయునికి డైరెక్టరు ఆఫ్ స్కూలు ఎడ్యుకేషన్ వరకు ప్రమోషన్‌కు అవకాశం కల్పించడం హర్షణీయమే అయినా

1. గ్రేడ్-1 ప్రధానోపాధ్యాయుల పోస్టులను తొలగించారు. ఇవి కొనసాగించాల్సిన అవసరం వుంది.
2. పరిషత్ ఎడ్యుకేషనల్ ఆఫీసరు పేరు 'డివైఇఓ (జడ్‌పి)గా మార్పు చేయబడింది. కాబట్టి పరిషత్ ఎడ్యుకేషనల్ ఆఫీసరు పేరును Deputy Education Officer (ZP) గా మార్పు చేయాలి.
3. ఆర్ఎంఎస్ఏ, ఎస్ఎస్ఏ విభాగాలలోని పోస్టులను సర్వీసు రూల్సులో చూపలేదు.
4. ఇంటర్మీడియేట్ విద్య స్కూలు ఎడ్యుకేషన్‌లో భాగమైనప్పుడు ఆ పోస్టులను ఎడ్యుకేషన్ సర్వీసురూల్సులో చూపకుండా విడిగా ప్రతిపాదించారు.

వీటన్నిటిని కూలంకషంగా పరిశీలించిన పిమ్మట ఉమ్మడి సర్వీస్ రూల్సుకు ఈ క్రింది విధంగా మార్పులు చేసి పరిపుష్టం చేయాలని యుటియఫ్ ప్రతిపాదిస్తున్నది.

1. ఇంటర్మీడియేట్ విద్యా విభాగంలోని పోస్టులను కూడా సర్వీస్ రూల్సులో చేర్చాలి.
2. ఇప్పటికే లోకల్ క్యాడరైజేషన్ పూర్తి అయిన గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులను ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పరిగణించి ఉమ్మడి సర్వీస్‌రూల్సులో చేర్చాలి.
3. మున్సిపల్ ఉపాధ్యాయులను కూడా సర్వీస్‌రూల్సులో చేర్చేందు కు అవసరమైన చర్యలు తీసుకోవాలి.
4. ఆర్ఎంఎస్ఏ, ఎస్ఎస్ఏ విభాగాలలోని పోస్టులను స్కూలు ఎడ్యుకేషన్ డిపార్టుమెంటులో భర్తీ చేసేలాగున వాటిని కూడా సర్వీసు రూల్స్‌లో చేర్చాలి.
5. గ్రేడ్-1 గెజిటెడ్ హెడ్మాష్టరు పోస్టులను కొనసాగిస్తూ విద్యార్థుల సంఖ్య 1000కుపై బడిన పాఠశాలలన్నిటికి గ్రేడ్-1 జిహెచ్ఎం పోస్టులు కేటాయించాలి.
6. 40 హైస్కూల్సు కలిగిన భౌగోళిక ప్రాంతం (లేదా) ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక ఉపవిద్యాశాఖాధికారి ఉండేలా డివైఇఓ పోస్టుల సంఖ్య పెంచాలి.
7. ఎంఇఓ, జిహెచ్ఎంలకు పనిభారం పెరుగుతున్నది. ప్రైమరీ, ఉన్నత పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులు వున్నారు కాని ప్రాథమికోన్నత పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులు లేరు. పెరుగుతున్న పనిభారం దృష్ట్యా జిహెచ్ఎం / ఎంఇఓలకు స్కూలు అసిస్టెంట్లకు మధ్యలో ఒక దొంతర ఏర్పరచాలి. ఏపి ఎడ్యుకేషనల్ సబ్‌ఆర్డినేట్ సర్వీస్‌రూల్సులో డిప్యూటీ హెడ్‌మాస్టర్, డిప్యూటి మండల ఎడ్యుకేషనల్ ఆఫీసర్, యుపి స్కూల్ హెడ్మాష్టర్ పోస్టులను విడివిడి కేటగిరీలుగా గుర్తించి ప్రత్యేక తరగతి ఏర్పాటు చేయాలి.
8. వర్తమానంలోను, భవిష్యత్‌లోను కంప్యూటర్ విద్యకు ప్రాధాన్యత వున్న దృష్ట్యా స్కూల్ అసిస్టెంటు కేటగిరీలో స్కూల్ అసిస్టెంటు (కంప్యూటర్‌సైన్సు) పోస్టును చేర్చాలి. కంప్యూటర్ విద్యను ప్రోత్సహించాలి.
9. ఎంఏ ఎడ్యుకేషన్‌ను ఎంఇడితో సమానంగా పరిగణించాలి.
10. స్కూలు అసిస్టెంట్లు, జూనియర్ లెక్చరర్ పోస్టుల పేర్లను టిజిటి, పిజిటిలుగా మార్పు చేయాలి.
11. డైరెక్టు రిక్రూట్‌మెంట్, ప్రమోషన్లకు ఒకే విద్యార్హతలు ఉండాలి. రెండింటికి వేర్వేరు అర్హతలు ఉండడం సరికాదు.

ఉమ్మడి సర్వీస్‌రూల్సు అమలులోకి తేవడం ద్వారా ఉపాధ్యా యులకు పెద్దఎత్తున ప్రమోషన్ల అవకాశాలు పెరగనున్నాయి. దశాబ్దాల కాలంగా ఉపాధ్యాయులలో పేరుకున్న అసంతృప్తి తొలగే అవకాశముంది. కాబట్టి వెంటనే ప్రభుత్వం ఉమ్మడి సర్వీస్ రూల్సు విడుదల చేసి అమలు చేయాలి. జాప్యం జరిగేకొద్దీ అనేక అవాంతరాలు ఎదురయ్యే అవకాశముంది. గత ప్రభుత్వాలు అనుసరించిన నిర్లక్ష్య ధోరణులవల్ల ఉపాధ్యాయులకు నేటికీ సరైన సర్వీస్‌రూల్సు లేకుండా పోయినాయి. వీటన్నిటిని దృష్టిలో పెట్టుకొని ప్రస్తుత ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాలు, మేధావులతో చర్చించి ఉమ్మడి సర్వీస్‌రూల్సును శీఘ్ర గతిని విడుదలచేయాలని; మున్సిపల్, ట్రైబల్ వెల్ఫేర్ టీచర్లను కూడా ఉమ్మడి సర్వీస్‌రూల్సులో చేర్చాలని యుటియఫ్ డిమాండ్ చేస్తోంది.

# రాష్ట్ర మహాసభలకు సిద్ధంకండి

## యుటియఫ్ రాష్ట్ర మధ్యంతర కౌన్సిల్ పిలుపు




ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర మధ్యంతర కౌన్సిల్ సమావేశం ఆగస్టు 20న రాష్ట్ర అధ్యక్షులు ఐ.వెంకటేశ్వర రావు అధ్యక్షతన విజయవాడలోని యుటియఫ్ రాష్ట్ర కార్యాలయంలో జరిగింది.

రాష్ట్ర కౌన్సిల్ సమావేశాన్ని ఐ.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతర్జాతీయ, జాతీయ రాజకీయ పరిణామాలు పరిశీలిస్తే నియంతృత్వ పోకడలు కన్పిస్తు న్నాయని అన్నారు. ట్రంపు విధానాలు కొన్ని దేశాలను, జాతులపై తీవ్రవాదులకు గురిచేస్తున్నాయని అన్నారు. దేశంలో అభివృద్ధి జరుగుతుందని ప్రచారం చేస్తూ అధికార కేంద్రీకరణ చేస్తున్నారని ఫెడరల్ వ్యవస్థ విచ్ఛిన్నం చేసేలా నిర్ణయాలు ఉన్నాయి. చిన్న అవకాశం దొరికినా మతోన్మాదాన్ని రెచ్చగొట్టేలా చర్యలున్నాయని విమర్శించారు. విద్యా విధానంలో సైతం ప్రమాదకర ధోరణులు పెరుగు తున్నాయని అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర సహాధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు గత కౌన్సిల్ తర్వాత మరణించిన ప్రముఖులకు, ఉద్యమ నాయకులకు సంతాపాన్ని తెలియజేస్తూ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.

రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.బాబురెడ్డి కార్యదర్శి నివేదిక ప్రవేశ పెడుతూ ఇటీవల కాలంలో నిర్వహించిన కార్యక్రమాలను, ప్రభుత్వంతో జరిపిన ప్రాతినిధ్యాలు, పోరాటాల గురించి వివరించారు. ఇప్పటివరకు యుటియఫ్ స్వతంత్రంగా, ఫ్యాప్టో ద్వారా అనేక పోరాటాలు నిర్వహించామని, కొన్ని సమస్యలు పరిష్కారం అయినప్పటికి పెండింగ్‌లో ఉన్న సమస్యలపై భవిష్యత్ కార్యాచరణ తీసుకోవాలని ప్రకటించారు.

డిసెంబర్ 9,10,11 తేదీలలో రాష్ట్ర మహాసభలు శ్రీకాకుళంలో జరుగుతున్నాయని జయప్రదం చేయుటకు అందరు సిద్ధం కావాలని అన్నారు. అన్ని జిల్లా / మండల శాఖలు క్యాంపెయిన్స్ సెప్టెంబర్ 10లోగా పూర్తిచేసి నిర్మాణాల మీద కేంద్రీకరించాలని అన్నారు. నివేదికలపై జిల్లాల ప్రతినిధులు ఎస్‌వివి రమణయ్య (అనంతపురం), వై.ఏ.ఆర్.కె.ప్రసాద్ (విశాఖ), రెడ్డి మోహన్‌రావు (శ్రీకాకుళం), ఎస్‌వి సుబ్బరాజు (కడప), ఎన్.నవకోటేశ్వరరావు (నెల్లూరు), డి. రామశేషయ్య (కర్నూలు), కె.శేషగిరిరావు (విజయనగరం), టి. కామేశ్వరరావు (తూర్పుగోదావరి), ఎన్.సోమశేఖరనాయుడు (చిత్తూరు), పి.రమణారెడ్డి (ప్రకాశం), బి.గోపీమూర్తి (పశ్చిమ గోదావరి), ఎం.హనుమంతరావు (గుంటూరు), కెఏ ఉమామహేశ్వర రావు (కృష్ణా) చర్చల్లో పాల్గొన్నారు.

రాష్ట్ర కోశాధికారి కె.సంజీవరెడ్డి ప్రవేశపెట్టిన ఆర్థిక నివేదికను, రాష్ట్ర కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ ప్రవేశపెట్టిన తీర్మానాలు అన్ని నివేదికలు ఏకగ్రీవంగా ఆమోదించారు.

సెప్టెంబర్ 10వ తేదీలోపు సభ్యత్వం, జనరల్ ఫండ్, పత్రికా క్యాంపెయిన్స్ పూర్తి చేయాలి.
నవంబర్ 23లోగా జిల్లాల మహాసభలు పూర్తి చేయాలని తీర్మానించారు.

**సమస్యలపై ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానాలు**

1. సిపిఎస్ రద్దు కోరుతూ సెప్టెంబర్ 1న జరుగుతున్న "మిలియన్ మార్చ్"ని జయప్రదం చేయాలని సమావేశం తీర్మానించింది.
2. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు బకాయిపడి ఉన్న 10 నెలల పిఆర్‌సి అరియర్లు వెంటనే చెల్లించాలని, పెన్షనర్లకు అదనపు పెన్షన్ మంజూరు చేయాలని, స్వయంపోషక స్వతంత్ర పాఠశాలల చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని
3. జులై 2018 నుండి 11వ పిఆర్‌సి అమలు చేయాల్సిన నేపథ్యంలో 11వ పిఆర్‌సి కమిటీ వేయాలని
4. రాష్ట్ర విభజన వలన తమ సొంత రాష్ట్రానికి బదిలీ కోరుకునే వారందరినీ బదిలీకి అనుమతించాలని,
5. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చే స్వయంపోషక స్వతంత్ర పాఠశాలల చట్టం-2017 ఉచిత విద్యకు తిలోదకాలు ఇస్తుందని దీన్నివెంటనే వెనక్కి తీసుకోవాలని మధ్యంతర కౌన్సిల్ సమావేశం తీర్మానించింది.
6. 1984-1996 మధ్య నియామకమైన స్పెషల్ టీచర్ల సర్వీస్‌కు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని
7. 2008 డిఎస్‌సి హామీ పత్రాల వారికి వేతన రక్షణ కల్పించాలని
8. ఎయిడెడ్ ఉపాధ్యాయుల జీతాలపై బడ్జెట్ కంట్రోల్ తొలగించాలని,
9. మున్సిపల్ పాఠశాలల్లో సమాంతర మీడియంలు కొనసాగించాలని, మున్సిపల్ ఉపాధ్యాయులకు పిఎఫ్ సదుపాయం వర్తింపచేయాలని,
10. ఏజెన్సీ ముంపు మండలాల్లో ఉపాధ్యాయులు లేనందున స్పెషల్ డిఎస్‌సి నియామకాలు వెంటనే చేయాలని,
11. మున్సిపల్, గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులను ఉమ్మడి సర్వీస్ రూల్స్‌లో చేర్చాలని,
12. ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులకు ఉమ్మడి సర్వీస్‌రూల్స్ విడుదలచేయాలని,
13. ఇటీవల బదిలీలలో బదిలీ అయినవారందరినీ రిలీవు చేయాలని,
14. అర్ధజీతపు సెలవు ఎన్‌క్యాష్ మెంట్ ఉత్తర్వులు వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు.

మధ్యంతర కౌన్సిల్ కార్యదర్శి నివేదికను ప్రధానకార్యదర్శి పి.బాబురెడ్డి ప్రవేశ పెట్టగా కౌన్సిల్ సభ్యులు చర్చించి ఆమోదించారు. విద్యా ముసాయిదా చట్టం-2017 వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా సదస్సులు నిర్వహించాలని, ఎస్‌టిఎఫ్ఐ పిలుపుమేరకు మహిళలు వినియోగించే నాప్‌కిన్స్‌పై వేసిన జిఎస్‌టి పన్ను రద్దు చేయాలని కోరుతూ మహిళా మహిళలు, బాలికలు ఆగస్టు 31న జిల్లా, డివిజన్ కేంద్రాలలో ర్యాలీలు, ధర్నాలు నిర్వహించాలని కౌన్సిల్ సమావేశం పిలుపునిచ్చింది.

ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు ఎన్.నర్సింహులు, సహాధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, కోశాధికారి కె.సంజీవ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు కెఎస్ఎస్ ప్రసాద్, ఎస్‌కె సాబ్జీ, మహమ్మద్ జిలానీ, ఎస్.జయప్రభ, గౌంటి గిరిధర్, బి.లక్ష్మిరాజా, బి.శ్రీదేవి, ఎమ్మెల్సీలు బొడ్డు నాగేశ్వరరావు, రాము సూర్యారావు మరియు కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.



6వ పేజీ తరువాయి

# ఉపాధ్యాయుడు నాడు - నేడు

విద్యావ్యవస్థే నైతిక పునాదుల మీదలేనప్పుడు ఉపాధ్యాయుడికీ ఆ నైతికత దూరమైపోతోంది. బడి బలహీనమై పిల్లలు దూర మవుతున్నపుడు, సమాజం నాకొద్దనుకొన్నప్పుడు అందులోని ఉపాధ్యాయుడు పేలవంగా మారుతాడు. ఇలా ఇపుడు టీచరు ఎంత పెద్ద సంఘాల్లో ఉన్నా నిజానికి ఒంటరి. తోడు లేనివాడు. తన ఉద్యోగం కోసం ప్రభుత్వ విద్య, తన పిల్లకోసం కార్పొరేట్ విద్య అనే వైరుధ్యంలోకి అతడు ఇరుక్కు పొయ్యాడు. తన వృత్తికిపుడు విలువేమీ లేదు. టీచరు కున్న విలువల్లా సమాజంలో చాలా మంది కంటే నిమ్మళంగా బతుకుతుండటమే. క్రమంగా ఇది సమాజానికి దూరంగావడంగానే గాదు వ్యతిరేకంగావడంగా కూడా మారుతోంది. సమాజం అతన్ని అసూయపడ్డం నుంచి అవమానించడం, ఏవగించడం దాకా ఇది వెళ్ళుతోంది.

బడిలో ఉపాధ్యాయుడి స్వేచ్ఛ, సృజనాత్మకత కూడా కనుమరుగవు తున్నాయి. పరీక్షలు, ర్యాంకులు ముందుకొచ్చినపుడు కార్పొరేట్ పద్ధతులే శరణ్యమవుతాయి. ఇవి అతన్ని నిర్జీవిగా మారుస్తున్నాయి. పేద పిల్లల్ని ఈ ర్యాంకుల పోటీల్లోకి తెచ్చి నెగ్గకొచ్చేట్టు చెయ్యడం అసాధ్యం (అనవసరం కూడా). ఇదొక నిందగా బడి మీద, టీచర్ మీద పడుతోంది. ఒక అశక్తత అతన్ని ఆవరిస్తోంది. అందులోంచి అతనూ యాంత్రికంగానే మారిపోతున్నాడు. తనకు తెలియకుండానే తాను పరాధీనమయిపోతున్నాడు. వృత్తిలో ఇది టీచర్లను కుంగ తీస్తోంది. ఇక ప్రైవేట్ స్కూళ్ళలో ఈ మీ మాంస కూడా లేదు. అక్కడ టీచరుకున్న స్థానం స్పష్టం. అతడికి పాఠాలతో పనిలేదు, పరీక్షలతో తప్ప. విషయావగాహనాలతో నిమిత్తం లేదు, గుర్తుంచు కొనేల చెయ్యడం తప్ప. అతను ఇంతకంటే భిన్నంగా టీచరుండాలని, ఉంటాడని భావించే స్థితికి కూడా అతీతుడు. ఇతడిప్పుడు అలనాటి బతకలేని బడిపంతులకి ప్రతినిధి. కాకుంటే అప్పుడతనికి సామాజిక గౌరవం అయినా వుండేది. ఇతనికిప్పుడదీ లేదు! అన్నింటికంటే బాధాకరం టీచరు పిల్లలకు దూరం కావడం. వాళ్ళతోటి అనుబంధాన్ని పోగొట్టుకోడం.

ఇక ఇప్పుడు జరగాల్సింది ఏమిటి ? దీనికి సమాధానం కష్టం. ఏం జరుగుతుందో ఇలానేవుంటే మాత్రం స్పష్టం.

**ఉపాధ్యాయుడు మారగలడా?**

ఇప్పుడు టీచరు ముందున్నది ఒకే దారి. ఒకటి సంఘటితంగా తన నిజమైన అస్తిత్వం కోసం నిలబడ్డం. దానిక్కావల్సిన వ్యవస్థకోసం పోరాడ్డం. వాళ్ళ సంఘాలు తమ లక్ష్యాల్ని పునర్నిర్వచించుకోడం, పునస్సమీక్షించుకోడం. సమాజానికి వీలున్నంత దగ్గరవ్వడానికి కూడా ఒక ఉద్యమాన్ని ఓపిగ్గా ప్రారంభించడం. బడి చుట్టూ మళ్ళీ ఒక సామాజిక బంధాన్ని నిర్మించడం. ఇది కష్టం కూడా ఎందుకంటే మారిన కాలం తల్లిదండ్రుల్ని తట్టిలేపింది. తమ పిల్లలకు మంచి చదువే శరణ్యమని పాఠాలు చెప్పింది. పేదలూ దీన్ని అందుకొన్నారు. అయితే తేడా ఏమంటే ఇదే స్పృహ ఎగువ వర్గాలకు కల్గినపుడు వాళ్ళు ఊళ్ళోబడిని నిర్మించుకొని నిలబెట్టుకొన్నారు. తాము గట్టెక్కాక దీన్ని వదిలేశారు. ఇపుడు సన్న జనం చదువుకోవాలనికొన్నపుడు సర్కారు బడిని నిలబెట్టుకొనే స్థితిలో, ఆలోచనలో లేరు. వారూ ప్రైవేటు బడినే వెతుక్కొంటున్నారు. ఊరిబడిని అమాయకంగా బీడు పెడుతున్నారు. ఈ దశలో మళ్ళీ గ్రామాన్ని బడి దగ్గరకి తేవాలంటే పెద్ద ప్రయత్నమే జరగాలి. పెద్ద నమ్మకమే వాళ్ళకి కలగాలి. ఉపాధ్యాయ ఉద్యమం దీనికి తన సభ్యుల్ని పురమాయించగలదా ? ఇదో పెద్ద ప్రశ్న.

ప్రభుత్వాలు ప్రజావసరాలన్నిటినీ ప్రైవేటు వారికప్పజెప్పి అదే అభివృద్ధి అనడం నేటి అంతర్జాతీయ విధానంలో విడదీయరాని భాగం. దీనివల్ల అన్ని వ్యవస్థలూ కుప్పగూలుతున్నాయి. అందరు ప్రజలు అతలాకుతలవుతున్నారు. వ్యవస్థలన్నీ కుప్పగూలి పోతున్నాయి. ప్రభుత్వవిద్యారంగం కుదేలు పడ్డం ఇందులో భాగంగానే చూడాలి. మరి నేటి ఉపాధ్యాయుడు దీన్నర్థం చేసుకొని ఈ విశాల ప్రతిఘటనలో భాగం కాగలడా ? కావడం మినహా గత్యంతరమేమీ లేదు. అప్పుడుగానీ అతని ఒంటరితనం, అతనిపట్ల సమాజ విముఖత బలహీన పడవు. వాస్తవానికి ఉపాధ్యాయుడు గతంలో లాగా ముందుయుగందూత పాత్ర పోషించాలి. సామాజిక తిరోగమనపు అన్ని కోణాల్ని అతడు అర్థంచేసుకోగల్గాలి. ఎక్కడికక్కడ జోక్యం చేసుకోవాలి. కానీ ఎదిగొచ్చిన నేటి మధ్యతరగతి వర్గం ఎగుడు దిగుడు అభివృద్ధిలో ఇరుక్కుపోయింది. తనచుట్టూ ప్రపంచాన్ని నిలబెట్టాలన్న తాపత్రయంలో పడిపోయింది. జాతీయోద్యమం నాటి పురోగామి పాత్రను వదులుకొని సమాజాన్ని వెనక్కి నడిపించే పాత్రలోనికి దిగజారిపోతోంది. ఎక్కడా లేని అశాస్త్రీయ దృక్పథాలు, ఆలోచనలు, అలవాట్లు, ఆడంబరాలు, భేషజాలు ఇప్పుడు మధ్యతరగతిని ఆశ్రయించుకొనే బతుకుతున్నాయి. ఈ లక్షణాన్ని పదికాలాలపాటు పదిల పరిచే పనికి ప్రభుత్వం నడుం కట్టింది. 'అభివృద్ధి' అనేదాన్ని గాలిలోంచి తీసి మధ్యతరగతిని మంత్రముగ్ధుల్ని చేస్తోంది. టీచర్లూ ఇప్పుడిదే వర్గంలో వున్నారు. కొంచెం **"క్రియాశీలకంగా"** కూడా వున్నారు!

దీన్నుంచి బయటపడ్డం, దీనికి భిన్నంగా ఒక సానుకూల అభ్యుదయ ప్రజాస్వామిక సంస్కరణాత్మక పాత్రపోషించడం కొంచెం కత్తిమీద సామే! కానీ ఇంతకన్నా వీరిముందు మార్గం ఏముంది ?

నేడు గాకుంటే రేపు, రేపు గాకుంటే ఎల్లుండి ఈ దారి వెతుక్కోక తప్పదు. జనాన్ని తోడు తెచ్చుకోక తప్పదు. ఆలస్యమయ్యే కొద్దీ అమృతం విషమవుతుంది.

ఇదీ మన ఉపాధ్యాయుడి ప్రస్థానం. వంద ఏళ్ళలోనే కాలచక్రం ఇంత గిర్రున తిరిగింది మరి!


## ఐక్య ఉపాధ్యాయలో ప్రకటనల రేట్లు

| | | |
|---|---|---|
| 4వ కవర్ పేజీ (కలర్) | - | ₹ 30,000 |
| 2వ కవర్ పేజీ (కలర్) | - | ₹ 20,000 |
| 3వ కవర్ పేజీ (కలర్) | - | ₹ 20,000 |
| లోపలి పేజీ (బ్లాక్ & వైట్) | - | ₹ 10,000 |
| లోపలి పేజీ (బ్లాక్ & వైట్)ఆప్షనల్ | - | ₹ 11,000 |


## ఉద్యమవార్తలు పంపండి

**యుటియఫ్ జిల్లా శాఖలు, మండల శాఖలు మీ జిల్లా / మండలంలో నిర్వహించిన సమావేశాలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు, ప్రాతి నిధ్యాల వార్తలను, ఫోటోలను ఎప్పటి కప్పుడు 'ఐక్య ఉపాధ్యాయ'కు మెయిల్ / పోస్టు ద్వారా పంపండి. మీ పోరాటాలు, విజయాలు అన్ని జిల్లా / మండల శాఖలకు స్ఫూర్తిని కల్గిస్తాయి. ప్రతినెల 30వ తేదీలోగా వచ్చిన వార్తలు, ఫోటోలు మరుసటి నెల పత్రికలో ప్రచురించడం జరుగుతుంది.**

**– సంపాదకవర్గం**

# అక్షరాలు నేర్పడంలో మెళకువలు




పిల్లల చదువుల్లో అత్యంత ప్రధానమైనది ప్రాథమిక విద్య. అందు లోనూ 1,2 తరగతుల పిల్లలది ప్రత్యేక పరిస్థితి. ఆడుకొంటూ ఇంట్లో అమ్మానాన్నల దగ్గరున్న పిల్లలు బడిలోకి వచ్చి పడతారు. అక్కడ గంటల తరబడి కదలకుండా కూర్చోవడం పెద్ద నరకం. ఉపాధ్యాయుడు చెప్పేది వినేంత ఓర్పు శక్తి వారికి ఉండదు.

పిల్లలకు నేర్పడంలో ప్రధానమైన అంశాలు రెండు. (1) పిల్లలకు టీచర్లకు మధ్య సంబంధాలు (2) బోధనా పద్ధతులు.

**పిల్లలకు టీచర్లకు మధ్య సంబంధాలు :**

మన బోధనాపద్ధతి ఉపాధ్యాయుడు కేంద్రంగా జరుగుతున్నది. ఈ బోధనాపద్ధతి ఎలా ఉంటుందంటే "నేను చెప్పాను. పిల్లలు నేర్చుకోవాలి" అన్నట్లు ఉం టుంది. గురు కేంద్రంగా ఉన్న ఈ విద్యా విధానం భారతీయ సంస్కతిలో ఒక భాగం. అందుకే ఉపా ధ్యాయులకు ఎన్ని శిక్షణలిచ్చినా, అవి క్లాసు రూమ్ వరకు వెళ్లడం లేదు.




సి.వి.కృష్ణయ్య
జనవిజ్ఞాన వేదిక


పిల్లలతో టీచర్ స్నేహంగా ఉండడానికీ, అక్షరాలు నేర్చుకోవడానికి ఏమిటి సంబంధం?

ఒక పిల్లవాడి జీవితంలో అక్షరాలు గుర్తుపట్టి పదాలు వాక్యాలు చదవడం, పుస్తకాన్ని స్వయంగా చదవడం అత్యంత క్లిష్టమైన విషయం. ఎందుకంటే, ఇది పిల్లలకు సంబంధించిన విషయం కాదు. ఆటల్లా ఆనందకరమైన విషయమూ గాదు. ఈ బడితోగాని అక్షరాలతోగాని పిల్ల వాడికి ఏ సంబంధం లేదు. ఇది పిల్లల భవిష్యత్తుకోసం, భావి సమాజంకోసం పెద్దలు చేసిన ఒక ఏర్పాటు. ఈ విషయం పిల్లలు అర్థం చేసుకోలేరు. వారిది ఆడుకొనే వయస్సు. వారి శరీరం మనస్సు వారి స్వాధీనంలో ఉండవు. నిరంతరం చలిస్తూ ఉంటారు. ఇలాంటి పిల్లలకు చిరునవ్వుతో స్నేహ పూర్వకంగా నేర్పించాలి. వారి మనస్సులోకి ఉపాధ్యాయుడు ప్రవేశించి ఎలా చెబితే నేర్చుకొంటారో తెలుసుకోవాలి. ఇది ఉపా ధ్యాయుడి బాధ్యత. ఈ బాధ్యతను ఉపాధ్యాయుడు గుర్తించాలి. అప్పుడు మాత్రమే పిల్లలు నేర్చుకొనే శాస్త్రీయ పద్ధతులకోసం అన్వేషిస్తాడు. తానే, సొంత పద్ధతులు రూపొందించుకొంటాడు. ఈ చిన్నారి పిల్లలకు చదువు చెప్పే బాధ్యత స్కూలు మొత్తంగా తీసుకోవాలి. తల్లిదండ్రులు కూడ సహకరించాలి. ఇది చాలా ఓర్పుతోనూ నైపుణ్యం తోను కూడుకున్న అంశం. అక్షరాలేగదా అని తెలిగ్గా తీసుకోవడమే ఇన్ని అనర్థాలకు మూలం.

పిల్లలు భయంతోనూ, బాధ్యతతోను నేర్చుకోలేరు. పిల్లలు ఇష్టంతోనూ స్నేహపూరిత వాతావరణంలోను నేర్చుకొంటారు. ఇది మొదటి అంశం.

నేర్పడంలో శాస్త్రీయ పద్ధతులు, మెటీరియల్ ఉప యోగించడం రెండో విషయం. మొదటిది లేకుండా రెండోది ఉపయోగించడం సాధ్యంగాదు.

**బోధనా పద్ధతులు :**

అక్షరాలు నేర్పడానికి రెండు పద్ధతులున్నాయి. (1) అక్షర పద్ధతి (2) పద పద్ధతి.

**అక్షర పద్ధతి :** అక్షరమాలలో ఉన్న అక్షరాలను వరుసగా నేర్పించడం. అక్షరాల తర్వాత వాటి గుణింతం నేర్పించడం. ఆ తర్వాత వత్తులు నేర్పించడం. ఇవన్నీ నేర్పించిన తర్వాత పదాలు వాక్యాలు చదివించడం.

**ఈ పద్ధతిలో ఉన్న లోపాలు :**

తెలిసినదాని నుండి తెలియంది నేర్చుకోవడం శాస్త్రీయం. ఇక్కడ పిల్లలు నేర్చుకొనే అక్షరాలు గుర్తు పెట్టుకోడానికి వారి మెదడులో (జ్ఞాపకాలలో) ఏ ఆధారం (లింకు) లేదు. అ,ఆ,– అనే అక్షరాలకు సంబంధించిన ఆకారాలుగాని, వాటి శబ్దాలుగాని అర్థం చేసుకోడానికి గుర్తు పెట్టుకోడానికీ ఆధారం లేదు. అందుకనే గంటల తరబడి నెలల తరబడి 'దిద్దిస్తూనో, చూసి రాయిస్తూనో ఉంటారు. – ఇక్కడ ఆలోచించడం అర్థం చేసుకోవడం, సృజనాత్మకత వంటివి ఏమీ ఉండవు. కనీసం ఆటలా కూడా ఉండదు. అందుకనే బండ చాకిరిలా ఉంటుంది. విసిగిపోతారు. అన్యమనస్కంగా ఉంటారు. 20 అక్షరాలు నేర్చు కొనేటప్పటికి మొదట నేర్చుకొన్న అక్షరాలు మరిచి పోతుంటారు. పది రోజులు బడికి రాకపోయినా బడికి సెలవులిచ్చినా మరిచిపోతారు – ఎందుకని? అవి తాత్కాలికంగా గుర్తుపెట్టుకొన్న అక్షరాలు – వినియోగం ఉండకపోవడం మరో కారణం. చాలా ఆలస్యమవుతూ ఉంటుంది. అలస్యమయ్యేకొద్దీ ఆసక్తిపోతుంది. బడి కూడా మానుకొంటారు.

**పద పద్ధతి :** పదం చదవడం ద్వారా అక్షరాలు నేర్పడం. ఒక తెలిసిన పదాన్ని – బొమ్మ సహాయంతో పలికించి అందులో ఉండే అక్షరాలను గుర్తింపజేయడమే పద పద్ధతి. ఇక్కడ కూడా అక్షరాలే గుర్తు పెట్టుకోవాలి. అక్షరాలు 'గుర్తించకుండా పదాన్ని మొత్తాన్ని కంఠస్తం చేసి చదవడం వల్ల ఎలాంటి ఉపయోగంలేదు. ఇది ప్రమాదం కూడా – 'పలక' అనే పదం పిల్లలకు తెలుసు. పలక బొమ్మ ద్వారా పదాన్ని పలికించి విడివిడిగా అక్షరాలను నేర్పించాలి. దీనివలన చదవడం – అక్షరాలు గుర్తించడం రెండూ ఏకకాలంలో జరుగుతాయి. ఇలా రెండు మూడు పదాలు నేర్చుకొంటూ ఆ పదాలలో వచ్చే అక్షరాలతో మరిన్ని పదాలు తయారు చేసి చదివించు కొంటూ వెళ్ళాలి.

అక్షరాలు చదవడం ద్వారా గుర్తిండిపోతాయి. మరిచిపోరు. కొన్ని అక్షరాలు నేర్పిన తర్వాత అప్పటివరకు నేర్పిన హల్లులకు గుణింతం చేర్చి పదజాలం తయారుచేయాలి. గుణింతం పాత పద్ధతిలో ఒక అక్షరానికి అన్ని గుణింతాలు –కకాకికీ.... ఇలా కాకుండా, అన్ని అక్షరాలకు ఒక గణితం ....కా,పా,రా,తా– ఇలా నేర్పాలి. మొదట

తెలుగు భాషలో ఎక్కువగా ఉపయోగించే దీర్ఘం కొమ్ము నేర్పాలి. ఇలా వాటి వాటి ప్రాధాన్యతనుబట్టి గుణింతం మొత్తం నేర్పాలి.

మొదట సులభమైన అక్షరాలను నేర్పి వీటి ఆధారంగా క్లిష్టమైన అక్షరాలు చివర నేర్పాలి. ఇలా క్రమక్రమంగా ద్వితాలు సంయుక్తాలు వత్తు అక్షరాలు కలుపుకొంటూ పదాల ద్వారా, వాక్యాల ద్వారా, పాఠాల ద్వారా మొత్తం నేర్పించాలి. ఈ క్రమం ఇలా దశలవారీ ఉంటే మంచిది.

1వ దశ – అఆఇఈఉఊఎఏఒఓ అం.
కచటతప గజ డదబనమయరలవస
పై హల్లులకు గుణింతాలు.

2వ దశ – ద్విత్వాలు (ఒక అక్షరం కింద అదే అక్షరం వత్తుగా వచ్చేవి)
అ)సారూప్య ద్విత్వాలు– ట్ట గ్గ జ్జ డ్డ ద్ద ప్ప చ్చ బ్బ స్స
ఆ)వైరూప్య ద్వితాలు – క్క త్త న్న మ్మ య్య ర్రల్లవ్వ

3వ దశ – పొల్లు అక్షరాలు – క్ బ్ ట్ త్ – ఐ ఔ ై ౌ
విశేష అక్షరాలు – శ ళ ష హ ణ కృ

4వ దశ – సంయుక్తాలు – అక్షరం కింద వేరే అక్షరం వత్తుగా
అ)సారూప్య సంయుక్తాలు– ర్ద ర్ట ర్చ క్ట ల్స ల్బ ర్స ర్జ
ఆ)వైరూప్య సంయుక్తాలు–ర్క ర్త ర్న ర్మ ర్య క్ర ల్వ ర్ల

5వ దశ – వత్తు అక్షరాలు (మహా ప్రాణాలు – ఖ ఘ ఛ ఝ ఠ ఢ థ ధ ఫ భ

మొదటి దశ 1వ తరగతిగాను –

మిగిలిన 2,3,4,5 దశలు 2వ తరగతిగాను పరిగణించి నేర్పాలి.

జనవిజ్ఞాన వేదిక రూపొందించిన తేట తెలుగు 1,2 వాచకాలు ఇలా రూపొందినవే – ఎస్‌సిఇఆర్‌టి రూపొందించిన ప్రభుత్వ పాఠ్య పుస్తకాలు కూడా ఇలా రూపొందించినవే.

మొత్తం అక్షరమాలలోని అక్షరాలు వత్తులు సంయుక్తాలు అన్నీ 1,2 తరగతుల్లో పరిచయమవుతాయి. 80శాతం చదవడం 60 శాతం రాయడం వస్తుంది – 3వ తరగతిలో వేగంగా చదవడం మరికొంత మెరుగ్గా రాయడం జరుగుతుంది.

ప్రశ్నలకు జవాబులు చెప్పి కంఠస్తం చేయించడం మానుకోవాలి. ప్రశ్నలకు జవాబులు పిల్లలే తెలుసుకునేటట్లు శిక్షణ ఇవ్వాలి – 4,5 తరగతుల్లో పాఠాలు వాళ్లే చదివి వాళ్ళే జవాబులు రాసుకొనేటట్లు అలవాటు చేయాలి. ఇలా చేసే శక్తి పిల్లలకు ఉంది.


**చదవడంలో మెళకువలు :**

1. **కంఠస్తం చేసి చదవడం :** దీనివలన చూసే పదం ఒకటి చదివేది మరొకటిగా మారి గందరగోళంలో పడిపోతూ వుంటారు. ఏ పదం చూస్తున్నాడో ఆ పదాన్నే పలకాలి.
2. విడివిడిగా అక్షరాలు చదివి పదం చదవడం అనే అలవాటు నాలుగైదు పాఠాల తర్వాత ఒకేసారి చదవడం అలవాటు చేయాలి. వాళ్ళు చదవగలరు.
3. 5వ తరగతి వచ్చేసరికి – స్పష్టంగా భావ యుక్తంగా చదవడం నేర్పాలి – ఇందుకోసం నాటికలు బాగా ఉపయోగపడతాయి.
4. పదాలు, వాక్యాలు కొత్తగా చదివేటప్పుడు కొత్తగా ఈత నేర్చుకొనే పిల్లల్లా భయపడుతూ మునకలువేస్తూ ఉక్కిరిబిక్కిరి అవుతూ ఉంటారు. వెంటనే ఇతర పిల్లలు గాని టీచర్లుగాని ఆ పదాలు చదివేస్తారు. నేర్చుకొనే పిల్లలు నిరుత్సాహపడతారు. వాళ్ళనే ప్రయత్నించేలా చేయాలి. వాళ్ళు చెప్పమని అడిగేంతవరకు చెప్పకూడదు. ఓపిగ్గా ఆగిఉండాలి.
5. కొన్నిసార్లు టీచర్ ముందుగా పాఠంలో పదాలు చదివి వినిపించడం, తాను చదివి పలికించడం చేయవచ్చు. ఈ రెండు సార్లు పిల్లలు ఎక్కడ పలుకుతున్నారో ఆ పదాన్నే చూడాలి.
6. **రాతలో తప్పులు :** రాతాలో తప్పులు పోవడానికి ప్రధాన కారణం – బాగా చదవలేకపోవడం–ఎంత బాగా చదివితే అంత బాగా రాస్తారు. దీర్ఘం లేని అక్షరాలకు దీర్ఘం పెట్టడం ఉన్నవాటిని తీసివేయడం ఎక్కువ జరుగుతుంది. భయపడాల్సిన అవసరం లేదు.

స్పష్టంగా భావయుక్తంగా చదివే పిల్లలు తప్పులు రాయరు – ఎక్కువసార్లు చూసిరాయడం ద్వారా తప్పులు సరిచేయాలని చూడడం పొరపాటు. అలా ఎన్నటికీ జరగదు. చూసిరాయడం అలవాటుచేస్తే వాళ్ళు అలారాస్తూనే ఉంటారు. ఎందుకంటే ఏదోఒక పని జరుగు తున్నట్లు కన్పించడానికి అలా చేస్తుంటారు పిల్లలు.

## దేశమును ప్రేమించుమన్నా..

**1910లో గురజాడ రచించిన ఈ గేయం నేటి తరానికి ఆదర్శనీయం. ఆచరణీయం.**



**దేశమును ప్రేమించుమన్నా**
**మంచి యన్నది పెంచుమన్నా**
**వొట్టి మాటలు కట్టిపెట్టోయ్**
**గట్టిమేల్ తలపెట్టవోయి**
**పాడి పంటలు పొంగిపొర్లే**
**దారిలో నువు పాటు పడవోయి**
**తిండి కలిగితే కండకలుగును**
**కండ కలవాడేను మనిషోయి**
**యీసురోమని మనుషులుంటే**
**దేశమేగతి బాగు అగునోయ్**
**జల్దుకుని కళలన్ని నేర్చుకు**
**దేశి సరకులు నింపవోయ్**
**దేశాభిమానం నాకు కద్దని**
**వొట్టి గొప్పలు చెప్పకోకోయ్**
**పూని ఏదైనాను ఒక మేల్**
**కూర్చి జనులకు చూపవోయ్**
**చెట్టపట్టాల్ పట్టుకుని**
**దేశస్థులంతా నడువవలెనోయ్**
**అన్నదమ్ముల వలెను జాతులు**
**మతములన్నియు మెలగవలెనోయ్**
**సొంత లాభం కొంత మానుకు**
**పొరుగు వానికి తోడుపడవోయ్**
**దేశమంటే మట్టి కాదోయ్**
**దేశమంటే మనుషులోయ్**

**(సెప్టెంబర్ 21వ తేదీ గురజాడ జయంతి సందర్భంగా...)**

## మున్సిపల్ పాఠశాలలు, ఉపాధ్యాయుల సమస్యలపై డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కె.కన్నబాబు గారితో ఫ్యాప్టో చర్చలు

ఫ్యాప్టో ఆధ్వర్యంలో మున్సిపల్ సమస్యలపై ఆగస్టు 17వ తేదీ జరిగిన ధర్నా నేపథ్యంలో ఈ రోజు (18.08.2017) ఉదయం డిఎంఏ కార్యాలయం (గుంటూరు)లో చర్చలు జరిగాయి. ఫ్యాప్టో ప్రతిపాదించిన అంశాలపై 3 గంటలపైగా జరిగిన చర్చల్లో ముఖ్యమైన అంశాలు....

1. మున్సిపల్ పాఠశాలల్లో తెలుగు మీడియం టెక్స్టుబుక్స్ పంపిణీకి వెంటనే చర్యలు తీసుకొంటామని తెలిపారు.
   మున్సిపల్ పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లీషు రెండు మీడియంలు కొనసాగింపుపై మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి, మంత్రి గార్లతో సమావేశమై సానుకూలంగా నిర్ణయం చేద్దామని తెలిపారు.
2. సర్వీస్‌రూల్స్‌లో ప్రమోషన్స్‌లో బేస్డ్ ఆన్ ఎబిలిటీ అనేది తొలగించాలని, ప్రమోషన్ కోటా 70:30గా మార్చాలని, ఎల్ఎఫ్ ఎల్ హెచ్ఎం పోస్టు కూడా హెచ్ఎం ప్రమోషన్స్‌లో ఫీడర్ కేటగిరీలో చేర్చాలని కోరగా అన్ని అంశాలపై పాజిటివ్‌గా స్పందించారు. అన్ని ప్రపోజల్స్ కార్యదర్శిగారికి పంపి ఆమోదం తీసుకుంటామని తెలిపారు.
3. ప్రమోషన్స్ త్వరలో ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటానికి అంగీకరించారు. సర్వీస్‌రూల్స్‌లోని సవరణలు చేసిన వెంటనే సీనియార్టీ లిస్టు తయారు చేసి, అప్పీల్స్ తీసుకుని, ఫైనల్ చేసి ప్రమోషన్స్ ఇచ్చేందుకు షెడ్యూలు ప్రకటిస్తామని తెలిపారు.
   అప్‌గ్రేడ్ చేసిన పండిట్, పిఇటి పోస్టులకు కూడా విద్యాశాఖ రూపొందించిన రూల్స్ ప్రకారం వెంటనే ప్రమోషన్స్ ఇచ్చేందుకు అంగీకరించారు.
4. **బదిలీలు :** ప్రమోషన్స్ అయిన వెంటనే ఖాళీలు ఏర్పడతాయని వాటితో కలిపి స్పౌజ్, పరస్పర బదిలీలు, అంతర్‌జిల్లా బదిలీలు చేపడతామని దానికి కూడ షెడ్యూలు ప్రకటిస్తామని తెలిపారు.
5. ఎంఇఓ / డివైఇఓ పోస్టులు మంజూరుకు ఆర్థికశాఖ ఆమోదం పొందాల్సి ఉందని, ఆ ప్రతిపాదనలు పంపాతామని తెలుపుతూ ఈలోగా తాత్కాలికంగా పర్యవేక్షణ అధికారులను నియమిస్తామని తెలిపారు. వారి జాబ్ చార్టు తయారు చేసి ఆ తర్వాత అవి అంగీకరించిన వారినే నియమిస్తామని తెలిపారు. తాత్కాలిక పోస్టులైనప్పటికి సీనియార్టీ ప్రకారం నియమించాలని, అంగీకారం లేని వారిని మినహాయించాలని ఫ్యాప్టో తరపున కోరాం.
6. ప్రధానోపాధ్యాయులకు జిఓ 40లోని అధికారాలు ఇవ్వాలని కోరగా పాఠశాల నిర్వహణలో ఆటంకం కాని అంశాలలో పూర్తి అధికారాలు ఇస్తామని తెలిపారు.
7. పిఎఫ్ సౌకర్యం కల్పించే విషయంలో ఇప్పటికే డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీకి లెటర్ వ్రాశామని, మరో లెటర్ వ్రాసి వారి అంగీకారంతో పిఎఫ్ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు.
8. మున్సిపాలిటీ / కార్పొరేషన్ పరిధిలోని యుపి పాఠశాలలకు, ఉర్దూ పాఠశాలలకు అవసరమైన స్కూల్ అసిస్టెంట్, తెలుగు, హిందీ పండిట్స్ పోస్టులు మంజూరుకై విద్యాశాఖతో చర్చించి, పోస్టులు వచ్చేలా కృషి చేస్తామని తెలిపారు.
9. మున్సిపల్ ఉపాధ్యాయులకు అర్ధజీతపు సెలవు నగదుగా మార్చుకొనే సౌలభ్యం కల్పించేందుకు ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు. (ఆ తర్వాత జిఓ విడుదలైంది)
10. మున్సిపల్ / కార్పొరేషన్‌ల పరిధిలో నూతన పాఠశాలలు అవసరం అయితే ప్రతిపాదనలు పంపమని ఇప్పటికే కమీషనర్‌లకు ఆదేశాలు ఇచ్చామని, కొన్ని మున్సిపాలిటీల నుండి ప్రపోజల్స్ వచ్చాయని పరిశీలించి పాఠశాలల ఏర్పాటుకు చర్యలు చేపడతా మని తెలిపారు.
    ఏ ప్రాంతంలో పాఠశాలలు అవసరం అయితే ఆయా కమీషనర్‌లు ప్రతిపాదనలు పంపితే పరిశీలిస్తామని తెలిపారు.
11. మెడికల్ రీయింబర్స్‌మెంట్ కమీషనర్ నేరుగా ఎన్‌టిఆర్ వైద్యసేవ ట్రస్టుకు పంపి మంజూరై వచ్చిన తర్వాత డిఎంఏకి చెక్‌స్లిప్‌లో ఉన్న విధంగా పంపాలని తదుపరి డిఎంఏ నుండి మంజూరు ఉత్తర్వులు ఇస్తామన్నారు.
12. విదేశీ పర్యటనకు సెలవు మంజూరు సులభతరం చేయాలని కోరడం జరిగింది. 3 నెలలలోపు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్, 3 నెలలు దాటితే సెక్రటరీ ఆమోదంతో ఉత్తర్వులు ఇచ్చుటకు అంగీకరించారు.

## డిటెన్షన్ విధానం విరమించుకోవాలి

5,8 తరగతుల్లో డిటెన్షన్ అమలు చేయాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వల్ల డ్రాపౌట్స్ పెరుగుతారని, పేద పిల్లలు, ప్రభుత్వ పాఠశాలలే నష్టపోతాయని ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలని యుటియఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఐ.వెంకటేశ్వరరావు, పి.బాబురెడ్డి డిమాండ్ చేశారు.

స్వాతంత్ర్యం వచ్చిన 63 సం॥ల తర్వాత 2010లో విద్యాహక్కు చట్టం తెచ్చారని, అందులో 8వ తరగతి వరకు (ప్రాథమిక విద్య) ఫెయిల్ చేయరాదనే నిబంధన సెక్షన్ 16లో ఉందని, డిటెన్షన్ కోసం విద్యాహక్కు చట్టాన్ని కూడా మార్పు చేయాలనుకోవడం పేదలకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ విద్యను దెబ్బ తీయడమేనని వారు అన్నారు. ఇప్పటికీ దేశంలో ఉన్నత విద్యలో ప్రవేశించే వారు కేవలం 23%, ఎస్‌సిల్లో 11.6%, ఎస్‌టిల్లో 7.3% మాత్రమే ఉన్నారు. మన దేశ అక్షరాస్యత 74.04 వుండగా రాష్ట్రంలో 67.41% మాత్రమే ఉంది.

కేంద్ర నిర్ణయం వలన పేద విద్యార్థులే పై చదువులకు దూరం అవుతారని వారు అన్నారు. బాలిక విద్య మరింత దిగజారుతుందని, బాల్య వివాహాలు పెరుగుతాయన్నారు. డిటెన్షన్ విధానం వలన 5,8 తరగతుల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు డ్రాపౌట్స్ కావడం, బాలకార్మికులుగా మారడం జరుగుతుందని వారు అన్నారు.

విద్య, విద్యార్థి యొక్క సంపూర్ణ వ్యక్తిత్వ వికాసాన్ని అభివృద్ధి చేసేదిగా ఉండాలి తప్ప కేవలం సంవత్సరం చివర్లో పెట్టే పరీక్షల్లో వచ్చే మార్కులు / గ్రేడ్‌లతో విద్యార్థుల జ్ఞానాన్ని కొలవడం సరైంది కాదని విద్యావేత్తలు, మానసిక నిపుణులు ప్రకటించారని, కార్పొరేట్ మయం అయిన ప్రభుత్వాలకు అవి కనబడటం లేదన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2015 అక్టోబర్ 4వతేదీన జరిపిన రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో హాజరైనవారు 95%మంది డిటెన్షన్ వద్దన్న విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిగణలోకి తీసుకొని నాన్ డిటెన్షన్ కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు.

# ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ - బాధ్యత

ఏ దేశ భవిష్యత్‌నైనా ప్రభావితం చేసి, దిశానిర్దేశం చేసేది ఆ దేశ విధానాలు, విద్యావ్యవస్థలు. విద్యావ్యవస్థలో 'పాఠశాల విద్య' కీలకమైన ప్రాధాన్యత కలిగివుంది. ఇటీవలి కాలంలో మన ప్రభుత్వ పాఠశాలలు మరింత గడ్డు పరిస్థితులు, కొత్త కొత్త సవాళ్ళను ఎదుర్కొంటూ ప్రమాదకర పరిస్థితులలోకి నెట్టబడుతున్నాయి. ఇటువంటి సందర్భంలో ప్రభుత్వ పాఠశాలల నిర్వీర్యానికి దారితీస్తున్న కారణాలు, సవాళ్ళు, బాధ్యతలపై పునరాలోచన చేయాల్సివుంది. ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకోవడంలో ఉపాధ్యాయులుగా మన స్పందనలో ధోరణులను విశ్లేషించుకోవాలి, దృక్పధాలను సరి చేసుకోవాలి.

**ఆంగ్ల మాధ్యమ మోజు :**

భాషాంశాలతో సహా అన్ని శాస్త్రాలకు సంబంధించిన మౌలిక, కీలక భావనల పరిజ్ఞానం; స్వంత ఆలోచన, సృజనాత్మకత, అభిప్రాయ వ్యక్తీకరణ, ప్రశ్నించే తత్వం, పరిశోధనాసక్తి, అవగాహన - ఆచరణలు; ఇవన్నీ పాఠశాల విద్యలోనే సహజంగా, క్రమానుగతంగా పిల్లల్లో పెంపొందించబడతాయి. ఈ పాఠశాల స్థాయి విద్యా నైపుణ్యాలు, లక్ష్యాలు మాతృభాషా మాధ్యమం ద్వారా మాత్రమే సంపూర్ణంగా సాధించబడతాయి. దీనికి నిరూపణలుగా దాదాపు అన్ని ప్రపంచదేశాలు పాఠశాల విద్యలో మాతృభాషా మాధ్యమానికే ప్రాధాన్యతనిస్తూ, పిల్లల విజ్ఞాన వికాసాన్ని పెంపొందిస్తూ సమగ్రాభివృద్ధిని సాధిస్తుండడం చూడవచ్చు. శతాబ్దాలనుండి శాస్త్రవేత్తలు, మేధావులు, పరిశోధనలతో సహా ఇటీవలి మన విద్యాహక్కు చట్టం కూడా ఈ వాస్తవాన్నే పునరుద్ఘాటిస్తున్నాయి. కానీ, పిల్లల స్వేచ్ఛాయుత సమగ్ర అభివృద్ధికి ఎటువంటి తర్కం, నిరూపణలు లేని మార్కెట్ ప్రేరిత ఆంగ్ల మాధ్యమ మోజు వరదలో తల్లిదండ్రులు కొట్టుకొని పోతుండడం విచారకరం. పాఠశాల విద్య పూర్తి నాటికి మాతృభాషా మాధ్యమంలో విషయాంశాల మౌలిక భావనలపై ఆధిపత్యం; ఆంగ్లంలో భాషా పరమైన నైపుణ్యాలపై పట్టు, సమ్మిళితంగా ఉన్నతవిద్య, ఉద్యోగ, భవిష్యత్‌లకు ఎలాంటి ఆటంకాలు లేకుండా సరియైన బాటలు వేస్తుందనే శాస్త్రీయ వాస్తవాన్ని ఉపాధ్యాయులు, విద్యావంతులు కూడా గుర్తించకపోవడం దురదృష్టకరం.



కె. సురేష్
అనంతసాగరం, నెల్లూరు

**పిల్లల సైకాలజీ పట్ల నిర్లక్ష్యం :**

పాఠశాల విద్య, విధానాలు, లక్ష్యాలు, పిల్లల మనోవైజ్ఞానిక శాస్త్ర ప్రాతిపదికగానే రూపొందించబడాలి అనే ప్రాథమిక సూత్రాన్ని పాలకులు విస్మరిస్తున్నారు. పిల్లల హక్కులతోకూడిన "ఒత్తిడిలేని, భారం లేని విద్యార్థి కేంద్రీకృత" విద్యా విధానాలను శతాబ్దాల క్రితం నుంచి నేటివరకు ఎంతోమంది మనోవిజ్ఞాన శాస్త్రవేత్తలు, తత్వవేత్తలు, మేధావుల నుండి ఇటీవలి విద్యారంగ అత్యున్నత స్థాయి కమిటీలు, కమీషన్‌లు నొక్కి వక్కాణించాయి. పిల్లలకు స్వేచ్ఛ, విరామం, ఆటలు, వినోదం, సెలవులు, రక్షణవంటి హక్కులకు అవకాశం కల్పిస్తేనే 'నాణ్యమైన విద్య' అందించడం సాధ్యమని దృఢమైన సిఫార్సులు వీరు చేశారు. పిల్లల హక్కుల ప్రేమికులే కాక, ఉన్నత పౌరసత్వ విలువలతో కూడిన సమాజాన్ని కాంక్షించే విద్యావంతులు, విద్యాహక్కు చట్టాలు ఇటువంటి విద్యా వ్యవస్థలు, విధానాలనే సమర్థిస్తారు, కోరుకుంటారు. వీటన్నింటినీ తుంగలో తొక్కి, కెరీర్ పేరుతో వయస్సు, స్థాయి, శారీరక మానసిక పరిణితి, హక్కులు, విలువలు వంటి పిల్లల పరమైన అంశాలను ఏ మాత్రం పట్టించుకోకుండా లాభాలవేటకై సృష్టించబడుతున్న "జ్ఞానాన్ని కుక్కే" విధానాలు, కేంద్రాలవైపు ఏ మాత్రం తర్కం లేకుండా పరుగులు పెడుతున్నారు.

ఆంగ్ల మాధ్యమమోజు, పిల్లల స్వేచ్ఛా హక్కులు పట్టని విపరీతపు ఆకాంక్షలు కలగలిపి ప్రైవేట్ కార్పొరేట్ విద్యా వ్యవస్థలను, విద్యా రంగాన్ని శాసించే స్థాయికి బలీయం చేసిన మధ్య తరగతి మనస్తత్వాలు ఒకవైపు వుంటే, మరోవైపు విధానపరమైన శాపాలు, సమస్యలు, సవాళ్ళను ఎదుర్కొంటూ, ఏటా రేషనలైజేషన్ విషవలయంలో చిక్కుకుని రోజురోజుకూ కుంచించుకుపోతూ పేద ప్రజల ఆశల పల్లకీలుగా మిగులుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలలో ఇప్పుడున్న లోపాలు ఇంతకు పదింతలు పెరిగినా కూడా పిల్లల దృష్ట్యా ప్రైవేట్ కార్పొరేట్ విద్యా విధానాలు ప్రభుత్వ పాఠశాలలకు ప్రత్యామ్నాయం కానేకావు అన్న వాస్తవాన్ని నమ్మేవారు కరువౌతున్నారు. చివరకు ప్రభుత్వ పాఠశాలల విజయాల గురించి గొప్పగా మాట్లాడే సందర్భంలో కూడా "ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా" అనే నిర్వేతుకమైన పోలికతో, అంగీకరించబడని భావన అయిన 'మార్కెట్ విద్య' గొప్పదనే సందేశం ప్రచారం చేయబడుతోంది.

**విధానపరమైన కారణాలు :**

దశాబ్దాలుగా ప్రభుత్వాలు తమ విధానాలు, ప్రైవేటీకరణకై అత్యుత్సాహం ప్రభుత్వ పాఠశాలలను బలహీనం చేస్తూనే వున్నాయి. ఉపాధ్యాయుల కొరత, సౌకర్యాలలేమి, బోధనేతర విధులు, కార్యక్రమాలు, ఇవన్నీ చాలవన్నట్లు క్రమబద్ధత లేకుండా లెక్కలేనన్ని మార్పులు, సవరణలతో; విరుద్ధ ప్రయోగాలతో బోధన, మూల్యాంకన పద్ధతుల్లో అయోమయ, గందరగోళ పరిస్థితులు, వెరసి ప్రభుత్వ పాఠశాలలు నాణ్యమైన విద్య అందించలేనివిగా భ్రమించే పరిస్థితులు కల్పించబడుతూనే వున్నాయి. మరోవైపు నిబంధనలకు విరుద్ధంగా, ఇష్టానుసారంగా, ఇబ్బడి ముబ్బడిగా అనుమతులు, ప్రోత్సాహాలు, ప్రభుత్వేతర విద్యా సంస్థలకు వరాలు కురిపిస్తూ ఈ సంస్థల్లోనే నాణ్యమైన విద్య అందుతుంది అనే సందేశాన్ని ప్రత్యక్షంగా పరోక్షంగా ప్రజల్లోకి పంపిస్తూ అవి సమాంతర వ్యవస్థలుగా ప్రబలమవడానికి ప్రభుత్వాలు దోహదం చేస్తున్నాయి.

**యంత్రాంగపరమైన, ఉపాధ్యాయపరమైన కారణాలు :**

వ్యవస్థీకృత విద్యా లక్ష్యాలు సాధించబడడంకంటే పై వారి ఆదేశాలకనుగుణంగా తగిన రిపోర్టులు, రికార్డులు, ఆధారాలు నిర్వహించడమే 'రక్షణాత్మకం' అనే భావనకు ప్రాధాన్యత పెరుగుతున్నది, ఇది సరిచేయబడాలి. వైఫల్యాలకు, ప్రభుత్వాలు అధికార యంత్రాంగాలను బాధ్యులుగా చూస్తుంటే, అధికార యంత్రాంగాలు క్షేత్ర స్థాయిలో ఉపాధ్యాయులను బాధ్యులుగా చూస్తున్నారు. వైఫల్యాలకు కారణమయ్యే బాధ్యతారాహిత్యాన్ని ఏ స్థాయిల్లో కూడా ఉపేక్షించాల్సిన పని లేదు. అయితే ప్రధానంగా ప్రభుత్వ నిర్వీర్యానికి కారణంగా అందరూ నిందించేది, బాధ్యులను చేసేది ఉపాధ్యాయులనే. ఇది పూర్తిస్థాయి వాస్తవం కాదు. ఉపాధ్యాయుల బాధ్యతారాహిత్యాన్ని సక్రమంగా నిర్వహించడానికి, నియంత్రించడానికి, పర్యవేక్షించడానికి

(తరువాయి 22వ పేజీలో)

## పాఠశాల విద్య కమీషనర్‌తో ప్రాతినిధ్యాలు


ఆగస్టు 21న యుటియఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు, ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు పాఠశాల విద్య కమీషనర్‌తో పలు అంశాలు చర్చించడమైనది.

1. సబ్‌స్ట్యూట్‌తో నిమిత్తం లేకుండా బదిలీ అయిన వారందరినీ రిలీవు చేయాలని విజ్ఞప్తి చేయడమైనది. డిఇఓలనుండి పూర్తి సమాచారం అందిన తర్వాత తగు ఆదేశాలు ఇస్తామని కమీషనర్ తెలియజేశారు.
2. ఏజెన్సీ ముంపు మండలాలలో డిప్యుటేషన్‌లో పనిచేస్తున్న వారందరినీ (246మంది) 2017 బదిలీలలో మైదాన ప్రాంతంలో వారు కోరుకున్న పాఠశాలలకు పంపించాలి. ప్రత్యామ్నాయంగా ఏజెన్సీ స్పెషల్ డిఎస్‌సి నిర్వహించాలి. తక్షణం అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించాలని విజ్ఞప్తి చేయడం జరిగింది. విద్యాశాఖ కార్యదర్శితో మాట్లాడి తగు నిర్ణయం తీసుకుంటామని కమీషనర్ తెలిపారు.
3. 610 జిఓ అమలులో భాగంగా కొన్ని జిల్లాలలో ప్రమోషన్లు నిలుపుదల చేశారు. అయితే 20% ఓపెన్ కాంపిటిషన్‌లో నియామకమైన వారిని కూడ 610 పరిధిలో చూపించి కొందరు డిఇఓలు ప్రమోషన్‌లు నిలుపుదల చేస్తున్నారని కమీషనర్‌కు తెలియజేశాం. 2000 డిఎస్‌సికి ముందు కొన్ని జిల్లాల్లో 70:30 రేషియోలో నియామకాలు జరిగాయి. హైకోర్టు ఉత్తర్వుల మేరకు 2000 పూర్వపు డిఎస్‌సిలలో నియామకమైన 70-80 మధ్య 10%లో నియామకమైన వారికి ప్రభుత్వం మినహాయింపు ఇచ్చింది. కావున వీరందరినీ గుర్తించి జిల్లాల్లో ప్రమోషన్లు ఇప్పించాలని విజ్ఞప్తి చేయడమైనది. రాష్ట్ర విభజన నేపథ్యంలో తెలంగాణ స్థానికత కలిగినప్పటికి ప్రస్తుతం ఏపిలో వారు పనిచేస్తున్న జిల్లాలలో వెంటనే ప్రమోషన్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశాము. దీనిపై తగు నిర్ణయం తీసుకుంటామని కమీషనర్ తెలిపారు.
4. డిఎస్‌సి మెరిట్-కం-సీనియార్టీ లిస్టులు ఆన్‌లైన్‌లో ఉంచాలని డిఇఓలకు తగు ఆదేశాలు ఇస్తామని కమీషనర్ తెలియజేశారు.
5. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రధానకార్యదర్శులు అంతరరాష్ట్ర పరస్పర, స్పౌజ్ బదిలీలకు అనుమతించిన నేపథ్యంలో తగు మార్గదర్శకాలు డిఇఓలకు పంపించాలని విజ్ఞప్తి చేశాము. అయితే విద్యాశాఖ నుండి తమకు ఆదేశాలు రాలేదని, ఉపాధ్యాయులు నేరుగా సిఎస్‌ఇ కార్యాలయానికి పంపినవాటిని ప్రభుత్వానికి పంపిస్తామని కమీషనర్ తెలియజేశారు.

## అంతరరాష్ట్ర బదిలీలకు మార్గదర్శకాలు ఇవ్వాలి

ఉపాధ్యాయుల అంతరరాష్ట్ర బదిలీలకు దరఖాస్తు చేసు కొనుటకు డిఇఓలకు తగు మార్గదర్శకాలు ఇవ్వాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధానకార్యదర్శి ఆధిత్యనాథ్ దాస్‌ని ఆగస్టు 30న కలిసి విజ్ఞప్తి చేయడమైనది. దీనిపై పాఠశాల విద్యాశాఖ కమీషనర్‌ను మార్గదర్శకాలు విడుదలచేయాలని ఆదేశాలిచ్చారు.

మైదానప్రాంతంనుండి ఏజెన్సీ విలీన మండలాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని, ఏజెన్సీ ఉపాధ్యాయ ఖాళీలకు ప్రత్యేక డిఎస్‌సి తక్షణమే నిర్వహించాలని ఆదిత్యనాథ్‌దాస్‌కు విజ్ఞప్తి చేయగా దీనిపై వెంటనే తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బదిలీ కోరుకున్న ఉపాధ్యాయుల అందరినీ వెంటనే రిలీవ్ చేయుటకు ఆదేశాలు ఇప్పించాలని విజ్ఞప్తి చేసినట్లు వారు తెలిపారు.



ఐ.వెంకటేశ్వరరావు
యుటియఫ్ రాష్ట్రఅధ్యక్షులు

## మున్సిపల్ ఉపాధ్యాయుల పిఎఫ్ డిటిఏ ద్వారా నిర్వహించాలి

మున్సిపల్ ఉపాధ్యాయులకు ప్రావిడెంట్ ఫండ్ (పిఎఫ్) డిటిఏ ద్వారా నిర్వహించాలని డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ & అక్కౌంట్స్ కనకవల్లికి ఆగస్టు 29న కలిసి విజ్ఞప్తి చేయడమైనది. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ నుండి వచ్చిన ప్రతిపాదనల మేరకు ప్రభుత్వ అనుమతికి లేఖ వ్రాస్తానని, అనుమతి వచ్చిన వెంటనే డిటిఏ ద్వారా పిఎఫ్ నిర్వహించడం జరుగు తుందని తెలిపారు.

## అంతర్రాష్ట్ర బదిలీల్లో అందరికీ అవకాశం కల్పించాలి

రాష్ట్ర విభజనతో వందలాదిమంది ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఆంధ్ర, తెలంగాణ రెండు రాష్ట్రాలలో బదిలీలు కోరుకొనే వారున్నారని వారందరికీ ఒకసారి అయినా అవకాశం ఇవ్వాలని యుటియఫ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

అనేకమంది భార్యా భర్తల్లో ఒకరు ప్రభుత్వ ఉద్యోగం చేస్తుంటే మరొకరు ప్రైవేటు సంస్థలలో, చిన్న సంస్థలలో పనిచేస్తూ వుంటారు. వారికి కూడ స్వంత రాష్ట్రానికి వెళ్ళేందుకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేయడం జరిగింది.

## ఆగస్టు 29కి డ్రాఫ్ట్ సర్వీస్‌రూల్స్

పాఠశాల విద్యాశాఖ డ్రాఫ్ట్ సర్వీస్‌రూల్స్ ఆగస్టు 29కి విడుదల చేస్తామని సర్వీస్ రూల్స్ కమిటీ కన్వీనర్ ఎంవి సత్యనారాయణ ఐఏఎస్ (రిటైర్డ్) తెలిపారు. మంగళవారం (22.08.2017) నాడు విజయవాడ ఇన్నోటెల్ హోటల్‌నందు సర్వీస్ రూల్స్ కమిటీ ఎంవి సత్యనారాయణ అధ్యక్షతన సమావేశం అయ్యింది. ఆగస్టు 29 నాటికి విద్యాశాఖ డ్రాఫ్ట్ రూల్స్ విడుదల చేయాలని, 09.09.2017 నాటికి అభిప్రాయాలు సేకరించాలని, 13.09.2017న కమిటీ తిరిగి సమావేశమై సర్వీస్ రూల్స్ విడుదల చేయాలని నిర్ణయాలు తీసుకోవడం జరిగింది. ఉపాధ్యాయ సంఘాల తరపున ఐ.వెంకటేశ్వరరావు (యుటియఫ్), ఇ.షణ్ముర్తి (ఎస్‌టియు), ఎం.కమలాకర్‌రావు (పిఆర్‌టియు), జి.హృదయరాజు (ఏపిటిఎఫ్), ఎన్.రఘురామిరెడ్డి (ఏపిటిఎఫ్ 257), జి.నారాయణరెడ్డి (హెచ్‌ఎంఏ), ఎం.సురేష్ (ఆపస్), బి.తిరుపాల్ (జిటిఏ), ఎమ్మెల్సీలు వి.బాలసుబ్రహ్మణ్యం, ఆర్.సూర్యారావు, కె.నరసింహారెడ్డి, జి.శ్రీనివాసులునాయుడు, ఏఎస్ రామకృష్ణ చర్చలలో పాల్గొన్నారు. కె.రవీంద్రనాథ్‌రెడ్డి జాయింట్ డైరెక్టర్ (సర్వీసెస్), ఎస్‌విఎం కృష్ణ (ఏడి), దేవానంద్‌రెడ్డి (ఆర్‌జెడి), సుబ్బారెడ్డిలు పాల్గొన్నారు.

ఇంటర్ విద్య పాఠశాల విద్యలో విలీనం చేయాలని, జూనియర్ లెక్చరర్ల ప్రమోషన్ అవకాశాలు ఇప్పించాలని, గిరిజన సంక్షేమ, మున్సిపల్ ఉపాధ్యాయులను ఉమ్మడి సర్వీస్‌రూల్స్‌లోకి చేర్చాలని, నియామకాలకు, ప్రమోషన్లకు అర్హతలలో స్పష్టత ఉండాలని మెజార్టీ సభ్యులు పేర్కొన్నారు.

## 7 ఉమ్మడి సర్వీస్‌రూల్స్ డ్రాఫ్ట్ విడుదల

సర్వీస్‌రూల్స్ కమిటీలో చేసిన నిర్ణయం మేరకు ఉమ్మడి సర్వీస్ రూల్స్ రూపొందించుటకు ఆగస్టు 31న డ్రాఫ్ట్ రూల్స్ విడుదల చేసింది.

ఈ డ్రాఫ్ట్‌లో ఎక్కువభాగం గతంలోవున్న జిఓలు 505, 538లోని అంశాలనే ఎక్కువగా పొందుపరిచారు. రిక్రూట్‌మెంట్‌లో లేని పోస్టులను తొలగించారు. బి.కాం., కామర్స్ అర్హతలు కలిగిన వారికి ప్రమోషన్లకు అవకాశం కల్పించారు.

గెజిటెడ్ ఆఫీసర్ పోస్టుల ప్రమోషన్‌కు జిఓ, ఇఓ టెస్టులు పాస్ కావాల్సిఉంది. అదే సందర్భంలో 45 సం॥లు వయస్సు దాటిన వారికి మొదటి ప్రమోషన్, 50 సం॥ల వయస్సు దాటిన వారికి టెస్టులు మినహాయింపు కొనసాగించారు.

అయితే ఎన్‌సిఇఆర్‌టి పోస్టులను తగ్గించారు. గ్రేడ్-1 ప్రధానోపాధ్యాయుల పోస్టులను తొలగించారు. ఇవి కొనసాగించాల్సిన అవసరం ఉంది.

అలాగే ఆర్‌ఎంఎస్‌ఏ, ఎస్‌ఎస్‌ఏ విభాగాల్లోని జెడి, ఆర్‌జెడి, డివైఇఓ, ఏఎంఓ, సిఎంఓ పోస్టులను ప్రస్తుతం భర్తీ చేసియున్నారు. వాటిని సర్వీస్‌రూల్స్‌లో పొందుపరచలేదు. గతంలోనే రద్దు కాబడిన పరిషత్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టులను చూపించారు.

## అర్ధ జీతపు సెలవు ఎన్‌క్యాష్‌మెంట్ ఉత్తర్వులు

జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్ ఉపాధ్యాయులకు అర్ధజీతపు సెలవు ఎన్‌క్యాష్‌మెంట్‌ను అనుమతిస్తూ జిఓ ఎంఎస్ నం.148 ఆర్థిక; తేది.21.08.2017న ప్రత్యేక ప్రధానకార్యదర్శి ముద్దాడ రవిచంద్ర ఉత్తర్వులు విడుదల చేయడం పట్ల యుటియఫ్ హర్షం ప్రకటించింది.

9వ పిఆర్‌సి సిఫారసుల మేరకు అనుతించిన ఈ రాయితీని తదుపరి జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్ ఉపాధ్యాయులకు ప్రభుత్వం నిలుపుదల చేసింది. సంఘాల విజ్ఞప్తి మేరకు 10వ పిఆర్‌సి తిరిగి వీరందరికీ అర్ధజీతపు సెలవు ఎన్‌క్యాష్‌మెంట్ సదుపాయం వర్తింపచేయాలని సిఫారసు చేయటం జరిగింది. ఈ ఉత్తర్వులను అనుసరించి రిటైర్మెంట్ అనంతరం ఎరెండ్‌లీవు మరియు అర్ధజీతపు సెలవు కలిపి 300 రోజులకు ఎన్‌క్యాష్ సౌకర్యం లభించింది.

## ఇంటర్ అర్హతతో కారుణ్య నియామకాలు

జూనియర్ అసిస్టెంట్ / టైపిస్ట్ స్థాయి పోస్టులలో కారుణ్య నియామకాలు చేయుటకు ఇంటర్మీడియేట్ కనీస అర్హతగా అనుమతిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు 112; తేది.18.08.2017 ప్రత్యేక ప్రధాన కార్యదర్శి లింగరాజు పాణిగ్రాహి విడుదల చేయటం పట్ల ఏపిజెఏసి చైర్మన్ పి.అశోక్‌బాబు, సెక్రటరీ జనరల్ ఐ.వెంకటేశ్వరరావు హర్షం వెలిబుచ్చారు.

2015లో రాష్ట్ర ప్రభుత్వం డిగ్రీ కనీస అర్హతగా మార్పు చేయటం వలన చాలామంది కారుణ్య నియామక అవకాశాలు కోల్పోయారు. కావున ఇంటర్ కనీస అర్హతగా కారుణ్య నియామకాలు చేయాలని ఉద్యోగ సంఘాల విజ్ఞప్తి మేరకు ఈ సవరణ ఉత్తర్వులు విడుదల చేయటం జరిగింది ఇలా నియామకం అయిన వారు 5 సం॥లోగా డిగ్రీ అర్హతలు సంపాదించాలని ఉత్తర్వులలో పేర్కొన్నారు.

(20వ పేజీ తరువాయి)

ఉద్దేశించబడిన యంత్రాంగానికి ఉపాధ్యాయుల వ్యక్తి బాధ్యతారాహిత్యాన్ని సరైనదారిలో పెట్టగలగడం అసాధ్యమేమీకాదు. ఏ స్థాయిలో కూడా సంస్కరించబడ సాధ్యంకాని బాధ్యతారాహిత్యాన్ని అంతిమంగా భరించాల్సిన అగత్యాన్ని పిల్లలకు కల్పించాల్సిన అవసరం లేదు. కానీ, ఎటొచ్చీ విధానపరేతర కారణాల్లో అన్ని స్థాయిల బాధ్యులను ప్రశ్నించ గల 'స్థాయి' లేని తల్లిదండ్రుల పిల్లలు మాత్రమే ప్రధాన సంఖ్యలో ఇక్కడ వుండడం అనేది అతిముఖ్యమైన కారణం. పై స్థాయిల నుండి క్రిందిస్థాయి వరకు విధాన నిర్ణేతలు, అధికారులు, ఉపాధ్యాయులు అందరూ ప్రభుత్వ విద్య, పాఠశాలలు పరిరక్షించబడాల్సిందే అనే తపన వ్యక్తం చేస్తూ, ఆచరణలో తమ పిల్లలు, వారసుల విషయంలో ప్రభుత్వ పాఠశాలలను అంటరానివిగా మార్చేసిన క్రమంలో వీరందరూ బాధ్యులే, సమాధానం చెప్పవలసిన వారే.

మొత్తంగా వ్యవస్థలకు బాధ్యత వహించే అత్యున్నత ప్రజా ప్రతినిధులు, నాయకుల నుండి స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకుల వరకు; అత్యున్నత అధికారుల నుండి చిన్న ఉద్యోగులవరకు అందరి పిల్లలు, వారసులను ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తే భరోసాతోకూడిన ప్రభావవంతమైన సందేశాన్ని అన్ని వర్గాల ప్రజలకు ఇచ్చినట్లు అవుతుంది. కేవలం ప్రభుత్వ ఉపాధ్యాయులు మాత్రమే తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించడం వారి నిబద్ధతను చాటుతుంది కానీ, ప్రజలందరికీ ప్రభావవంతమైన సందేశాన్నివ్వలేదు. పైన తెలిపిన ఆలోచన "సాధ్యంకాని ఊహాతీతమైన కల" ఏమీ కాదు. ప్రజా సంక్షేమం దృష్టితో ప్రభుత్వాలు నిబద్ధతతో తలుచుకుంటే ఒక్క నిర్ణయం, ప్రజలందరూ అద్భుతంగా ఆహ్వానించే ఒక మంచిమార్పు సులభంగా సాధ్యమవుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చదివించడం సాహస నిర్ణయం కానేకాదు, ప్రతిష్టకు భంగం కలుగుతుందనుకుంటే తప్పు. మరీ ముఖ్యంగా మన పిల్లల కోణం నుంచి చూసినప్పుడు ఇది ప్రేమ పూర్వక, బాధ్యతతోకూడిన గొప్పమానవీయ శాస్త్రీయ నిర్ణయం. ప్రభుత్వ విద్యారంగ పరిధి విస్తృతమయ్యేకొలది వేలాది ఉద్యోగాల కల్పన జరుగుతుంది. వేలాది రూపాయలు ఫీజుల రూపంలో ఖర్చు చేయనవసరం లేనప్పుడు ప్రజల కొనుగోలు శక్తి మెరుగుపడి తద్వారా వారి డిమాండ్ పలు రకాలుగా వికేంద్రీకరణ చెంది మరింత ఉపాధి సహిత అభివృద్ధి సాధ్యపడుతుంది.

చివరగా.... ఎన్‌సిఇఆర్‌టి, ఎన్‌సిఎఫ్ వంటి చారిత్రక అత్యున్నత విద్యా పరిశోధనా వ్యవస్థల మౌలిక సూత్రాలకు, విలువలకు విరుద్ధంగా బాహాటంగా వ్యాపార ప్రాతిపదికగా, 'స్వయం పోషక స్వతంత్ర పాఠశాలల చట్టం'' వంటి అనేక ప్రమాదాలు దూసుకొస్తున్న సందర్భంలో ప్రభుత్వ పాఠశాలలను నమ్మాల్సిన, కాపాడుకోవాల్సిన ప్రాథమిక, తప్పనిసరిబాధ్యత మన ఉపాధ్యాయులపైన, సమాజంపైన వుందనే వాస్తవాన్ని అర్థం చేసుకోవాలి. మన పిల్లలకు వారి పాఠశాలల నుండి ఎటువంటి బోధనా పరిస్థితులు కోరుకుంటామో అటువంటి బోధన పరిస్థితులను మన విద్యార్థి పిల్లలకు అందిస్తూ మన బాధ్యతలకు పునరంకితం అవుదాం.

ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలను ప్రత్యక్షంగా, పరోక్షంగానైనా సమర్థించడం అంటే, మనం కూర్చున్న కొమ్మను మనమే నరుక్కున్నట్లే, ఆ పర్యవసానాలకు చెల్లించాల్సిన మూల్యం ఏమిటో ఆలోచించాలి. ఇటువంటి విపత్కర విద్యా పరిస్థితుల గురించి నిరంతరం అవగాహన, చైతన్యం కల్పిస్తున్న యుటియఫ్, పిడిఎఫ్ ఎమ్మెల్సీలు, ప్రజా సంస్థలు, విద్యారంగ మేధావులతో చేయికలిపి, గొంతుకలిపి వారి వాదనలకు, ఉద్యమాలకు క్షేత్రస్థాయి నుండి బలమైన నైతిక మద్దతు, ఉద్యమ మద్దతు అందించి మన ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకుందాం.

# ప్రశ్నోత్తరాలు



*నిర్వహణ :* టిఎస్ఎల్ఎన్ మల్లేశ్వరరావు,
ఐక్య ఉపాధ్యాయ సంపాదకవర్గ సభ్యులు
mail : ikyopadhyaya1975@gmail.com

ప్రశ్న : **నేను ఇంటర్‌లో ఎంపిసి, డిగ్రీలో లెక్కలు, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బిఈడిలో లెక్కలు, ఫిజికల్ సైన్స్ మెథడాలజీ అర్హతలు కలిగియున్నాను. నేను స్కూల్ అసిస్టెంట్ (పిఎస్)కు అర్హుడినేనా?**

**-ఎ.వెంకటరావు, పెదగాడవిల్లి, తూ॥గో॥**

**జవాబు :** అర్హులే.

ప్రశ్న : **నేను స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేయుచున్నాను. 12 సం॥ స్కేలు తీసుకొనియున్నాను. హెచ్ఎం ప్రమోషన్ వద్దనుకొంటే 12 సం॥ల స్కేలు రికవరీ చేస్తారా?**

**- సిహెచ్.సత్యనారాయణరాజు, దువ్వ,ప॥గో॥**

**జవాబు:** రికవరీ చేయరు. ఆర్థికశాఖ సర్క్యులర్ మెమో నం.216; తేది.23.03.2007 ప్రకారం మీకు 12 సం॥ల స్కేలు తీసుకొనిన పిదప ప్రమోషన్ వద్దనుకొన్నప్పటికీ అదే స్కేల్‌లో కొనసాగుతారు. తదుపరి స్కేళ్ళు మంజూరు చేయరు.

ప్రశ్న : **నాకు ఉద్యోగం రాకపూర్వమే ఒక పాప ఉంది. నేను ఉద్యోగంలో చేరిన తర్వాత ఒకసారి ప్రసూతిసెలవు వాడుకొనియున్నాను. మరొక పర్యాయం ప్రసూతి సెలవు వాడుకొనవచ్చునా?**

**-కె.సునీత, కర్నూలు**

**జవాబు :** బ్రతికి ఉన్న ఇరువురు పిల్లల వరకు మాత్రమే ప్రసూతి సెలవు మంజూరు చేయబడుతుంది. బిడ్డ జన్మించినది ఉద్యోగం రాకపూర్వమా, వచ్చిన తర్వాత అనే దానితో నిమిత్తం లేదు. కావున మీకు మూడవ బిడ్డకొరకు ప్రసూతి సెలవు మంజూరు చేసే అవకాశం లేదు.

ప్రశ్న : **నేను ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా పని చేయుచున్నాను. ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం పోస్టులో 6 సం॥ల స్కేలు తీసుకున్నాను. బిఏ, బిఇడి అర్హతలు కలిగి వున్నాను. 12 సం॥ల స్కేలు పొందుటకు అర్హుడినేనా తెలుపగలరు? 50 సం॥ల వయస్సు నిండినది.**

**- ఎస్.సత్యనారాయణ, వాకాతిప్ప, తూ॥గో॥**

**జవాబు :** మీకు 12 సం॥లు తీసుకోవాలంటే డిగ్రీ, బిఇడితో పాటు డిపార్ట్‌మెంట్ టెస్ట్‌లు ఉత్తీర్ణత పొంది ఉండాలి. మెమో నం.034408; తేది.04.02.2012 ప్రకారం 50 సం॥లు మినహాయింపు వర్తించదు.

ప్రశ్న : **మా పాఠశాలలో డిఎస్‌సి ద్వారానే సెలక్ట్ అయిన ఒక ఉపాధ్యాయుడు పనిచేయుచున్నారు. అతను మెరిట్-కం -రోస్టర్ లిస్ట్ ప్రకారము అతను సీనియర్ మా ఇరువురిలో ఎవరు హెచ్ఎం బాధ్యతలు నిర్వహించాలి.**

**- రమేష్, నందలూరు, కడప**

**జవాబు :** మెరిట్-కం-రోస్టర్ జాబితాలో ఎవరు ముందువుంటే వారే సీనియర్. సీనియర్ అయిన ఉపాధ్యాయుడే హెచ్ఎం బాధ్యతలు నిర్వహించాలి.

ప్రశ్న : **నేను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేయు చున్నాను. ఎస్ఎస్‌సి అడ్వాన్స్ పరీక్షల నిమిత్తం 06.05. 2017 నుండి 11.06.2017 వరకు వేసవి సెలవులలో పాఠశాలలకు హాజరైతిని. ఎన్ని రోజులు సంపాదిత సెలవు జమచేస్తారు?**

**- టి.కృష్ణమూర్తి, గుంటూరు**

**జవాబు :** మీరు 15 రోజులకన్నా తక్కువగా వేసవి సెలవులు వినియోగించుకొనినందున ఎఫ్ఆర్ 82(డి) ప్రకారం మిమ్మల్ని వేసవి సెలవులు మొత్తం వాడుకొనకుండా నిరోధించినట్లుగా భావించి 24 రోజులు సంపాదిత సెలవు జమచేయాలి.

ప్రశ్న : **నేను రక్తదానం చేస్తే స్పెషల్ క్యాజువల్ లీవు ఎవరు మంజూరు చేస్తారు?**

**- జెవికెఎస్ ప్రసాద్, మాచర్ల, గుంటూరు**

**జవాబు :** జిఓ నం.137; తేది.23.02.1984 ప్రకారం రక్తదానం చేస్తే, చేసిన రోజుకు స్పెషల్ క్యాజువల్ లీవు మంజూరు చేస్తారు. క్యాజువల్ లీవు మంజూరు చేసే అధికారే ఈ సెలవుకూడా మంజూరు చేస్తారు.

ప్రశ్న :
1. **17 సం॥ల సర్వీసుగల ఉపాధ్యాయుడు వైద్య కారణములతో పిఎఫ్ లోను తీసుకొనియున్నారు. 6 నెలలు గడిచింది. గృహ నిర్మాణ నిమిత్తం పార్ట్ ఫైనల్ తీసుకొనుటకు వీలున్నదా? లోను పూర్తిగా చెల్లించిన తరువాతే మంజూరు చేస్తామంటున్నారు. సరియైనదేనా?**
2. **ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో ఒకే డిఎస్‌సికి చెందిన ఉపాధ్యాయులలో ఎవరు ప్రధానోపాధ్యాయుల బాధ్యత చేపట్టాలి. అంతరజిల్లా బదిలీపై (610 కాదు) వస్తే అతని సీనియార్టీ ఎలా పరిగణిస్తారు?**

**- ఒ.ఎస్.ఎన్.మూర్తి, అన్నవరం, తూ॥గో॥**

**జవాబు :**
1. మీ మొత్తాన్ని పార్ట్‌ఫైనల్ క్రింద మార్చుకొని మాత్రమే 6 నెలల తదుపరి పార్ట్‌ఫైనల్ పొందే అవకాశం వున్నది.
2. అంతరజిల్లా బదిలీపై వచ్చిన (610 కాకుండా) ఉపాధ్యాయుల సీనియార్టీ ప్రస్తుత జిల్లాకు వచ్చిన ప్పటినుండి పరిగణనలోనికి తీసుకొనబడుతుంది. ఆ ప్రకారం ఎవరు సీనియర్ అయితే వారు ప్రధా నోపాధ్యాయుని బాధ్యతలు చేపట్టాలి.

## పాఠకులకు గమనిక

ఇ-మెయిల్ **(ikyopadhyaya1975@gmail.com)** లేదా లేఖల ద్వారా ప్రశ్నలు పంపేవారు వారి పేరు, గ్రామం, జిల్లా పేరు, ఫోన్ నంబరు, ఐక్య ఉపాధ్యాయ చందానంబరు తప్పనిసరిగా వ్రాయాలి. ప్రశ్నలు సూటిగా, స్పష్టంగా ఉండాలి. జిఓ / మెమో కాపీలు కావలసిన వారు సంబంధిత జిల్లాలలో యుటియఫ్ కార్యాలయాలను లేదా బాధ్యులను సంప్రదించాలి. పత్రికా కార్యాలయం నుండి జిఓ / మెమో కాపీలు పంపుటకు వీలుకాదు.

# యుటియఫ్ ఆవిర్భావ దినోత్సవాలు

**శ్రీకాకుళం జిల్లా**

**ఘనంగా యుటియఫ్ ఆవిర్భావ దినోత్సవం**



శ్రీకాకుళం యుటియఫ్ జిల్లా కార్యాలయంలో యుటియఫ్ 44వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించబడింది. ముందుగా యుటియఫ్ పతాకాన్ని యుటియఫ్ రాష్ట్రకార్యదర్శి గొంటి గిరిధర్ ఆవిష్కరించారు. గిరిధర్ ప్రసంగిస్తూ అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ లక్ష్యాలుగా అవినీతి అక్రమాలకు వ్యతిరేకంగా ఉపాధ్యాయ సంక్షేమానికి, ప్రభుత్వ విద్యారంగ రక్షణ కోసం యుటియఫ్ అలుపెరగని పోరాటాలు నిర్వహిస్తున్నదని అన్నారు. యుటియఫ్ ఉద్యమాలను బలపరచాలని పిలుపునిచ్చారు.

యుటియఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు సంపలీరావు కిశోర్ కుమార్ ప్రసంగిస్తూ మహాసభల సంవత్సరం కావున స్కూలు కాంప్లెక్స్, హైస్కూల్, మండల, పట్టణ, జిల్లా స్థాయిలో మహాసభలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. శ్రీకాకుళం జిల్లాలో డిసెంబర్‌లో జరుగనున్న రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో యుటియఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి చౌదరి రవీంద్ర, జిల్లా కార్యదర్శి కె.వి.శ్రీరామమూర్తి, వివిధ మండల శాఖల నాయకులు మొదలవలస లక్ష్మణరావు, బి.క్రాంతికుమార్, రవికుమార్, జి.రాజేశ్వరరావు, కె.పెద్దిరాజు, అన్నపు మాధవరావు, బి.వెంకటరావు తదితరులు ప్రసంగించారు.

**లావేరు :**



యుటియఫ్ 44వ ఆవిర్భావ దినోత్సవం లావేరు మండలం అదపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగింది. యుటియఫ్ పతాకాన్ని ప్రధానోపాధ్యాయులు వి.సత్యనారాయణ ఆవిష్కరించారు. యుటియఫ్ నాయకులు పి.లక్ష్మణరావు నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో యుటియఫ్ రాష్ట్రకార్యదర్శి గొంటి గిరిధర్ ప్రసంగిస్తూ ఉపాధ్యాయ సంక్షేమానికి, ప్రభుత్వ విద్యారంగ రక్షణ కోసం నిరంతరం కృషి చేస్తున్నదని అన్నారు. యుటియఫ్ జిల్లా కార్యదర్శి యండ ఉమాశంకర్ ప్రసంగిస్తూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంకోసం జరిగే ఉద్యమాలలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. హెచ్ఎం వి.సత్యనారాయణ ప్రసంగిస్తూ ప్రాథమిక స్థాయిలో మాతృ భాషలోనే బోధన వుండాలన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణమూర్తి, ఉన్నత పాఠశాల స్టాఫ్ సెక్రటరీ కె.ముకుంద, ఉపాధ్యాయులు ఎన్.కృష్ణారావు, ఉదయ్‌కుమార్, గుణ లక్ష్మి, నాగరాజు, ఎ.వాసు, రంగనాథ్, రాజేశ్వరి, యుటియఫ్ నాయకులు జనార్ధనరావు, లక్ష్మణరావు, లక్ష్మీరాణి, స్వరాజ్యలక్ష్మి, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

**విజయనగరం జిల్లా**

**ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకుంటాం**




ఆగస్టు 10న యుటియఫ్ ఆవిర్భావ దినోత్సవాల సందర్భంగా విజయనగరం, బొబ్బిలి, గజపతినగరం, జామి, ఎస్.కోట, కొత్తవలస, రామభద్రపురం, చీపురుపల్లి, గరివిడి, తెర్లాం, బాడంగి, సాలూరులలో యుటియఫ్ పతాకాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర, జిల్లా నాయకులు పతాకావిష్కరణనుద్దేశించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని, సెల్ఫ్ ఫైనాన్స్ ఇండిపెండెంటు స్కూల్ యాక్ట్-2017ను రద్దు చేయాలని, డిటెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని, పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్‌ను విద్యారంగంలో అమలు చేయరాదని, ప్రభుత్వ విద్యను కార్పొరేట్ సంస్థలకు అప్పగించరాదని, ప్రభుత్వమే విద్యపట్ల బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ప్రజల విద్యను కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.విజయగౌరి, డి.రాము, ఎ.శివవర్మ, కె.శేషగిరి, కె.శ్రీనివాస్, ఎస్.మురళి, జి.నిర్మల, రమేష్ పట్నాయక్, ఎ.శివవర్మ, ఆఫీస్ బేరర్లు, మండల నాయకులు పాల్గొన్నారు.

**తూర్పుగోదావరి జిల్లా**

**రాజోలు :**



యుటియఫ్ తూర్పుగోదావరి జిల్లా రాజోలు మండల శాఖ సంఘ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీనియర్

నాయకులు మోటూరి సుబ్బారావు యుటియఫ్ పతాకాన్ని ఎగురవేసి, యుటియఫ్ ఆవిర్భవించిన సందర్భాన్ని, ఆనాటి నుండి నేటి వరకు నాయకులు చేసిన త్యాగాలను వివరించారు. యుటియఫ్ ప్రస్థానాన్ని వక్తలు కొనియాడారు. అనంతరం మండలంలోని 9 ఉన్నత పాఠశాలలు మరియు అన్ని ప్రాథమిక పాఠశాలలకు వెళ్ళి ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులను కలసి మిఠాయిలు పంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల గౌరవాధ్యక్షులు చింతా దుర్గా ప్రసాద్, మండల అధ్యక్షులు ఉండవల్లి శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షులు గటిగంటి శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి కదలి రామ్‌కుమార్, సీనియర్ నాయకులు జిఎస్‌విఎస్ మూర్తి, బిళ్ళ రాచయ్య, మట్టపర్తి నరసింహా రావు, అడబాల కాశీ విశ్వేశ్వరరావు, ఎస్ఎస్ఎన్. ఆచార్యులు, జి.వి. భాస్కరరావు, రేకపల్లి నాగబాబు, గుబ్బల శ్రీనివాస్, కెవివి సత్య నారాయణ, అప్పారి దుర్గాప్రసాద్, అమలదాసు సత్తిబాబు, కెవిఎస్ఎన్ బాబు, మల్లాడి శ్రీనివాసరావు, రాజబాబు, రేవు శ్రీనివాసరావు, వైవిఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**కాజులూరు :**

తూర్పుగోదావరి జిల్లా కాజులూరు మండల శాఖ యుటియఫ్ 44వ ఆవిర్భావ దినోత్సవం యుటియఫ్ హోమ్, కాకినాడనందు ఆగస్టు 10న ఘనంగా నిర్వహించారు. మండలశాఖ అధ్యక్షులు గణపతి అధ్యక్షత వహించారు. రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ కె.సత్తిరాజు, జిల్లా యుటియఫ్ గౌరవాధ్యక్షులు ప్రభాకరవర్మ, జిల్లా ఐక్యఉపాధ్యాయ పత్రిక కన్వీనర్ ఐ.ప్రసాదరావు, జిల్లా కార్యదర్శి ఎస్ఎస్‌వి చలపతి పాల్గొని ప్రసంగించారు. సత్తిరాజు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా రంగాన్ని ధ్వంసం చేసే "స్వయంపోషక స్వతంత్ర పాఠశాలల చట్టం - 2017ని నిలువరించాలని తెలిపారు.

ప్రభాకరవర్మ మాట్లాడుతూ సమస్యల పోరాటానికి అందరూ ఉద్యమాలలో పాల్గొనాలని, ఐక్యఉద్యమాల అవసరం ఎంతో ఉందని తెలిపారు.



ఐ.ప్రసాదరావు మాట్లాడుతూ చారిత్రక అవసరంగా మన యుటియఫ్ ఏర్పడిందని, అన్ని కేడర్లు, అన్ని మేనేజిమెంట్లు సమస్యల పరిష్కార దిశగా యుటియఫ్ ప్రయాణం కొనసాగిస్తున్నదని తెలిపారు. మన ఉద్యమ కరదీపిక ఐక్యఉపాధ్యాయను అందరూ చదవాలని, చందాదారులుగా చేరాలని పిలుపునిచ్చారు. చలపతి మాట్లాడుతూ పోరాటాలే సమస్యలకు పరిష్కారం అని తెలిపారు. ఇటీవలి కాజులూరు మండలం నుండి ఇతర మండలాలకు బదిలీపై వెళ్ళిన సుమారు 80మంది ఉపాధ్యాయులను యుటియఫ్ మెమోంటోలతో సత్కరించి, వారు మండల శాఖకు ఇచ్చిన సహకారానికి ధన్యవాదాలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో మండల గౌరవాధ్యక్షులు ఐ.వి.వి.సత్య నారాయణ, ప్రధానకార్యదర్శి సిహెచ్.శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పశ్చిమగోదావరి జిల్లా

### ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి

**ఏలూరు :** ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యుటియఫ్ నిరంతరం కృషి కొనసాగిస్తుందని యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి షేక్ సాబ్జీ చెప్పారు. యుటియఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని సంఘ జిల్లా కార్యాలయంలో ఆగస్టు 10న నిర్వహించారు. ముందుగా యుటియఫ్ పతాకాన్ని సాబ్జీ ఆవిష్కరించారు.



అనంతరం మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సంబంధించిన అనేక సమస్యల పరిష్కారం కోసం యుటియఫ్ పోరాటాలు సాగించిందన్నారు. ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. 1974 ఆగస్టు 10న యుటియఫ్ ఆవిర్భవించిందని చెప్పారు. 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించు కోవడం సంతోషదాయకమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా యుటియఫ్ సభ్యులు లక్షకుపైగా ఉన్నారని, శాసన మండలిలో నలుగురు ఎమ్మెల్సీలు ఉన్నారని చెప్పారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసమే కాకుండా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పింఛనర్ల సమస్యల పరిష్కారానికి కూడా ఐకాస ఆధ్వర్యంలో పోరాటాలు సాగిస్తోందన్నారు. కార్యక్రమంలో యుటియఫ్ జిల్లా అధ్యక్షులు పి. జయకర్, జిల్లా అసోసియేట్ అధ్యక్షురాలు బి.సుభాషిణి, జిల్లా కార్యదర్శులు వీబీవీ ఎస్. సుబ్రహ్మణ్యం, ఆర్.రవికుమార్, ఈడే శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

**తణుకు :**




యుటియఫ్ ఆవిర్భావ దినోత్సవం స్థానిక మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల వేల్పూరునందు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి ఎస్.జయప్రభ జెండావిష్కరించి ముఖ్య సందేశం ఇచ్చారు. ఈనాటి ప్రభుత్వాలు సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ విధానం ద్వారా ప్రభుత్వ విద్యను బలహీనపరచి కార్పొరేట్ పాఠశాలలకు మార్గం చూపుతున్నారని దీనివలన బడుగు బలహీన వర్గాల వారికి తీవ్ర అన్యాయం జరుగుతుందని దీనిని తీవ్రంగా వ్యతిరేకించాలని పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్‌పిసిఎం సభ్యుడు మాట్లాడుతూ ప్రతి యుటియఫ్ కార్యకర్త కష్టపడి పనిచేసి ప్రభుత్వ విద్యావ్యవస్థను బలోపేతం చేయాలని తెలిపారు. మరియు జాషువా జయకుమార్ భవిష్యత్ తరాలవారికి మార్గం వేయాలని పిలుపునిచ్చారు.

కమిటీ అధ్యక్షులు బి.రవిప్రసాద్, సహాధ్యక్షురాలు కె.మాధవి, కార్యదర్శులు కె.వరలక్ష్మి, ఎం.దేవత్తం, వి.నిర్మల, బి.శ్రీనువాసరావు, పెనుమంట్ర అధ్యక్షులు శ్రీమా|రెడ్డి, అత్తిలి మాజీ అధ్యక్షులు రాజు, బ్రహ్మానందం, పారు లింగేశ్వరరావు, నాగేశ్వరరావు, ఆర్.కృష్ణమోహన్, కె.వెంకటేశ్వరరావు, బేబి, సునీత, సుశీల, రత్నకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్ధిని విద్యార్ధులనకు మిఠాయిలు పంపిణి చేశారు.

**జంగారెడ్డిగూడెం :**



ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటియఫ్) 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జంగారెడ్డిగూడెంలోని యుటియఫ్ భవనం వద్ద సంఘ పతాకాన్ని జిల్లా కార్యదర్శి ఎంవీ శ్యాంబాబు ఆగస్టు 10న ఆవిష్కరించారు. యుటియఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఆర్.లక్ష్మి మాట్లాడుతూ ఉపాధ్యాయులందరూ హక్కుల కోసం పోరాడుతూ మరింత బాధ్యతతో పనిచేయాలని కోరారు. జంగారెడ్డిగూడెం మండల ప్రధానకార్యదర్శి ఆర్డి ప్రసాద్ మాట్లాడుతూ ప్రతీ ఉపాధ్యాయుడు అధ్యయనం, అధ్యాపనం, సామాజికస్పృహ కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జీలుగుమిల్లి యుటియఫ్ ప్రధాన కార్యదర్శి అల్లాడి రాజు, జంగారెడ్డిగూడెం మండల యుటియఫ్ అధ్యక్షులు ఎం.మురళీమోహన్, ఐవీఎస్ఆర్కే ప్రసాద్, ఎం.ఏసు రత్నం, బి.శేషగిరిరావు, సిహెచ్.బాబూరావు, ఎస్కె షరీఫ్, టి.రామయ్య తదితరులు పాల్గొన్నారు.

**ద్వారకా తిరుమల :**



ద్వారాకతిరుమల స్థానిక యుటియఫ్ భవనం వద్ద సమాఖ్య 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆగస్టు 10న ఘనంగా నిర్వహించారు. సీనియర్ నాయకులు పి.వెంకట్రావు పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. మండల అధ్యక్షులు దేవానందరావు మాట్లాడుతూ హక్కులు, బాధ్యతలు సమానంగా స్వీకరించాలని అన్నారు. అధ్యయనంతో పాటు సామాజిక స్పృహ కలిగి ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి సిహెచ్.జగన్మోహనరావు, ఉపాధ్యాయులు ముత్యాలరావు, నాగయ్య, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

**నల్లజర్లలో :**

నిరంతరం ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు పాటుపడుతూ ఉపాధ్యాయుల హక్కుల కోసం విశేషంగా కృషి చేస్తున్న సంస్థ ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య మాత్రమేనని ఆ సమాఖ్య నల్లజర్ల శాఖాధ్యక్షులు ఐ.వి.సత్యం అన్నారు. యుటియఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆగస్టు 10న నిర్వహించారు.



శాఖ గౌరవాధ్యక్షులు పత్తిపాటి గంగాధరరావు యుటియఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. సత్యం మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సంబంధించిన వివిధ సమస్యలైన రీగ్రూప్ స్కేల్సు సాధించటంలోనూ, అప్రెంటీస్‌షిప్ రద్దు చేయించటంలోనూ, జీతాల పెంపు సాధనలోనూ తమ సమాఖ్య క్రియాశీలక పాత్ర పోషించిందన్నారు. ప్రధానకార్యదర్శి మనోహర్ కుమార్, కోశాధికారి బండి కిషోర్, కార్యదర్శులు నాగలక్ష్మి, శనగన సత్యనారాయణ, ఆడిటర్ శనగన రాంబాబు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**కృష్ణా జిల్లా**

**నాగాయలంక :**



ఉపాధ్యాయుల సంక్షేమానికి, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు యుటియఫ్ చేస్తున్న కృషి మరువలేనిది అని జిల్లా కార్యదర్శి బిజి గోపాలకృష్ణ పేర్కొన్నారు. యుటియఫ్ 44వ ఆవిర్భావ దినోత్సవ సంబరాలు స్థానిక యుటియఫ్ కార్యాలయంనందు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మండలశాఖ గౌరవాధ్యక్షులు డిఎస్ఎస్ భట్టార్ జెండాను ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ పోరాటాల ద్వారా మాత్రమే సమస్యలు పరిష్కారమవుతాయనీ, దీనికొరకు అందరు ఉపాధ్యాయులు కలిసి కట్టుగా కదలి రావాలనీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బి.సాయిశివరావు, డి.నవజీవన్‌లతోపాటు యం.వెంకటేశ్వరరావు, వి.రాధాకృష్ణ, ఎస్.సురేష్‌బాబు, డి.నిరీక్షణ రావు, వనమా రామకృష్ణ, ఆర్.భాస్కరరావులతోపాటు 25మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**రెడ్డిగూడెం :**

రెడ్డిగూడెంలోని సుందరయ్యభవన్‌నందు యుటియఫ్ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. యుటియఫ్ జిల్లా కార్యదర్శి డి.శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై యుటియఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కార్యకర్తలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ సామాజిక స్పృహతో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరతరం పోరాడే సంఘం యుటియఫ్ అని అన్నారు. అధ్యయనం,

అధ్యాపనం, సామాజిక స్పృహ ఆశయాలుగా యుటియఫ్ సంఘం పనిచేస్తుందన్నారు.



ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి, విద్య ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడేందుకు కార్యకర్తలు ముందుండాలని పిలుపునిచ్చారు. పెద్దల ఆశయాలకనుగుణంగా కార్యకర్తలు నడుచు కుంటూ యుటియఫ్‌ను మరింత బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో రెడ్డిగూడెం మండల శాఖ అధ్యక్షులు డి.లక్ష్మీపతి, ప్రధానకార్యదర్శి బిసిహెచ్‌వి సూర్యనారాయణ, సహాధ్యక్షులు కె. రవిబాబు, జిల్లా మహాసభల ప్రతినిధి ఎం.తిరుపతిరావు, కోశాధికారి ఇ.నాగేశ్వరరావు, కార్యదర్శులు సిహెచ్.లక్ష్మయ్య, జి.రవినాథ్ తదితరులు పాల్గొన్నారు.

**కలిదిండి:**



స్థానిక యుటియఫ్ కార్యాలయంలో యుటియఫ్ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా చెన్నుపాటి లక్ష్మయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యమాలు, విజయాలపై పలువురు ఉపాధ్యాయులు మాట్లాడారు. ఉపాధ్యాయుల సంక్షేమం కొరకు యుటియఫ్ నిరంతరం కృషి చేస్తున్నదని, అవినీతి అధికారులకు సింహస్వప్నం యుటియఫ్ అని మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు వై.వెంకటేశ్వరరావు, నున్న ఆంజనేయులు అన్నారు. బదిలీపై వెళ్లిన సిహెచ్ రాఘవయ్య, దామోదర్, గంగాధర్, సింహాచలం, మాధవరావు, మురళీ ప్రసాద రావులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యుటియఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పివి సాగర్ రావు, ఉపాధ్యక్షురాలు ప్రసన్న కుమారి, కోశాధికారి బోగేశ్వరరావు, రాజమోహన్, శ్రీనివాస, రామకృష్ణ, సురేష్ సుబ్బారావు, రామాంజనేయులు, నాగరాజు, నరేంద్ర, మధు, యుటియఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గుంటూరు జిల్లా

### ఉద్యమ స్ఫూర్తితో పనిచేయాలి

యుటియఫ్ 44వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు యుటియఫ్ కార్యాలయంలో నిర్వహించుట జరిగింది. యుటియఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన యుటియఫ్ పతాకాన్ని జిల్లా గౌరవాధ్యక్షులు ఎండి గౌస్ ఆవిష్కరించారు. ముందుగా ఉపాధ్యాయ, ఉద్యమ నిర్మాత, అమరజీవి చెన్నుపాటి లక్ష్మయ్య కాంస్యవిగ్రహానికి మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారానికి ఉద్యమాలే శరణ్యమని, ఉద్యమ స్ఫూర్తితో పనిచేసి విద్యారంగాభివృద్ధి ప్రతిఒక్కరు కృషి చేయాలని తెలిపారు. విద్యారంగానికి యుటియఫ్ చేస్తున్న కృషిని ఆయన అభినందించారు.

జిల్లా అధ్యక్షులు కె.నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ సీనియర్ నాయకుల త్యాగాల ఫలితంగానే ఈనాడు ఉపాధాయులు మెరుగైన జీతాలు పొందుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.హనుమంతరావు, రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎన్.తాండవ కృష్ణ, రాష్ట్ర విద్యావికాస వేదిక కన్వీనర్ జి.ప్రభుదాసు, జిల్లా సహాధ్యక్షురాలు బి.ఆదిలక్ష్మి, జిల్లా కోశాధికారి పి.ప్రేమ్‌కుమార్, జిల్లా కార్యదర్శులు ఎం.కళాధర్, ఎన్.వి.జగదీష్‌కుమార్ మరియు జి. వెంకటేశ్వర్లు, చెన్నకేశవరావు, ప్రభాజీ, రవి తదితరులు పాల్గొన్నారు.

**సత్తెనపల్లి :**

యుటియఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక యుటియఫ్ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి సిహెచ్.ఆదినారాయణ మాట్లాడుతూ 1974 ఆగస్టు 10న యుటియఫ్ ఆవిర్భావం మొదలుకొని నేటివరకు అనేక ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించటంలో ముందు వరుసలో వుందని నిరంతరం యుటియఫ్ పోరాటం ఫలితంగానే నేటి ఉపాధ్యాయులు ఎన్నో సౌకర్యాలు పొందగలిగారని, అలనాటి యుటియఫ్ నాయకుల జీవితాలు ఈ తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. యుటియఫ్ సీనియర్ నాయకులు కె.పోతులూరయ్య మాట్లాడుతూ యుటియఫ్‌కు ఎంతో ఘనమైన చరిత్రవుందని, ఉమ్మడి సర్వీసురూల్సు, నోషనల్ ఇంక్రిమెంట్స్, అప్రెంటీస్ రద్దు తదితర ఎన్నో సమస్యల పరిష్కారంలో యుటియఫ్ కృషి ఎనలేనిదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డి.థామసయ్య, జి.బాలశౌరిరెడ్డి, కె.నరసింహ, బైరాగి మాష్టారు, కె.ఆనందరావు, ఎం.బురాన్, ఎస్.విజయరాజు, పి.సుబ్బారావు, ఎం.రాజకిషోర్ తదితర ఉపాధ్యాయ నాయకులు పాల్గొన్నారు.

**మాచర్ల :**




స్థానిక పెన్షనర్స్ హోమ్‌లో యుటియఫ్ 44వ అవతరణ దినోత్సవం యుటియఫ్ మాచర్ల శాఖ అధ్యక్షులు ఎ.నాసర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. యుటియఫ్ సీనియర్ నాయకులు దానం శివ ప్రసాదరావు మాట్లాడుతూ విద్యారంగాన్ని సమైక్యపరిచి అన్ని ప్రాంతాల అన్ని మేనేజ్‌మెంట్ల, అన్ని కేడర్ల సమైక్య సంఘంగా చారిత్రక అవసరంగా 1974 ఆగస్టు 10న ఏర్పడిందని అన్నారు.

యుటియఫ్ జిల్లా కార్యదర్శి షేక్ గాలిబ్‌సాహెబ్ మాట్లాడుతూ రిగ్రూపింగ్ స్కేళ్లు, పే స్కేళ్లు పెంపుదలకు, ఎయిడెడ్ టీచర్ల డైరెక్ట్ పేమెంట్ నుండి 60 సం॥లకు రిటైర్మెంట్ వరకు, మున్సిపల్ టీచర్లకు 010 జీతాలు, అప్రెంటీస్ రద్దు కొరకు అలుపెరగని పోరాటం చేసిందనీ, నవ్యాంధ్రలో అగ్రగామి సంస్థగా నిలిచిందని అన్నారు.

యుటియఫ్ రాష్ట్ర కౌన్సిలర్ పి.పట్టాభిరామారావు మాట్లాడుతూ

డిటెన్షన్ విధానాన్ని రద్దుచేయాలనీ, పిఆర్‌సి బకాయిలు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు టి.గోవిందరెడ్డి, మాచర్ల, దుర్గి, వెల్దుర్తి అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు డి.ఏడుకొండలు, విజె ఫ్రాంక్లిన్, ఎస్‌విఎస్ నాగరాజు, కెవి నాగార్జున రాజు, జెవికెఎస్ ప్రసాదు, నాగేష్ నాయక్, బి.రమేష్ నాయుడు, పల్లా రామారావు, కె.కేశరెడ్డి, పట్టెం బాబూరావు, బి.భాస్కరరావు, చౌక్లా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**తెనాలి :**

తెనాలి పట్టణశాఖ ఆధ్వర్యంలో యుటియఫ్ అవతరణ కార్యక్రమం జరిగింది. సీనియర్ నాయకులు వైఎల్ నారాయణ పతాకావిష్కరణ చేశారు. ఉపాధ్యాయుల సంక్షేమం, విద్యారంగ వికాసమే లక్ష్యంగా యుటియఫ్ ఏర్పడినట్లు కేడర్లు, ప్రాంతాలు, మేనేజ్‌మెంట్ అంతరాలు లేకుండా ఉపాధ్యాయులు అందరి సంక్షేమం కొరకు యుటియఫ్ ఆవిర్భవించిందన్నారు. గత 45 సం॥లుగా అవినీతికి వ్యతిరేకంగా, ఉపాధ్యాయ సంక్షేమానికి, విద్యారంగ వికాసానికి, సమాజాభివృద్ధికి రాజీలేని కృషి చేసినందువల్లనే యుటియఫ్ పెద్ద సంఘంగా ఎదిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణశాఖ అధ్యక్షులు ఎస్.బసవేశ్వరరావు, గౌరవాధ్యక్షులు అహ్మద్‌హుస్సేన్, సహాధ్యక్షులు కె.వెంకటరమణ, ఎల్.గంగరాజు, కోటి సుందరరావు, జి.వెంకటేశ్వర్లు, సిహెచ్.సుందరరావు, కె.ప్రసాద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఉద్యమాలలోనే సమస్యల పరిష్కారం



**తుళ్ళూరు :** తుళ్ళూరు మండల శాఖ ఆధ్వర్యంలో 43వ యుటియఫ్ ఆవిర్భావ దినోత్సవం స్థానిక బాపూజీ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ముందుగా మండల సీనియర్ నాయకురాలు ఎ.కరుణ కుమారి యుటియఫ్ పతాకాన్ని ఎగురవేశారు. మండల అధ్యక్షులు అడవి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ కె.రవిచంద్రశేఖర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ఉద్యమ పోరాటాలే శరణ్యమని తెలిపారు. ఉద్యమాలు నిర్మించిన మన నాయకులు అనేక రాయితీలు సాధించారన్నారు. వారి త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని నేటితరం ఉద్యమాలవైపు పయనించాలని పిలుపు నిచ్చారు. వాట్సాప్, ఫేస్‌బుక్‌లు ప్రచారాలకు పనికి వస్తాయేకానీ సమస్యల సాధనకు ప్రత్యక్షంగా వ్యక్తులు ఉద్యమాలలో పాల్గొనాలన్నారు. వెబ్‌కౌన్సిలింగ్ రద్దు దానికి ఉదాహరణగా వివరించారు. కార్యక్రమం లో ఐ.మోహర్‌బాబా, శిరామకృష్ణ, దాసు, జగదీష్, రాజు, లకుమా దేవి మరియు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ప్రకాశం జిల్లా**

**చీరాల :**

యుటియఫ్ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆగస్టు 10న స్థానిక ఎన్‌జిఓ హోంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి గవిని నాగేశ్వరరావు మాట్లాడుతూ అధ్యయనం, అధ్యాపనం, సామాజికస్పృహ ఆశయాలతో 1974లో ఆవిర్భవించిన యుటియఫ్ 43 సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో యుటియఫ్ ముందంజలో ఉందన్నారు. ఉపాధ్యాయులు పోరాట పటిమతో ముందుకు వెళ్ళాలన్నారు. ఎమ్మెల్సీలను గెలిపించుకుని తమ వాణిని శాసనమండలిలో వినిపించే విధంగా కృషి చేసిన ఘనమైన సంఘం యుటియఫ్ అని రాష్ట్ర కౌన్సిలర్ కె.వీరాంజనేయులు అన్నారు. పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వంతో చర్చించే స్థాయిలో పోరాటానికి వెనకాడని నిజాయితీ కలిగిన నాయకులు ఉండటం సంతోషకర మన్నారు.



ముందుగా యుటియఫ్ కార్యాలయంలో యుటియఫ్ జెండాను ఆవిష్కరించి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యుటియఫ్ చీరాల పట్టణశాఖ ప్రధాన కార్యదర్శి షేక్ జానీబాషా, కుర్రా శ్రీనివాసరావు, కుర్రా రామారావు, పిచ్చయ్య, శ్రీరాం శ్రీను, సుభాని, సూరిబాబు, శ్రీమన్నారాయణ, భాస్కర్, విజయవర్ధనరాజు, వేటపాలెం మండలాల ప్రతినిధులు పాల్గొన్నారు.

### సమస్యల కోసం పోరాడే సంఘం యుటియఫ్



**కనిగిరి :** నిరంతరం ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం పోరాడే సంఘం యుటియఫ్ అని ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఎన్. రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. యుటియఫ్ ప్రాంతీయ కార్యాలయంలో యుటియఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆగస్టు 10న జరిగింది. రామచంద్రారెడ్డి మాట్లాడుతూ యుటియఫ్ పక్షాన ఎన్నో ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించుకోగలిగామన్నారు. తొలుత యుటియఫ్ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఎ. రామిరెడ్డి, కృష్ణమూర్తి, ఖాజారహంతుల్లా, నారాయణరెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, వెంకటరెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

**చిత్తూరు జిల్లా**

### ఘనంగా యుటియఫ్ ఆవిర్భావ దినోత్సవం



యుటియఫ్ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని చిత్తూరులో ఘనంగా నిర్వహించారు. అశోకపురంలోని సంఘం కార్యాలయ ఆవరణలో యుటియఫ్ జిల్లా అధ్యక్షులు ఎన్.సోమశేఖరనాయుడు పతాకాన్ని ఆవిష్కరించి, జోహార్ యుటియఫ్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం యుటియఫ్ చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. ప్రభుత్వ బడులను పరిరక్షించుకునేందుకు ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజా సంఘాలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో సమాఖ్య నాయకులు శేఖర్, కృష్ణమూర్తి రెడ్డి, నాగరాజు, ఆంజనేయులు వెంకట్రమణ, కుప్పస్వామినాయుడు, రెడ్డెప్ప, మోహన్ తదితరులు పాల్గొన్నారు.


**ఘనంగా యుటియఫ్ వ్యవస్థాపక దినోత్సవం**




**పలమనేరు :** యుటియఫ్ 44వ ఆవిర్భావదినోత్సవాన్ని పలమనేరు డివిజన్ శాఖ ఘనంగా నిర్వహించింది. స్థానిక యుటియఫ్ కార్యాలయం వద్ద మాజీ రాష్ట్రకార్యదర్శి ఎన్.సోమచంద్రారెడ్డి పతాకా విష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగంలో అనేక మార్పులు తెస్తున్నదని ఇవి విద్యారంగానికి ప్రమాదంగా పరిణమిస్తున్నవని దీనిని ఎదుర్కోవడానికి అన్ని వర్గాలు సంఘటితం కావాలన్నారు. మున్సిపల్ పాఠశాలల్లో తెలుగు మీడియం రద్దు చేయడం, ప్రైవేటు విశ్వ విద్యాలయాల బిల్లు తీసుకురావడం ఇందులో భాగమేనన్నారు. దీనివల్ల పేద, బలహీన వర్గాల పిల్లలు చదువుకు దూరమవుతారన్నారు. ప్రభుత్వ విద్యా రంగాన్ని పరిరక్షించ డానికి యుటియఫ్ కార్యకర్తలు పునరంకితం కావాలన్నారు.

జిల్లా కార్యదర్శులు ప్రకాష్, సుధాకర్ రెడ్డి, జి.వి.రమణ, గురుమూర్తి శెట్టి మాట్లాడుతూ అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ అనే సూత్రాలు కలిగి హక్కులు - బాధ్యతలు రెండు నేత్రాల ఆశయాలుగా ఉన్న సంఘ కార్యకర్తలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం పెంచడానికి, నాణ్యమైన విద్య అందించడానికి కృషి చేయాలన్నారు. హక్కులకైతే ఏ విధంగా పోరాడుతామో బాధ్యతలు కూడా అదే విధంగా నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణమూర్తి, హేమచంద్రారెడ్డి, విజయకుమార్, దయానంద, ప్రసన్న కుమార్, ఆంజప్ప, నాగభూషణం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**యాదమరి :**



యాదమరి మండల కేంద్రంలో యుటియఫ్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యుటియఫ్ జిల్లా కార్యదర్శి కనకాచారి మాట్లాడుతూ ప్రతికార్యకర్త సైనికుల్లా, దాచూరి రామిరెడ్డి, అప్పారి వెంకటస్వామి, చెన్నుపాటి అడుగుజాడల్లో నడవాలి అని అన్నారు. ప్రతి యుటియఫ్ కార్యకర్త అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ కలిగి, ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం పోరాడాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షులు శివప్రసాద్, ఉపాధ్యక్షులు హిమబిందు, శేఖర్, నాయకులు మూర్తి ధనంజయరాజు, సురేష్, షణ్మగం, ప్రభాకర్, గోవిందస్వామి, విజయ ప్రభ, వై.ఆర్.కృష్ణ, తులసిప్రసాద్, వాణి, చాముండేశ్వరి, వేణుగోపాల్, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

**కర్నూలు జిల్లా**

**ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారవేదిక యుటియఫ్**

**ఎమ్మిగనూరు :** ఉపాధ్యాయ, ప్రభుత్వ విద్యారంగ సమస్యల పరిష్కారంలో ముందువుండే సంఘం యుటియఫ్ అని సీనియర్ నాయకులు భాస్కర్‌బాబు అన్నారు. యుటియఫ్ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రాంతీయ కార్యాలయంలో యుటియఫ్ పతాకాన్ని భాస్కర్‌బాబు ఎగురవేశారు. అనంతరం జరిగిన సమావేశంలో నాయకులు జె.యల్లప్ప, ఎన్.నాగమణి, ఎ.భాస్కర్ మాట్లాడారు. ఉపాధ్యాయ ఉద్యమ పితామహుడు, అమరజీవి చెన్నపాటి లక్ష్మయ్య ఆశయాల వారసత్వంగా 1974 ఆగస్టు 10న యుటియఫ్ ఆవిర్భవించిందన్నారు. ఆ రోజుకు ఉన్న ఉపాధ్యాయ ఉద్యమంలో ఐక్యంచేసి క్యాడర్ల వారీగా, మేనేజ్‌మెంట్లవారీగా చీలివున్న ఉపాధ్యాయులను రాష్ట్రవ్యాప్తంగా పనిచేసే సంఘంగా యుటియఫ్ ఆవిర్భవించిందన్నారు.

ఈ రోజు ఉపాధ్యాయులు అనుభవిస్తున్న అన్ని సౌకర్యాలు అప్రెంటీస్ రద్దు, ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీం, బదిలీలలో కౌన్సిలింగ్ విధానం, రీగ్రూపింగ్ స్కేళ్ళు, నోషనల్ ఇంక్రిమెంట్లు, మెరుగైన పిఆర్‌సి సాధించడం, సిపిఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు డెత్-కం-గ్రాట్యుటీ, మహిళా ఉపాధ్యాయులకు శిశు సంరక్షణ సెలవులు, ఏకీకృత సర్వీస్‌రూల్స్ సాధించడం, రేషనలైజేషన్ పేరుతో ప్రభుత్వ పాఠశాలల మూసివేతను అడ్డుకోవడం వంటి సమస్యలపై యుటియఫ్ స్వతంత్రంగా ఐక్యఉద్యమాలలో ముందుండి సాధించినవే అని అన్నారు.

సిపిఎస్ ఉపాధ్యాయులకు పాత పెన్షన్‌ను అమలు చేయడం, స్వయంప్రతిపత్తిగల పాఠశాలల ఏర్పాటు యాక్టు-2017ను రద్దు చేయడం వంటి సమస్యలపై ఉద్యమాలు చేయవలసిన ఆవశ్యకత వుందన్నారు. కోల్పోతున్న హక్కులను నిలబెట్టుకుంటూ భావితరాల సమస్యల సాధనకోసం పోరాటాలు చేయవలసిన అవసరం వుందని యుటియఫ్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏ.నాగేశ్వరరావు, బి.రాఘవేంద్ర, దేవపాలు, హనీఫ్, వెంకటేష్, ఈరన్న మల్లికార్జున, పరమేష్, పాపయ్య, రాజు, రవికుమార్, యువ రాజు, వేణుగోపాలు, అశోక్, నాగరాజు, ప్రకాష్, శేఖర్, పెద్దారెడ్డి, కౌలన్న, లక్ష్మన్న, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

**ఆలూరు రూరల్ :**

యుటియఫ్ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆలూరులో ఆగస్టు 10న ఘనంగా నిర్వహించారు. యుటియఫ్ సీనియర్ నాయకులు ఏఎస్ అబ్దుల్ సలాం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుటియఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు సీతారాములు, ఖాసీం మాట్లాడుతూ విద్యారంగ అభివృద్ధికి, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం

పాఠశాలల్లో మౌలిక వసతుల కోసం నిరంతరం పోరాడుతూ తోటి ఉపాధ్యాయులతో అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై పోరాడి వాటి సాధనకోసం నిరంతరం పోరాటాలు చేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో నాయకులు శేషారావు, ఏఎం సుధాశేఖర్, బసవరాజు, మంగయ్య, పార్ధసారధి, ఆజాద్, చంద్రశేఖర్‌నాయుడు, సురేష్, బిజి సురేష్‌బాబు, పాండురంగారెడ్డి, కేశవ్, శ్రీనివాసులు, గిడ్డయ్య, రంగనాథ్, ఉమాకాంత్ పాల్గొన్నారు.

**కోసిగి :**



కోసిగిలో యుటియఫ్ మండలశాఖ యుటియఫ్ ఆవిర్భావ వేడుకలు ఆగస్టు 10న ఘనంగా నిర్వహించారు. స్థానిక సిఐటియు కార్యాలయ ఆవరణలో సీనియర్ నాయకులు తిక్కయ్య యుటియఫ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన సందేశమిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సిఐటియు మంత్రాలయం డివిజన్ కార్యదర్శి రాముడు మాట్లాడుతూ యుటియఫ్ కార్యకర్తలు సామాజికస్పృహతో పనిచేసి సమసమాజ స్థాపనకు కృషి చేయాలన్నారు. అనంతరం యుటియఫ్ జిల్లా కౌన్సిల్ సభ్యులు శు భానందరావు, లక్ష్మన్న మాట్లాడారు. కార్యమంలో యుటియఫ్ నాయకులు వీరభద్రయ్య, రవీంద్రలాన్, విజయ్, సిఐటియు నాయకులు మల్లికార్జున పాల్గొన్నారు.

**గోనెగండ్ల :**



స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ఆవరణలో యుటియఫ్ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సీనియర్ నాయకులు కాశయ్య, మండల కార్యదర్శి నరసింహులు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ వైఖరికి నిరసనగా చేపట్టే ఉద్యమాల్లో ఉపాధ్యాయులు పాలుపంచుకొంటేనే హక్కులు సాధించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో యుటియఫ్ నాయకులు పౌలు, మునెప్ప, రామకృష్ణ, రంగస్వామి, రామచంద్ర, జిక్రియ, సురేష్, వేణు, నవీన్‌పాటి, ఆనంద్, రమేష్, ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు నాయకులు పాల్గొన్నారు.

**అనంతపురం జిల్లా**

**యుటియఫ్ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడకలు**

ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటియఫ్) 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జిల్లా కేంద్రంలో యుటియఫ్ ఆఫీసు నందు జరిగిగాయి. జిల్లా అధ్యక్షులు ఎం.సుధాకర్ అధ్యక్షత జరిగిన సమావేశంలో జెఏసి జనరల్ సెక్రటరీ మరియు యుటియఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఐ.వెంకటేశ్వరరావు, యుటియఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.బాబురెడ్డి, రాష్ట్ర సహాధ్యక్షులు వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ జిలాన్ ముఖ్య అతిథులుగా హాజరై వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యమంనందు ఉపాధ్యాయులకు అనేక సౌకర్యములు హక్కులు సాధించిపెట్టడంలో యుటియఫ్ పోరాటములు అగ్రస్థానంలో వున్నాయని ఈ రోజు ఉపాధ్యాయులు అనుభవిస్తున్న హక్కులు, ఆర్థిక సౌకర్యములు అన్ని ఉద్యమాల ద్వారా అనేకమంది నాయకుల త్యాగాల ఫలితంగా వచ్చాయని, అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేడు ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ షరతలకు లోబడి కార్పొరేటీకరణ వైపు అడుగులు చేస్తూ పెన్షన్ పథకం రద్దుచేసి దాని స్థానంలో సిపిఎస్ పెన్షన్ సౌకర్యం ఏర్పాటు చేసినదని, సిపిఎస్ రద్దుకై యుటియఫ్ ముందు వరసలో వుండి పోరాటములు కొనసాగిస్తున్నదని, విద్యారంగంలో కార్పొరేట్ పాఠశాలలకు కొమ్ముకాయడానికి "సెల్ఫ్ ఫండింగ్ పాఠశాలల చట్టం" తీసుకురావడానికి ప్రయత్నం చేస్తుందని ఈ ప్రయత్నం మానుకోవాలని యుటియఫ్ నాయకులు డిమాండ్ చేశారు. లేకపోతే తీవ్రస్థాయిలో ఉద్యమించ వలసి వస్తుందని వారు అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి ఎస్‌వివి రమణయ్య, గౌరవాధ్యక్షులు సికె నాగేంద్రబాబు, ఉపాధ్యక్షురాలు ఉషారాణి, కోశాధికారి జయచంద్రారెడ్డి, యుటియఫ్ నాయకులుఉ కోటేశ్వరప్ప, అనిల్, ఖాన్, శ్రీను, రామకృష్ణ, వెంకటేశు, శేషప్ప, గోపాల్, సరళ, సిద్ధన్న తదితరులు పాల్గొన్నారు.

నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ నాయకులు రాంభూపాల్ రెడ్డి రాష్ట్ర నాయకుల సమక్షంలో యుటియఫ్ సభ్యత్వం స్వీకరించి యుటియఫ్‌లో చేరడం జరిగింది.

**ఉరవకొండ :**



యుటియఫ్ 44వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఉరవకొండ యుటియఫ్ ప్రాంతీయ కార్యాలయంనందు సీనియర్ నాయకులు బండయ్య జెండా ఆవిష్కరణ చేశారు. ఇందులో జిల్లాకార్యదర్శి రామప్ప చౌదరి మాట్లాడుతూ 1974 ఆగస్టు 10న అప్పారి వెంకటస్వామి కేడర్ల వారీగా ఉన్న సంఘాల ఉపాధ్యాయులందరినీ ఐక్యం చేస్తూ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ పేరుతో అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ లక్ష్యాలుగా ఏర్పాటు చేశారని, నాటి నుండి నేటివరకు నీతి, నిజాయితీకి మారుపేరుగా ఉంటూ అవినీతి అక్రమాలపై రాజీలేని పోరాటం చేసే సంఘం యుటియఫ్ ఒక్కటేనని, యుటియఫ్ సభ్యులుగా ఉన్నందుకు గర్వపడుతున్నామని తెలియజేశారు. బండయ్య మాట్లాడుతూ యుటియఫ్ ఉరవకొండ ప్రాంతంలో ఇంకా అభివృద్ధి జరిగి తిరుగులేని శక్తిగా అవతరించాలని సభ్యులందరికీ తెలియ జేశారు. సంజీవకుమార్ మాట్లాడుతూ బదిలీలలో ఎక్కువమంది కొత్త పాఠశాలలకు వెళ్లారని అందరూ కూడా వృత్తినే దైవంగా భావించి సంఘ అభివృద్ధితోపాటు విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దాలని కోరారు.

ఇందులో వజ్రకరూరు ప్రధానకార్యదర్శి శేఖర్, విడపనకల్లు ప్రధాన కార్యదర్శి జయరాం, అధ్యక్షులు రఘు, ఉరవకొండ అధ్యక్షులు సంజీవ, కోశాధికారి లక్ష్మీనారాయణ, మోహన్, రామచంద్ర, ఎర్రిస్వామి, నాగరాజు, ఓబన్న, శ్రీనివాసులు, మైలారులింగ, నరసింహులు, దస్తగిరి, ఉమాపతి, ఆంజనేయులు, ఇంకా ఉరవకొండ జోన్ కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్‌టియఫ్‌ఐ ఆవిర్భావ దినోత్సవాలు

**విజయనగరం జిల్లా**

### ఘనంగా ఎస్‌టిఎఫ్‌ఐ పతాకావిష్కరణలు



విజయనగరం జిల్లా కేంద్రంలో యుటియఫ్ కార్యాలయం వద్ద ఎస్‌టిఎఫ్‌ఐ పతాకాన్ని డి.రాము ఆవిష్కరించారు. దేశవ్యాప్తంగా విద్యారంగ పరిరక్షణ కోసం, ఉపాధ్యాయులను చైతన్యపరిచే విశాల వేదికగా ఎస్‌టిఎఫ్‌ఐ ఏర్పడిందని, కార్పొరేట్ శక్తుల నుండి విద్యా వ్యవస్థను కాపాడుకోవడానికి కృషి చేస్తుందని, నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి, పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ కొరకు దేశవ్యాపిత ఉద్యమాలు చేపడతామని నాయకులు డి.రాము, కె.శ్రీనివాస్, కె.శేషగిరి, ఎ.శివవర్మ, జి.నిర్మల, రమేష్ పట్నాయక్, పి.శ్రీనివాసరావు, జెఏవి ఈశ్వరరావులు అన్నారు. ఆఫీస్ బేరర్సు, మండలాల నాయకత్వాలు పాల్గొన్నారు.

**విశాఖపట్నం జిల్లా**

**యలమంచిలి :**



ఎన్‌టిఎఫ్‌ఐ 18వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏపియుటియఫ్ యలమంచిలి మండలశాఖ ఆధ్వర్యంలో చించినాడ బ్రిడ్జీడ సెంటర్‌లో ఎస్‌టిఎఫ్‌ఐ పతాకాన్ని సీనియర్ నాయకులు వలవల శ్రీరామమూర్తి ఆవిష్కరించి మాట్లాడుతూ సిపిఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు యుటియఫ్ మండల శాఖ అధ్యక్షులు పోలిశెట్టి క్రాంతికుమార్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ అన్ని రాష్ట్రాలలోని భావ సారూప్యతగల సంఘాలతో ఎస్‌టిఎఫ్‌ఐ ఏర్పడిందన్నారు. విద్యారంగ సమస్యలపై జాతీయ స్థాయిలో పోరాటాలకు వేదికగా ఎస్‌టిఎఫ్‌ఐ ఉందన్నారు.

మండలశాఖ ప్రధానకార్యదర్శి బొక్కా మాణిక్యాలరావు మాట్లాడుతూ ఏపి సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ యాక్ట్-2017ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు యర్రా అజయ్‌కుమార్, దేవ సుధాకర్, రామేశ్వరపు సత్యనారాయణ, ఆఫీస్ బేరర్స్ షేక్ కపీషా, ఆరిమిల్లి శ్రీనివాస్, గుత్తిందీవి శ్రీనివాస్, కె.వి. రవికుమార్, అడబాల వెంకటేశ్వరరావు, పెచ్చెట్టి నాగశ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు నడింపల్లి రంగరాజు, పి.రామచంద్రరావు, పి.బుద్ద రాజు, జి.గిరిబాబు, కుడిపూడి సత్యనారాయణ, టి.వి.సత్యనారాయణ, చింతా సత్యనారాయణ, వై.కుమార్రాజు, పి.వి.సత్యనారాయణ, బి.మధు సూదనరావు తదితరులు పాల్గొన్నారు.

**పశ్చిమగోదావరి జిల్లా**

### డిటెన్షన్ విధానం వద్దు



**ఏలూరు :** కేంద్ర ప్రభుత్వం పాఠశాల విద్యారంగంలో డిటెన్షన్ విధానాన్ని తిరిగి ప్రవేశపెట్టాలనే ఆలోచనను విరమించుకోవాలని స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టిఎఫ్‌ఐ) జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎస్‌కె సాబ్జీ డిమాండ్ చేశారు. ఆగస్టు 12న స్థానిక యుటియఫ్ జిల్లా కార్యాలయంలో ఎస్‌టిఎఫ్‌ఐ 18వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా సాబ్జీ పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేయడం కోసం దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఉద్యమాలు చేపడతామన్నారు. కంప్యూటర్ ఉపాధ్యాయులను నియమించడానికి అవసరమైన నిధులు కేటాయించాలని కోరారు. విద్యా సెస్‌ను విద్యారంగాభివృద్ధికే ఖర్చు చేయాలని కోరారు. యుటియఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.జయకర్, ఆర్.రవికుమార్, స్థానిక నాయకులు ఈడే శివశంకర్, షేక్ సుభాన్ బేగం బీబీ, నంబూరి రాంబాబు, కేవీ అప్పారావు పాల్గొన్నారు.

**భీమవరం :**



ఎస్‌టిఎఫ్‌ఐ పతాకావిష్కరణ సందర్భంగా జిల్లా ప్రధానకార్యదర్శి బి.గోపీమూర్తి మాట్లాడుతూ జాతీయస్థాయిలో విద్యారంగ సమస్యలు, ఉపాధ్యాయ సమస్యలు, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న ప్రజావ్యతిరేక విద్యారంగ చట్టాలను ఎదుర్కొనే భాగంలో స్కూల్ టీచర్స ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టిఎఫ్‌ఐ) ఆవిర్భవించిందని, దీనిని మాజీ ఎమ్మెల్సీ, యుటియఫ్ వ్యస్థాపక రాష్ట్ర అధ్యక్షులు దాచూరి రామిరెడ్డి స్థాపించి, అన్ని రాష్ట్రాలలోని ఉపాధ్యాయ సంఘాలను ఎస్‌టిఎఫ్‌ఐ గొడుగు క్రిందకు తీసుకొనివచ్చి, జాతీయ స్థాయిలో అనేక ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై పోరాటాలను నిర్వహించి, విజయాలను సాధించిన సంస్థగా ఎస్‌టిఎఫ్‌ఐను అభివర్ణించారు.

జిల్లా కార్యదర్శి విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఢిల్లీలో ఎస్‌టిఎఫ్‌ఐ కేంద్ర కార్యాలయాన్ని ఏర్పాటు చేసి జాతీయ, అంతర్జాతీయ విద్యారంగ సదస్సులను నిర్వహించి ప్రభుత్వాలు కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లో ఎక్కువ శాతం నిధులు కేటాయించుటలోను, అలాగే కేంద్ర ప్రభుత్వ ఉద్యో గులతో సమానంగా ఉపాధ్యాయుల జీత భత్యాలు పెరగటం లోను, సిపిఎస్ టీచర్స్‌కు గ్రాట్యూటీ, ప్రభుత్వ విద్యారంగాన్నే ప్రైవేటీకరణ చెయ్యాలనే ప్రభుత్వాల ఆలోచనలను త్రిప్పికొట్టడంలో తీవ్రమైన కృషి చేస్తున్న సంస్థ ఎస్‌టిఎఫ్‌ఐ అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎస్‌టిఎఫ్‌ఐ జెండాను ఆవిష్కరించడమైనది. యుటియఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి బి.గోపీమూర్తి, జిల్లా కార్యదర్శి ఎంఐ విజయకుమార్, రాష్ట్ర కౌన్సిలర్ పి.సీతారామరాజు, భీమవరం డివిజన్‌లోని వివిధ మండలాల నాయకులు ఎంవి సత్యనారాయణ రాజు, జి.సుధాకర్, పిఆర్‌కె వర్మ, కె.విజయరామరాజు, వామనమూర్తి, చింతపల్లి ప్రసాద్, ఎస్‌కె బాషా, మల్లుల శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేశారు.

### గుంటూరు జిల్లా

### సిపిఎస్ రద్దు రాజీలేని పోరాటం



స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టిఎఫ్‌ఐ) వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆగస్టు 12న స్థానిక బ్రాడీపేట యుటియఫ్ కార్యాలయంలో ఎస్‌టిఎఫ్‌ఐ పతాకాన్ని యుటియఫ్ సీనియర్ నాయకులు జి.ప్రభుదాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత చెన్నుపాటి లక్ష్మయ్య కాంస్య విగ్రహానికి యుటియఫ్ ప్రచురణల కమిటీ చైర్మన్ ఎన్.తాండవకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దఎత్తున కార్పొరేట్ అనుకూల విధానాలు అవలంభిస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ విద్యారంగ రక్షణకు జాతీయస్థాయిలో ఉద్యమాలను ఉధృతం చేయాలన్నారు. జి.ప్రభుదాసు మాట్లాడుతూ నూతన పెన్షన్ విధానం రద్దు, తదితర జాతీయస్థాయి సమస్యలపై ఎస్‌టిఎఫ్‌ఐ రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. నూతన విద్యా చట్టం ద్వారా విద్య మరింత వ్యాపారమయం అవుతుందని, విద్య అందరికీ అందించాల్సిన బాధ్యత నుండి ప్రభుత్వం తప్పుకుంటోందన్నారు.

కార్యక్రమంలో యుటియఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.నాగమల్లేశ్వరరావు, ఎం.హనుమంతరావు, జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.డి.గౌస్, సహాధ్యక్షులు జి.విజయసారధి, బి.ఆదిలక్ష్మి, జిల్లా కోశాధికారి పి.ప్రేమ్‌కుమార్, జిల్లా కార్యదర్శులు పాల్గొన్నారు.

### చిత్తూరు జిల్లా

### కేంద్ర ప్రభుత్వం సిపిఎస్‌ను రద్దు చేయాలి




**పలమనేరు :** కేంద్ర ప్రభుత్వం నూతన పెన్షన్ విధానం (సిపిఎస్)ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని యుటియఫ్ పలమనేరు డివిజన్ శాఖ డిమాండ్ చేసింది. ఎస్‌టిఎఫ్‌ఐ 18వ ఆవిర్భావ దినోత్సవాన్ని సంఘ డివిజన్ కార్యాలయం దగ్గర ఘనంగా నిర్వహించారు. ఎస్‌టిఎఫ్‌ఐ పతాకాన్ని యుటియఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎన్.సోమచంద్రారెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "2003 డిసెంబర్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రపంచబ్యాంకు షరతులకు లోబడి తీసుకొచ్చిన సిపిఎస్ విధానం ఉద్యోగులపాలిట శాపంగా తయారయిందని, కనుక వెంటనే ఈ విధానాన్ని రద్దు చేయాలన్నారు. లేకుంటే ఇప్పటికే దేశ వ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలను మరింత ఉధృతం చేస్తా మన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా దీనిపై నిర్ణయం తీసుకోవాలన్నారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థూల ఉత్పత్తిలో విద్యకు 6%, రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో 30% విద్యకు కేటాయించాలన్నారు.

దేశవ్యాప్తంగా కామన్ స్కూల్ విధానాన్ని అమలు చేయాలని, విద్యార్థుల్లో విద్వేషాన్ని రగిల్చే మతపరమైన అంశాలను పాఠ్య పుస్తకాలలో చేర్చరాదన్నారు. విద్యాహక్కు చట్టం అమలు చేయాలంటే అయ్యే ఖర్చును కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు అందించాలన్నారు. జిల్లా కార్యదర్శులు పి.సుధాకర్‌రెడ్డి, సిపి ప్రకాష్‌లు మాట్లాడుతూ "ప్రాథమిక స్థాయిలో ప్రవేశపెట్టదలచిన డిటెన్షన్ విధానాన్ని" ఉపసంహరించుకోవాలన్నారు. డిటెన్షన్ విధానంవల్ల విద్యార్థులు డ్రాపౌట్లుగా మారే ప్రమాదముందన్నారు.

ఈ కార్యక్రమంలో జివి రమణ, గురుమూర్తిశెట్టి, పాపయ్య, కృష్ణ మూర్తి, విజయ్‌కుమార్, వేమచంద్రారెడ్డి, పురుషోత్తం, మురళీకృష్ణ, యుగంధర్, ఆనంద్, బషీర్, రామ్మోహన్, గౌస్‌భాషా మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### అనంతపురం జిల్లా

### డిటెన్షన్ విధానం విరమించుకోవాలి



**అనంతపురం అర్బన్ :** విద్యారంగంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు సరికాదని వెంటనే విరమించాలని స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టిఎఫ్‌ఐ) జాతీయ ఉపాధ్యక్షులు ఐ. వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఎస్‌టిఎఫ్‌ఐ 18వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆగస్టు 12న జిల్లా కేంద్రంలోని యుటియఫ్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తొలుత ఎస్‌టిఎఫ్‌ఐ పతాకంను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యారంగాన్ని కేంద్ర ప్రభుత్వం ఒంటెత్తు పోకడలతో రాష్ట్రాల అధికారాలను కాలరాస్తుందన్నారు. ఏకపక్షంగా డిటెన్షన్ విధానం తీసుకురావడం అశాస్త్రీయమన్నారు. స్వాతంత్ర్యం సాధించి 70 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్నప్పటికీ సంపూర్ణ అక్షరాస్యత సాధించలేకపోతున్నామన్నారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమవుతున్నాయని ఆరోపించారు.

దేశ అక్షరాస్యత 74.04 శాతం ఉండగా, రాష్ట్ర అక్షరాస్యత 67.41 శాతం ఉందన్నారు. ఈ నేపథ్యంలో డిటెన్షన్ విధానం అమలుచేస్తే డ్రాపౌట్స్ సంఖ్య మరింత పెరిగే ప్రమాదం ఉందన్నారు. మత సంస్థల చేతికి మధ్యాహ్న భోజన పథకం అమలు బాధ్యతను అప్పగించడం మంచిది కాదన్నారు. అలాంటి సంస్థలు నిర్వహించే మధ్యాహ్న భోజనం వివిధ రాష్ట్రాలలో విఫలమైందని చెప్పుకొచ్చారు.

యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ జిలాన్ మాట్లాడుతూ డిటెన్షన్ విధానం అమలు చేస్తే పేద పిల్లలు చదువుకు దూరమై బాలకార్మికులుగా మారే ప్రమాదం ఉందన్నారు. సమావేశంలో యుటియఫ్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎం.సుధాకర్, ఎన్.వి. రమణయ్య, జిల్లా నాయకులు సికె నాగేంద్రబాబు, జయచంద్రారెడ్డి, కోటీశ్వరప్ప, ఈశ్వరయ్య, కొండప్ప, అనిల్,ఖా ఖన్, సాయినాథ్, గోపాల్, శేషు, నాగేంద్ర, రామకృష్ణ, రమేష్‌రెడి, వెంకట్రాముడు, సురేష్‌కుమార్, బసవరాజు తదితరుల పాల్గొన్నారు.

# సదస్సులు - సమావేశాలు

**శ్రీకాకుళం జిల్లా**

### ఉమ్మడిసర్వీస్ రూల్స్‌తో జెఎల్స్, డైట్ లెక్చరర్స్ ప్రమోషన్లు ఇవ్వాలి



ఉమ్మడి సర్వీస్‌రూల్స్‌తో జూనియర్ లెక్చరర్స్ (జెఎల్), డైట్ లెక్చరర్స్, ఉపవిద్యాశాఖాధికారులు తదితర పోస్టులకు ప్రమోషన్లు వెంటనే చేపట్టాలని, అదే విధంగా స్కూల్ అసిస్టెంట్స్ తదితర పోస్టులకు నెలవారీ ప్రమోషన్లు చేపట్టాలని యుటియఫ్ రాష్ట్ర అధ్యక్షులు, రాష్ట్ర జెఏసి సెక్రటరీ జనరల్ ఐ.వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆగస్టు 27న శ్రీకాకుళం జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (బాలురు)లో జిల్లా అధ్యక్షులు రెడ్డి మోహనరావు అధ్యక్షతన జరిగింది.

జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఐ.వెంకటేశ్వరరావు ప్రసంగిస్తూ ఉమ్మడి సర్వీస్‌రూల్స్‌లో గిరిజన సంక్షేమ, మున్సిపల్ ఉపాధ్యాయులను చేర్చాలని డిమాండ్ చేశారు. స్వయంపోషక స్వతంత్ర పాఠశాలల చట్టం-2017ను, సిపిఎస్ విధానం వెనక్కు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 1న విజయవాడలో జరుగునున్న మిలీనియం మార్చ్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బదిలీల కౌన్సిలింగ్‌లో జరిగిన అక్రమాలపై రాష్ట్ర విద్యాశాఖ సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై క్రమశిక్షణా చర్యలు చేపట్టాలన్నారు. శ్రీకాకుళం జిల్లాలో బదిలీల్లో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని, బాధ్యులైన జిల్లా విద్యాశాఖాధికారి, సంబంధిత అధికారులపై క్రమశిక్షణా చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

సమావేశంలో యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికిగాను ఉపాధ్యాయు లంతా కృషి చేయాలని, తాము పనిచేస్తున్న పాఠశాలలను దత్తత తీసుకొని అభివృద్ధి చేయాలని కోరారు. విద్యావికాస ఉద్యమాన్ని బలపరచాలని, సెప్టెంబర్ 2న శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగనున్న స్వయంపోషక స్వతంత్ర పాఠశాలల చట్టం సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విద్యాశాఖకు సంబంధంలేని వ్యక్తులు పాఠశాలల పర్యవేక్షణను తీవ్రంగా వ్యతిరేకిస్తూ తీర్మానించింది.

జిల్లా ప్రధానకార్యదర్శి చౌదరి రవీంద్ర ప్రసంగిస్తూ సెప్టెంబర్ నెలలో అన్ని మండల, పట్టణ శాఖలు మహాసభలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. జిల్లా కోశాధికారి పొందూరు అప్పారావు ఆర్థిక నివేదికను ప్రవేశపెట్టారు. జిల్లా గౌరవాధ్యక్షులు కుప్పిలి కామేశ్వర రావు సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ కాలంలో అమరులకు కౌన్సిల్ నివాళులర్పించారు. సమావేశంలో రాష్ట్ర ఆడిట్ సభ్యులు ఎస్. కిశోర్‌కుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు కె.రామలక్ష్మి, జిల్లా సహాధ్యక్షులు బమ్మిడి శ్రీరామమూర్తి, ఎం.వాగ్దేవి, జిల్లా కార్యదర్శులు ఆరిక భాస్కర రావు, పి.ధర్మారావు, బి.విజయకుమారి, కె.వి.శ్రీరామమూర్తి, డి.ప్రకాశ రావు, వై.ఉమాశంకర్, కోరాడ వైకుంఠరావు, ఎల్.బాబురావు, ఎస్. వెంకటరావు, జె.చినబాబు, మహిళా టీచర్స్ ఫోరం జిల్లా కన్వీనర్ బి.ధనలక్ష్మి, సభ్యులు సుబ్బలక్ష్మి, రాష్ట్ర కౌన్సిలర్స్ టి.వైకుంఠరావు, గొంటి సురేష్, పి.మురళి, ఏపి మోడల్ స్కూల్స్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు బి.సురేష్, రాజు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు కెవిడి ప్రసాద్ అన్ని మండల పట్టణ శాఖల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు జిల్లా కౌన్సిలర్లు చర్చలలో పాల్గొన్నారు.

**పశ్చిమగోదావరి జిల్లా**

### ఆ చట్టంతో పాఠశాల విద్య నిర్వీర్యం



**తాడేపల్లిగూడెం :** పాఠశాల విద్యను నిర్వీర్యం చేసే, కార్పొరేట్ పాఠశాలలకు అనుకూలమైన స్వయంపోషక స్వతంత్ర పాఠశాలల చట్టం-2017ను ఉపసంహరించాలని యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కె.సాల్టీ డిమాండ్ చేశారు. యుటియఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లాశాఖ అధ్యక్షులు పి.జయకర్ అధ్యక్షతన స్థానిక జడ్పి ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం విద్యారంగంలో డిటెన్షన్ విధానాన్ని తీసుకురావడానికి ప్రయత్నిస్తోందని, దీంతో ఎస్సీ, ఎస్టీ, బాలికల డ్రాప్‌అవుట్స్ పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.

మున్సిపల్ టీచర్ల సమస్యలపై ఆగస్టు 17న ఫ్యాప్టో ఆధ్వర్యంలో డిఎంఎ వద్ద రాష్ట్రస్థాయి ధర్నా చేస్తామన్నారు. యుటియఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి బి.గోపీమూర్తి మాట్లాడుతూ బదిలీల్లో 50% నియమకాన్ని సడలించి బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని డిమాండ్ చేశారు. పిఆర్‌సి బకాయిలు చెల్లించాలన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.రామకృష్ణ, అసోసియేట్ అధ్యక్షులు బి.సుభాషిణి, జిల్లా కార్యదర్శులు ఎంవీ శ్యాం బాబు, ఏకెవీ రామభద్రం, పి.శివప్రసాద్, పి.విష్ణుమూర్తి, ఎ.విక్టర్, ఈ శివశంకర్, కె.హరిప్రియ, ఐ.రాంబాబు, రాష్ట్ర కౌన్సిలర్స్ టిజె జయకుమార్, ఎస్.రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.

### సిపిఎస్ విధానం రద్దు చేయాలి

**పెరవలి :** పెరవలి ప్రాథమిక మండల యుటియఫ్ కమిటీ సభ్యుల సమావేశం శాఖ మండల అధ్యక్షులు వివిఎస్ భాస్కరరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి పిల్లి విష్ణుమూర్తి మాట్లాడుతూ సెప్టెంబర్ 1వ తేదీన విజయవాడలో సిపిఎస్ విధానం రద్దు చేయాలని కోరుతూ తలపెట్టిన మిలియన్‌మార్చ్‌కి యుటియఫ్ సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఇప్పటికే అనేక యాప్‌లు ద్వారా ఆన్‌లైన్ ప్రాసెస్ జరుగుతుండగా అదనంగా అంగన్‌వాడీ పర్యవేక్షణ యాప్‌ను ఉపాధ్యాయులకు అప్పగించడం వలన బోధనకు ఆటంకం ఏర్పడు తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధానకార్యదర్శి వి.వెంకటరమణ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన పది నెలల పిఆర్‌సి ఏరియల్స్, డిఏలను ప్రకటించాలని ఆయన తెలిపారు. కామేశ్వరరావు పాల్గొన్నారు.

**గుంటూరు జిల్లా**

### ఆగస్టు 17న మున్సిపల్ ఉపాధ్యాయు మహాధర్నా - ఫ్యాప్టో

మున్సిపల్ పాఠశాలల, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించా లని డిమాండ్ చేస్తూ ఈ నెల 17న ఫ్యాప్టో ఆధ్వర్యంలో డిఎంఎ కార్యాలయం వద్ద ధర్నా చేయబోతున్నట్లు ఫ్యాప్టో గుంటూరు జిల్లా కమిటీ సమావేశంలో ప్రకటించారు. ఈ సందర్భంగా బ్రాడీపేట 2/6లోని యుటియఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు కె.నాగ మల్లేశ్వరరావు అధ్యక్షతన ఆగస్టు

14న జరిగిన సమావేశంలో ఫ్యాప్టో కో-చైర్మన్ సిహెచ్.సుధీర్‌బాబు మాట్లాడుతూ అనేకసార్లు ప్రాతినిధ్యం చేసినా సమస్యలు పరిష్కారం కానందున ధర్నాకు పిలుపునివ్వడం జరిగిందన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్‌లో ఉన్న అసంబద్ధతులను తొలగించాలని, ఉపాధ్యాయులు విశాల ప్రాతిపదిక మీద ఆలోచన చేసి మున్సిపల్ పాఠశాలలను, హక్కులను కాపాడుకు నేందుకు పోరాటంలో కలిసిరావాలని పిలుపు నిచ్చారు. ఫ్యాప్టో కోశాధికారి జి.శౌరిరాయలు మాట్లాడుతూ అన్ని పురపాలక పాఠశాలల్లో అన్ని తరగతులకు తెలుగు మాధ్యమాన్ని కొనసాగిం చాలని, పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

యుటియఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మున్సిపల్ విద్యార్థులందరికీ నాణ్యమైన విద్యను అందించాల్సింది పోయి ఫౌండేషన్ కోర్సుల పేరుతో కొద్దిమందికే ప్రత్యేక బోధన చేయడం ఎంతవరకు సబబు అని ఇది ప్రైవేటు వారికి లాభం కలిగించే విధంగా ఉండడం సరైనది కాదు అని అన్నారు.

ఈ సమస్యల పరిష్కారానికి డిఎంఏ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో యుటియఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.హనుమంతరావు, ఎన్‌టియు జిల్లా అధ్యక్షులు వివి శ్రీనివాసరావు, జె.విజయానంద్ (ఏపిటిఎఫ్-1938), పి.సాంబయ్య (ఆర్‌యుపిపి), వి.లక్ష్మీకాంత్ (ఏపిటిఎఫ్-257) తదితరులు పాల్గొన్నారు.

### బదిలీల్లో జరిగిన అవకతవకలపై విచారణ జరపాలి



ఉపాధ్యాయుల బదిలీల్లో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టి గుంటూరు డిఈఓను విధులనుంచి తప్పించాలని యుటియఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.బాబురెడ్డి డిమాండ్ చేశారు. ఆగస్టు 12న జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కౌన్సిలింగ్‌లో ఓ ఉపాధ్యాయుడు పొన్నూరు మండలం వల్లభనేనివారిపాలెం ఎంపియుపి నుంచి శావల్యా పురం మండలం పిచుకలపాలెం కోరుకోగా ఉత్తర్వులు కూడా జారీ అయ్యాయన్నారు. కానీ సదరు ఉపాధ్యాయుడు పిచుకలపాలెంలో చేరకుండా జడ్పీ హైస్కూల్ కొమ్మూరులో చేరేలా డిఇఓ సొంతంగా ఉత్తర్వులు ఇచ్చారని పేర్కొన్నారు. దీనితోపాటు మంగళగిరి మండలం పెదవడ్లపూడి జడ్పీ ఉన్నత పాఠశాలలో పోస్టు ఉన్నా కౌన్సిలింగ్‌లో చూపలేదన్నారు. అప్పుడు అధికారులు దాచేపల్లి మండలం గార్లపాడు నుంచి ప్రధానోపాధ్యాయిని ఇక్కడ చేరుతున్నట్లు ప్రభుత్వంనుంచి ఉత్తర్వులు వచ్చాయని, అధికారులు చెప్పారన్నారు. ప్రస్తుతం ఆ పోస్టులో ఎఫ్‌ఏసీని కొనసాగిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాలు, మేధావుల సంప్రదింపులు లేకుండా ప్రైవేట్ కన్సెల్‌టెంట్ అభిప్రాయాలను తీసుకుని ప్రభుత్వం స్వయంపోషక స్వతంత్ర పాఠశాలల యాక్ట్-2017 అమలు లోకి తేవాలని చూస్తున్నారన్నారు. విద్యారంగానికి గొడ్డలిపెట్టుగా మారిన ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఆగస్టు 13న మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. మున్సిపల్ పాఠశాలల్లో విద్యాభివృద్ధి, ఉపాధ్యాయుల సమస్యలపై ఆగస్టు 17న గుంటూరులోని పురపాలకశాఖ డైరెక్టర్ కార్యాలయం ధర్నా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

**కడప జిల్లా**

### సిపిఎస్ రద్దుకై మిలియన్ మార్చ్‌ను జయప్రదం చేయండి



కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం (సిపిఎస్)ను రద్దుచేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 1వ తేదీన విజయవాడలో తలపెట్టిన "మిలియన్ మార్చ్"ను జయప్రదం చేయాలని యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మిరాజా పిలుపునిచ్చారు. ఆగస్టు 28న కడప పట్టణంలోని యుటియఫ్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో పాల్గొని ఆయన ప్రసంగించారు.

లక్ష్మిరాజా మాట్లాడుతూ అనేక పోరాటాలు, ఉద్యమాల ద్వారా సాధించుకున్న పెన్షన్ సౌకర్యాన్ని కాలరాస్తూ గత ఎన్‌డిఏ ప్రభుత్వం 2004 తర్వాత ఉద్యోగాల్లో చేరిన వారందరినీ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్) పరిధిలోకి తెచ్చిందన్నారు. ఈ విధానం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా లక్షా అరవై ఐదువేలమంది ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షన్ సౌకర్యాన్ని కోల్పోయి కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్) పరిధిలోకి వచ్చారన్నారు. సిపిఎస్ ఉద్యోగులకు జీవిత భద్రత లేకుండా పోయిందన్నారు.

యుటియఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎం.విజయ కుమార్, ఎస్.వి.సుబ్బరాజులు మాట్లాడుతూ సిపిఎస్ రద్దుకోసం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఉద్యమిస్తున్నా ప్రభుత్వం స్పందించక పోవడం దారుణమన్నారు. పెన్షన్ సౌకర్యం ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చే బిక్షకాదని, అది ఉద్యోగుల హక్కు అన్నారు. సిపిఎస్‌ను రద్దుచేసే వరకు తమ పోరాటం ఆగదని, అందులోభాగంగానే సెప్టెంబర్ 1న జరిగే మిలియన్ మార్చ్‌ను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటియఫ్ జిల్లా కార్యదర్శి సివి రమణ, నాయకులు జి.వెంకటసుబ్బయ్య, వై.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

### సిపిఎస్ రద్దు చేసే వరకు ఉద్యమం

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్) విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించేవరకు ఉద్యమం కొనసాగుతుందని యుటియఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎస్.వి.సుబ్బరాజు హెచ్చరించారు. సెప్టెంబర్ 3న యుటియఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో పాల్గొని ప్రసంగించారు.

ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడుతూ ఉద్యోగి జీవన భద్రతను దెబ్బతీస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2004 తర్వాత ఉద్యోగాల్లో చేరినవారికి పాత పెన్షన్ విధానాన్ని రద్దు చేస్తూ కాంట్రి బ్యూటరీ పెన్షన్ విధానాన్ని అమలులోకి తెస్తూ చట్టాన్ని తెచ్చారన్నారు. ఈ చట్టంవల్ల లక్షలాది ప్రభుత్వ ఉద్యోగులు పెన్షన్ సౌకర్యాన్ని కోల్పో యారన్నారు. సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధ రించాలని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఉద్యమాలు చేస్తున్నా, పాలకవర్గాలు 'నిమ్మకు నీరెత్తినట్లు' వ్యవహరిస్తున్నాయని వివరించారు. పెన్షన్ ఉద్యోగుల హక్కు అని, అది ప్రభుత్వాలు ఇచ్చేభిక్ష కాదన్నారు. ప్రభుత్వాలు తక్షణమే స్పందించి సిపిఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమం తీవ్రతరమవుతుందని హెచ్చరించారు. సిపిఎస్ రద్దుకోసం త్వరలో రిలేనిరాహారదీక్షలు, జీపు జాతాలు చేపట్ట నున్నట్లు ఆయన వివరించారు.

యుటియఫ్ జిల్లా అధ్యక్షులు ఎం.విజయ్‌కుమార్ మాట్లాడుతూ పిఆర్‌సి

అమలై రెండేళ్ళు దాటినా ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన 10 నెలల బకాయిలు చెల్లించకపోవడం దారుణ మన్నారు. 3 విడతల డిఏలు చెల్లించాల్సి ఉండగా కేవలం ఒక డిఏ మాత్రమే చెల్లించి చేతులు దులుపుకోవడం తగదన్నారు. ఉద్యోగులకు సక్రమంగా డిఏలు కూడ చెల్లించని ఘనత చంద్రబాబు ప్రభుత్వానికే చెందిందన్నారు. సర్వీస్‌రూల్స్ వేగంగా అమలుచేసి పదోన్నతులు చేపట్టి, విద్యాశాఖలో ఖాళీలు భర్తీ చేయాలన్నారు. ఎయిడెడ్ ఉపాధ్యా యులకు పదోన్నతులు చేపట్టాలని, 398/- రూపాయలతో పనిచేసిన స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, హెల్త్‌కార్డులను అమలు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

సమావేశంలో యుటియఫ్ జిల్లా సెక్రటరీ బి.హరిప్రసాద్, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్.ఓబుల్‌రెడ్డి, జిల్లా కార్యదర్శులు వై.రవికుమార్, ఎస్. రామాంజనేయులు, వై.మస్తాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలపై ప్రాతినిధ్యాలు

**పశ్చిమగోదావరి జిల్లా**

### సెప్టెంబర్ 6న యుటియఫ్ ధర్నా
### సి2 గుమస్తాపై శాఖాపరమైన చర్యలకు డిమాండ్

**పాలకొల్లు అర్బన్ :** ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి గతంలో ఇచ్చిన హామీ నెరవేర్చని కారణంగా సెప్టెంబర్ 6న ఉపా ధ్యాయులు మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేయనున్నట్లు పట్టణ యుటియఫ్ శాఖ ఆగస్టు 21న మున్సిపల్ కమీషనర్ ఆళ్ల రామమోహన్ రావుకి వినతిపత్రం అందజేశారు. అలాగే సీ2 జూనియర్ అసిస్టెంట్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని యూనియన్ సభ్యులు డిమాండ్ చేశారు. యుటియఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి బి.గోపిమూర్తి, కార్యదర్శి ఏకేవీ రామభద్రం, రాష్ట్ర కౌన్సిలర్ శ్రీనివాసన్, పట్టణశాఖ అధ్యక్ష, కార్యదర్శులు దువ్వాని యేసుబాబు, పి.రాజశేఖర్, పలువురు యూనియన్ సభ్యులు కమీషనర్‌కి వినతిపత్రం సమర్పించారు.

**గుంటూరు జిల్లా**

### నిబంధనలకు విరుద్ధంగా జరిగిన ప్రమోషన్లు రద్దు చేయాలి



ఎయిడెడ్ పాఠశాలల్లో పదోన్నతులు ప్రభుత్వ నిబంధన ప్రకారం జరపాలని డిమాండ్ చేస్తూ యుటియఫ్ గుంటూరు జిల్లా కమిటీ ప్రాంతీయ సంచాలకులు, పాఠశాల విద్య (ఆర్‌జెడి) కెవి శ్రీనివాసులు రెడ్డిని కలిసి మెమోరాండం ఇచ్చారు. ఎయిడెడ్ పాఠశాలల్లో పదోన్నతులు ఇవ్వడానికి ప్రభుత్వ అనుమతినిచ్చింది. అయితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం సీనియార్టీ లిస్టులు తయారుచేసి, ఖాళీలను స్పష్టంగా ప్రకటించి పారదర్శకంగా జరపాల్సి ఉండగా పలు అనుమానాలకు తావిచ్చేవిధంగా మొదటినుండి సీనియర్‌గా ఉన్న వారిని రెండు, మూడు స్థానాల్లో ఉంచడం, అన్ని ఖాళీలను చూపకుండా కొన్నిటినే ప్రదర్శించడం ఉపాధ్యాయులను ఆందోళనకు గురిచేస్తుందని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన ప్రమోషన్లను రద్దు చేసి, విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆర్‌జెడిని కలిసిన వారిలో యుటియఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.నాగమల్లేశ్వరరావు, ఎం.హనుమంతరావు, రాష్ట్ర సహాధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, గౌరవాధ్యక్షులు ఎం.డి.గౌస్, కోశాధికారి పి.ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అభినందనలు

**రాష్ట్ర కార్యవర్గం పిలుపు మేరకు పత్రికా క్యాంపెయిన్‌లో ప్రత్యేక కృషి జరిపి నూరు దశాబ్ది పత్రికల వంతున చేర్పించిన కాకినాడ రూరల్ మండలశాఖ మరియు జగ్గంపేట మండల శాఖల బాధ్యులకు, కార్యకర్తలకు రాష్ట్ర సంఘం పక్షాన ఉద్యమాభినందనలు.**

**వ్యక్తిగతంగా 250 సంవత్సర చందాలు చేర్పించిన తూర్పుగోదావరి జిల్లా శాఖ కార్యదర్శి ఎం.విజయగౌరి గారి కృషికి అభినందనలు.**



**100 దశాబ్ది పత్రికలను జిల్లా గౌరవాధ్యక్షులు జి.ప్రభాకరవర్మ ద్వారా జిల్లా నాయకత్వానికి అందజేస్తున్న కాకినాడ రూరల్ మండల అధ్యక్షులు వి.వెంకటరమణ**



**జగ్గంపేట క్యాంపెయిన్ కార్యక్రమంలో 100 దశాబ్ది పత్రికలను జిల్లా గౌరవాధ్యక్షులు జి.ప్రభాకరవర్మకు అందజేస్తున్న మండల నాయకులు**



**250 సం॥చందాల పత్రికల అడ్రస్‌లను జిల్లా నాయకత్వానికి అందజేస్తున్న ఎం.విజయగౌరి,జిల్లా కార్యదర్శి, తూ॥గో॥జిల్లా**

# సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ ఇండిపెండెంట్ స్కూల్స్ యాక్ట్ యోచన విరమించాలి

**శ్రీకాకుళం జిల్లా**

**స్వయం పోషక స్వతంత్ర పాఠశాలల చట్టాన్ని రద్దు చేయాలి**

ప్రభుత్వ విద్యారంగాన్ని నాశనం చేసే స్వయంపోషక స్వతంత్ర పాఠశాలల చట్టం (ఆంధ్రప్రదేశ్ సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ ఇండిపెండెంట్ స్కూల్స్ యాక్ట్-2017) రద్దు చేయాలని శ్రీకాకుళం విద్యా వికాస వేదిక ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (బాలురు)లో విద్యా వికాస వేదిక ఆధ్వర్యంలో సెప్టెంబర్ 2న స్వయంపోషక స్వతంత్ర పాఠశాలల చట్టం ఎవరికోసం? ఎందుకోసం? అనే అంశంపై సమావేశం నిర్వహించబడింది.

విద్యావికాస వేదిక జిల్లా కన్వీనర్ కె.అప్పారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలు సంఘాలకు చెందిన పలువురు విద్యావేత్తలు ప్రసంగించారు.

విద్యారంగానికి సంబంధించిన చట్టాన్ని విద్యావేత్తలు, ఉపాధ్యాయ సంఘాలు, ఎమ్మెల్సీలతో చర్చించకుండా ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ (ఫిక్కీ) సహకారంతో తేవడంలోనే 80 బిలియన్ల విద్యారంగాన్ని కార్పొరేట్ కబంధహస్తాల్లోకి తీసుకురావడ మనేది ప్రభుత్వ ఆలోచనగా అభివర్ణించారు. ఈ చట్టంతో విద్యా వ్యాపారం చట్టబద్ధమవుతుందని, కార్పొరేట్ విద్యాసంస్థలు చేస్తున్న తప్పుడు పద్ధతులన్నీటికీ అధికార ముద్ర పడుతుందని తెలిపారు. ప్రభుత్వాల నుండి రాయితీలు, లాభాలకు భరోసా కార్పొరేట్లకు ఎక్కువతుందని తెలిపారు.

ఈ విద్యా సంస్థలకు స్థానిక సంస్థల అనుమతి అవసరం లేక పోవడంతో విచ్చలవిడిగా ఏర్పాటవుతాయని తెలిపారు. యాజమాన్య నిర్వహణలోవుండే పాఠశాల కమిటీ రోజువారీ నిర్వహణ, జీతాలు, అక్కౌంట్స్, బోధన, పరీక్షలు, ఫీజులు చూస్తుందని తల్లిదండ్రులకు, టీచర్లకు ప్రమేయముండదని తెలిపారు. పాఠశాలల యాజమాన్యం తమకు ఇష్టం వచ్చిన రీతిలో ఎప్పుడైన పెంచే ఫీజులు విద్యార్థుల తల్లిదండ్రులకు భారమౌతాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇన్ని అనర్ధాలున్నా స్వయంపోషక స్వతంత్ర పాఠశాలల చట్టాన్ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అందుకుగాను విద్యాభి మానులు, విద్యార్ధి, యువజన సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు ఉద్యమించక తప్పదని వారు అన్నారు.

సమావేశంలో విద్యావికాస వేదిక జిల్లా కన్వీనర్ కె.అప్పారావు, జెవిల్స్ సంఘం జిల్లా అధ్యక్షులు కీర్తి తవిటి నాయుడు, హెడ్‌మాస్టర్ల సంఘం రాష్ట్ర సహాధ్యక్షులు వి.సత్యనారాయణ, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం సంఘ రాష్ట్ర అధ్యక్షులు బి.ధనుంజయరావు, జెవివి జిల్లా కార్యదర్శి పి.కూర్మారావు, మోడల్ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి బి.సురేష్, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం సంఘ జిల్లా అధ్యక్షులు సత్యన్నా రాయణ, యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి గౌంటి గిరిధర్, జిల్లా నాయకులు ఎస్.జగదీశ్వరరావు, బమ్మిడి శ్రీరామమూర్తి, జి.మహేష్, జి.శ్రీనివాస్ చర్చలలో పాల్గొన్నారు.


**స్వయం పోషక స్వతంత్ర విద్యా సంస్థల చట్టాన్ని ఉపసంహరించాలి**

**పాతపట్నం :** ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యంచేసే, విద్యార్థుల, తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల హక్కులను హరించి, విద్యారంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించే దుర్మార్గమైన స్వయంపోషక స్వతంత్ర విద్యా సంస్థల చట్టాన్ని ఉపసంహరించాలని యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి గౌంటి గిరిధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 3న పాతపట్నం ప్రాథమిక పాఠశాలలో యుటియఫ్ పాతపట్నం మండల శాఖ అధ్యక్షులు మద్దిల శంకరరావు అధ్యక్షతన సమావేశం జరిగింది.

సమావేశంలో గిరిధర్ ప్రసంగిస్తూ డిసెంబర్ 9,10,11 తేదీలలో జరుగనున్న యుటియఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పాల్గొన్న జిల్లా కార్యదర్శి దండు ప్రకాశరావు ప్రసంగిస్తూ స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్లు వెంటనే చేపట్టాలని డిఇఓని కోరారు. జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు లక్కోజి శ్రీనివాసరావు ప్రసంగిస్తూ ఉమ్మడి సర్వీస్‌రూల్స్‌లో గిరిజన సంక్షేమ, మున్సిపల్, ఎయిడెడ్, మోడల్ స్కూల్ టీచర్లను చేర్చాలని డిమాండ్ చేశారు. పాతపట్నం మండల ప్రధానకార్యదర్శి నల్ల శ్రీనివాసరావు ప్రసంగిస్తూ అవినీతి అక్రమాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న యుటియఫ్ ఉద్యమాన్ని బలోపేతం చేయాలని కోరారు. పాలకొండ ప్రధానకార్యదర్శి కాంతా రావు, గౌరవాధ్యక్షులు కె.చిరంజీవులు, మండల శాఖల నాయకులు ఎ.దాలయ్య, మోహనరావు, బాలకృష్ణ, రవి, పెంటన్న, సుభాష్, శారదా మిస్రో, క్షమాకర్ (కిమెంకర్), రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

**విజయనగరం జిల్లా**

**ఆ.ప్ర. సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ ఇండిపెండెంట్ స్కూలు యాక్ట్-2017ను రద్దు చేయాలి - విద్యావికాస వేదిక**



స్థానిక రఘు కళాశాలలో విద్యావికాస వేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని సెప్టెంబర్ 3న నిర్వహించారు. వేదిక ప్రతినిధి వాసిరెడ్డి రాంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వేదిక బొబ్బిలి డివిజన్ కన్వీనర్ జి.శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యా సంస్థల పట్ల ప్రభుత్వానికి ఏరకమైన జోక్యంగాని, బాధ్యతగాని లేకుండా చేసే ఈ చట్టం మరింత ఫీజుల భారాన్ని పెంచేదిగా ఉందన్నారు.

జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు పి.సత్యంనాయుడు మాట్లాడుతూ నీతిఅయోగ్ ప్రకటించిన డొల్లతనంతో గల పాఠశాలలను ప్రైవేట్‌వారికి అప్పగించడని చెప్పటం, ఇటువంటి చట్టాలను తేవడంలో అర్థం ఏమంటే విద్యారంగం నుండి ప్రభుత్వం బాధ్యత తప్పించుకోవడమేనని అన్నారు.

యుటియఫ్ నాయకులు పి.మధు మాట్లాడుతూ ఈ చట్టం వలన యాజమాన్యం ఇష్టమొచ్చిన రీతిలో రకరకాల ఫీజులు పెంచుతుందని, కార్పొరేట్ సంస్థలు చిన్న చిన్న ప్రైవేట్ సంస్థలను మూసివేసే విధంగా చేస్తాయని, ఎటువంటి జవాబుదారీతనం ఉండదని, చాలా నష్టదాయక మైన చట్టమని, క్షేత్రస్థాయిలో ఈ చట్టం గురించి ప్రచారం చేయాలని వక్తలు అభిప్రాయపడ్డారు. సమావేశంలో ప్రతినిధులు పి.సత్యన్నారాయణ, జగదీష్, పోలినాయుడు, భవానీ, టివి నాయుడు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**పశ్చిమగోదావరి జిల్లా**

## స్వయం పోషక స్వతంత్ర పాఠశాలల చట్టం-2017ని ఉపసహరించుకోవాలి



**తాడేపల్లిగూడెం :** స్వయంపోషక స్వతంత్ర పాఠశాలల చట్టం ప్రభుత్వ విద్యారంగానికి గొడ్డలి పెట్టని, ప్రభుత్వం ఈ చట్టాన్ని వెంటనే ఉపసంహరించు కోవాలని యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.జయప్రభ డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా ఆఫీసు బేరర్ల సమావేశం సంఘ అధ్యక్షులు పి.జయకర్ అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర కార్యదర్శి జయప్రభ మాట్లాడుతూ స్వయంపోషక స్వతంత్ర పాఠశాలల చట్టం-2017ను ప్రభుత్వం తీసుకొచ్చిందని, ఈ చట్టం అమలైతే రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యారంగం అతలకుతల మవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చట్టం పూర్తిగా కార్పొరేట్ విద్యకు చట్టబద్ధత అయ్యేవిధంగా ఉందని, దీన్ని వెంటనే విరమించు కోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమిస్తా మన్నారు. శానిటరీపై జిఎస్‌టి విధించడాన్ని ఖండించారు. శానిటరీపై విధించిన జిఎస్‌టిని రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 31న జిల్లాలో అన్ని డివిజన్ కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని పిలుపు నిచ్చారు.

జిల్లా ప్రధానకార్యదర్శి బి.గోపీమూర్తి మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు అనుకూలంగా ఏర్పాటుచేసిన చట్టాన్ని ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యను పేద విద్యార్థులకు అందనీయ కుండా చేసేందుకు ఈ చట్టం ప్రభుత్వం ముందుకు తీసుకొచ్చిం దన్నారు. సెప్టెంబర్ 1న సిపిఎస్ రద్దు చేయాలని కోరుతూ విజయవాడలో జరిగే మిలీనియం మార్చ్‌లో ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు, పిఆర్‌సి, డిఏ, అరియర్స్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులపై ఉన్న భారం తొలగించాలని, బోధనకు అవకాశం కల్పించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు సిహెచ్.జగన్మోహన్, జిల్లా కార్యదర్శులు బి.సూర్యప్రకాశ్, వి.శంకరుడు, ఆర్.రవికుమార్, ఎం.విజయ, ఎం.వెంకటేశ్వరరావు, పి.విష్ణుమూర్తి, పి.శ్రీనివాస్, సిహెచ్.పట్టాభిరామయ్య, ఐ.రాంబాబు, వి.బాలకృష్ణ, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**గుంటూరు జిల్లా**

## స్వయంపోషక చట్టంతో ప్రభుత్వ విద్యారంగం నిర్వీర్యం




రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన స్వయంపోషక, స్వతంత్ర పాఠశాలల చట్టం-2017 కార్యరూపం దాల్చితే ప్రభుత్వ పాఠశాలలు, చిన్న చిన్న ప్రైవేటు విద్యాసంస్థలు మూతపడే ప్రమాదం ఉందని మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. పట్టణంలో పెన్షనర్స్ భవనంలో యుటియఫ్ ఆధ్వర్యంలో స్వయంపోషక స్వతంత్ర పాఠశాలల చట్టంపై ఆగస్టు 26న అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ కేవలం బడా కార్పొరేట్ విద్యాసంస్థలకు లబ్ధి చేకూర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చట్టాన్ని రూపొందించిందన్నారు. అసెంబ్లీలో కనీసం బిల్లును ప్రవేశపెట్టి ఆమోదం పొందకుండానే, నేరుగా చట్టంగా చేయటం దుర్మార్గమన్నారు. ఈ చట్టం ఫలితంగా ప్రైవేట్ పాఠశాలలు తమ ఇష్టం వచ్చిన రీతిలో విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి భారీ మొత్తంలో ఫీజులు వసూలు చేసుకునే అవకాశం కల్పిస్తుందన్నారు. అంతేకాక ప్రభుత్వ విద్యా రంగాన్ని నిర్వీర్యం చేసి, విద్యారంగాన్ని ప్రైవేటురంగం శాసించే ప్రమాదం నెలకొంటుందన్నారు. ఈ పరిణామంతో సామాన్యులు, పేదలకు విద్య అందుబాటులో ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, విద్యార్థుల తల్లిదండ్రులు అప్రమత్తమై ఈ బిల్లును నిరోధించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

యుటియఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.హనుమంతరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యమం ద్వారానే నూతన బిల్లును సమర్థ వంతంగా ఎదుర్కోగలమని చెప్పారు. కార్యక్రమానికి యుటియఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో చిలకలూరిపేట, నాదెండ్ల, యడ్లపాడు మండలాల ప్రధాన బాధ్యులు టి.సుధాకరహరిప్రసాద్, ఎండి షంషుద్దీన్, ఎం.సత్యనారాయణ, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు ఎస్ఎం సుభానీ, లంకా ఆది నారాయణరెడ్డి, పి.కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

**చిత్తూరు జిల్లా**

## స్వయంపోషక స్వతంత్ర పాఠశాలల చట్టం వద్దు



రాష్ట్ర ప్రభుత్వం స్వయంపోషక స్వతంత్ర పాఠశాల చట్టాన్ని అమలు చేయాలని తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని యుటియఫ్ జిల్లా అధ్యక్షులు ఎన్.సోమశేఖరనాయుడు డిమాండ్ చేశారు. స్థానిక యుటియఫ్ కార్యాలయంలో ఆగస్టు 14న ఏర్పాటు చేసిన

సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ చట్టం అమలయితే ప్రభుత్వ విద్యారంగ ఉనికికి తీవ్రనష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్యను చట్టబద్ధం చేసేలా ఈ చట్టం ఉందన్నారు. ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులను సంప్రదించకుండా సిఎస్ఈ వెబ్‌సైట్‌లో ఉంచడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు శేఖర్, కనకాచారి, పరంధామ నాయుడు, రెడ్డప్ప, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

**కడప జిల్లా**

**స్వయం పోషక స్వతంత్ర పాఠశాలల చట్టం-2017 ఎవరికోసం ?**



జులై మొదటి వారంలో విద్యాశాఖ వెబ్‌సైట్లో ఆంధ్రప్రదేశ్ స్వయంపోషక స్వతంత్ర పాఠశాలల చట్టం- 2017పేర ఒక బిల్లును ప్రజాభిప్రాయంకోసం పెట్టింది. జులై 11కల్లా అభిప్రాయాలు తెలపాలని పిలుపునిచ్చింది. ఇది పెద్ద దుస్సాహసం. కార్పోరేట్ పాఠశాలలకు అగ్రతాంబూలం ఇస్తూ యాక్టులు తెస్తున్నారు. అంటే ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యంచేసి మొత్తం కార్పోరేట్‌కి అప్పజెప్పే ప్రయత్నంలో భాగంగానే యాక్టు-2017 వచ్చినట్లు స్పష్టం అవుతోంది. కార్పోరేట్ సంస్థలు, వాటి సంఘాలు విద్యాశాఖలోకి అందునా పాఠశాల విద్యాశాఖలోకి ప్రవేశించాలని తహతహలాడుతూ కొన్ని వాదాలు తెస్తున్నాయి. సిఐఐ, ఫిక్కి దీనిపై పెద్దపెద్ద డాక్యుమెంట్లు తెచ్చాయి. ఐడిఎఫ్ఐ-ఎస్ఎస్‌కెఐలాంటి కన్సల్టెన్సీలు 'ఏనుగు నాట్యం చెయ్యగలదా' లాంటి వ్యంగాస్త్రాలని ప్రభుత్వ విద్యారంగంమీద గుప్పిస్తూ కార్పోరేట్ సంస్థలకు ఈ రంగంలోకి వస్తే ఎంత అద్భుత లాభాలు వస్తాయో లెక్కలేసి చూపించి ఊరిస్తున్నాయని యుటియఫ్ రాష్ట్రకార్యదర్శి బి.లక్ష్మీ రాజా విమర్శించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి ఎస్‌వి సుబ్బరాజు, గౌరవాధ్యక్షులు పి.చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి సివి రమణ, వల్లూరు చెన్నూరు మండల అధ్యక్షులు వై.శ్రీహరి, ఎస్.రఫీక్ అహమ్మద్‌లు పాల్గొన్నారు.

**కర్నూలు జిల్లా**

**కార్పొరేట్లకు అనుకూలంగా ప్రభుత్వం**

రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేటర్లకు మరింత లాభం చేకూర్చే ఉద్దేంతోనే స్వయంపోషక స్వతంత్ర పాఠశాలల చట్టం-2017ను తీసుకు వచ్చిందని యుటియఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి డి.రామశేషయ్య పేర్కొన్నారు. కార్పొరేట్ల కోసమే స్వయంపోషక స్వతంత్ర పాఠశాలల చట్టం-2017 అంశంపై ఆగస్టు 26న ఫ్యాప్టో ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్లకు మరింత లాభం చేకూర్చే ఉద్దేశంతోనే ఈ చట్టాన్ని తీసుకువచ్చిందని అన్నారు. చట్ట రూపకల్పనలో విద్యారంగ నిపుణులతో మాటమాత్రంగా చర్చించకుండా పారిశ్రామిక వర్గాల సూచనల మేరకు రూపకల్పన చేయడం విద్యను మరింత వ్యాపారీకరణ చేయడమేనని అన్నారు. ఈ చట్టం అమలులోకి వస్తే పేదవారికి విద్య మరింత దూరం అవుతుందని తెలిపారు. ఎస్‌టియు నాయకులు సుబ్బరాయుడు మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలు తమ ఇష్టానుసారంగా జీతాలు పెంచుకోవడానికి, ఇష్టమైన సిలబస్‌ను బోధించడానికి మరింత స్వేచ్ఛ ఇచ్చిందని అన్నారు. ప్రభుత్వ ఆజమాయిషీ నామమాత్రం కావడంతో మరింత దోపిడీకి పాల్పడే అవకాశం ఉందని తెలిపారు.

యుటియఫ్ జిల్లా కార్యదర్శి జాకీర్ మాట్లాడుతూ 1982లో రూపొందించిన విద్యా చట్టానికి 2010 విద్యాహక్కు చట్టానికి పూర్తి విఘాతం కలుగుతుందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన తప్పుడు విధానాన్ని మార్చుకుంటూ ఈ చట్టాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏపిటిఎఫ్ నాయకులు సాంబశివుడు, మధుబాబు, యుటియఫ్ నాయకులు బాలస్వామి, శ్రావణ్, వెంకటేశ్వర్లు, రవూఫ్, నాగేంద్రప్రసాద్, సుబ్బరాయుడు, ప్రేమకాంత్, మౌలాలి తదితరులతోపాటు సిఐటియు నాయకులు శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

**అనంతపురం జిల్లా**

**స్వయం పోషక స్వతంత్ర పాఠశాలల చట్టం-2017 రద్దు చేయాలి**



స్వయం పోషిత స్వతంత్ర పాఠశాలల చట్టం రద్దు చేయాలని వక్తలు డిమాండ్ చేశారు. ఆగస్టు 27న నగరంలో ఉపాధ్యాయ భవన్‌లో యుటియఫ్ ఆధ్వర్యంలో "స్వయం పోషిత స్వతంత్ర పాఠశాలల చట్టం 2017 - విద్యారంగంపై దాని ప్రభావం" అనే అంశంపై అన్ని ఉపాధ్యాయ సంఘాలతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ డా॥ ఎం.గేయానంద్ మాట్లాడుతూ యూనివర్శిటీ స్థాయినుంచి ఎల్‌కెజి స్థాయివరకు శత కోటీశ్వర్లను విద్యారంగంలోకి దింపాలనే ప్రభుత్వ ఉద్దేశ్యం ఉన్నట్లు ఈ చట్టం ద్వారా తెలుస్తుందన్నారు. రిలయన్స్ లాంటి కంపెనీలు విద్యారంగంలోకి రావడానికి చట్టబద్ధ రక్షణ కోసమే ఈ చట్టం వస్తుందన్నారు. పాఠశాలలను స్థాపించడం లాభాపేక్ష లేకుండా స్థాపించాలని, ఎక్కువ పెట్టుబడిపెట్టి వచ్చే సంస్థలు విద్యను వ్యాపారంగా మార్చేసి విలువ లేని విద్య అందిస్తాయన్నారు. ఇలాంటివి అనేకంగా ఈ చట్టంలో వున్నాయని కావున ఈ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

మానవ హక్కుల వేదిక నాయకులు చంద్రశేఖర్, డాక్టర్స్ అసోసియేషన్ నాయకులు డా॥ వీరభద్రం, ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ అధ్యక్షులు కె.పుల్లారెడ్డి, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ జిలాన్, అధ్యక్షులు ఎం.సుధాకర్, ప్రధానకార్యదర్శి ఎన్‌వి రమణయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యుటియఫ్ సీనియర్ నాయకులు సికె నాగేంద్రబాబు, కోటి, సాయినాథబాబు, ఎస్టీయు నాయకులు రామన్న, సూరీడు, ఏపిపిటిఏ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, హెచ్ఎం అసోసియేషన్ నాయకులు వెంకటేశులు, భాస్కర్ నారాయణ, ఆర్‌యుపిపి నాయకులు తులసిరెడ్డి, టిఎన్‌యుఎస్ నాయకులు రామలింగయ్య, ఉపాధ్యాయ సత్తా నాయకులు ఫయాజ్ భాషా, బిఈడి అసోసియేషన్ నాయకులు నారాయణస్వామితో పాటు అన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# శానిటరీ నాప్‌కిన్స్‌పై జిఎస్‌టి రద్దు చేయాలి

### శ్రీకాకుళం జిల్లా




మహిళలు, బాలికలు వాడే శానిటరీ నాప్‌కిన్స్‌పై 12% జిఎస్‌టి (గూడ్స్ & సేల్స్‌టాక్స్) విధించడం అత్యంత దుర్మార్గమని, మహిళా వ్యతిరేక చర్య అని, శానిటరీ నాప్‌కిన్స్‌పై జిఎస్‌టిని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ బాలికల కళాశాల లోను, ప్రభుత్వ బాలికల పాఠశాలలోను యుటియఫ్ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆగస్టు 31న నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అనంతరం బాలికలతో ప్రదర్శన నిర్వహించి జిల్లా విద్యాశాఖాధి కార్యాలయ అధికారులకు విజ్ఞాపన అందించారు. ప్రధానమంత్రికి మహిళల, బాలికల నిరసనను తెలియజేయాలని వారు కోరారు.

కార్యక్రమంలో యుటియఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామలక్ష్మి, జిల్లా సహాధ్యక్షులు ఎం.వాగ్దేవి, ఎపి మహిళా టీచర్స్ ఫోరం జిల్లా కన్వీనర్ బి.ధనలక్ష్మి, స్థానిక బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయు లు ఆర్.లక్ష్మి, యుటియఫ్ నాయకురాలు వసుంధర, పలువురు మహిళా టీచర్లు, బాలికల, యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, జిల్లా ప్రధానకార్యదర్శి చౌదరి రవీంద్రలు పాల్గొన్నారు.

### విజయనగరం జిల్లా




ఆడ పిల్లలు, మహిళలు వినియోగించే శానిటరీ నాప్‌కిన్స్‌పై కేంద్ర ప్రభుత్వం జిఎస్‌టి పన్నును వేయడం దుర్మార్గమని, ఆ పన్నును తక్షణమే రద్దు చేయాలని యుటియఫ్ విమెన్ టీచర్స్ ఫోరం డిమాండ్ చేసింది. ఆగస్టు 31న విజనగరంలో కలెక్టరు కార్యాలయం వద్ద ఫోరం ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. 5%గా గల పన్ను శానిటరీ నాప్‌కిన్స్‌పై ఈ బిల్లు అమలు తరువాత 12%నికి పెంచారు. ఇది అత్యంత భారమైన అంశం అని అన్నారు. ఆరోగ్య సూత్రాలను పాటించే క్రమంలో వినియోగిస్తున్న వారందరికీ భారాలు మోపే ఈ పన్నును రద్దు చేయాలని, ఇది లగ్జరీకి చెందిన అంశంకాదని అన్నారు.

ప్రభుత్వ విద్యాసంస్థలలో చదువుకుంటున్న ఆడ పిల్లలకు ప్రభుత్వమే ఉచితంగా నాప్‌కిన్స్ ప్యాడ్స్‌ను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జాయింట్ కలెక్టరుకి విజ్ఞాపన పత్రం అందజేసి, కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విమెన్ టీచర్స్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ కె.విజయగౌరి, జిల్లా కన్వీనరు జి.నిర్మల, కో-కన్వీనరు జి.పార్వతి, రాధాభవాని, శ్రీదేవి, జైనాభి, లక్ష్మిలతోపాటు జిల్లా యుటియఫ్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.శ్రీనివాసరావు, కె. శేషగిరి పాల్గొన్నారు.

### తూర్పుగోదావరి జిల్లా



**రాజోలు :** యుటియఫ్ రాజోలు మండలశాఖ ఆధ్వర్యంలో మహిళలు ఉపయోగించే శానిటరీ నాప్‌కిన్స్‌పై కేంద్ర ప్రభుత్వం జిఎస్‌టి 12%గా నిర్ణయించడాన్ని నిరసిస్తూ... జిఎస్‌టిని తొలగించాలని కోరుతూ ఆగస్టు 31న రాజోలు మండల తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించడమైనది. ఈ కార్యక్రమంలో డి.ఉమాదేవి, జి.జ్యోతి, మండల శాఖ గౌరవాధ్యక్షులు సిహెచ్.దుర్గాప్రసాద్, మండల అధ్యక్షులు యు.శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షులు జి.శ్రీనివాస్, ఏ.కాశీ విశ్వేశ్వర రావు, ఎం.నరసింహారావు, జిఎస్‌విఎస్ మూర్తి, జి.బృహస్పతి మరియు పాఠశాల విద్యార్థినులు తితరులు పాల్గొన్నారు.

### పశ్చిమగోదావరి జిల్లా




**ఏలూరు:** దేశంలో ఆడ పిల్లలు ఆరోగ్య రక్షణకు ఉపయోగపడే శానిటరీ నాప్‌కిన్స్‌పై ప్రస్తుతం ఉన్న 5% పన్నును 12% పెంచడం దుర్మార్గపు చర్య అని యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.జయప్రభ అన్నారు. యుటియఫ్ – ఎస్‌టిఎఫ్ఐ ఆధ్వర్యంలో అఖిలభారత విమెన్ టీచర్స్ ఫోరం (ఆం.ప్ర) పిలుపు మేరకు ఆగస్టు 31న రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద "శానిటరీ నాప్‌కిన్స్‌పై జిఎస్‌టి రద్దు" చేయాలని కోరుతూ ఇచ్చిన ధర్నా పిలుపులో భాగంగా ఏలూరు జిల్లా కలెక్టరు కార్యాలయంవద్ద జరిగిన ధర్నా కార్యక్రమాలన్ని ఎస్.జయప్రభ ప్రారంభిస్తూ, శానిటరీ నాప్‌కిన్స్‌పై జిఎస్‌టి రద్దు అయ్యేవరకు పాఠశాల స్థాయి, మండలస్థాయి, డివిజన్‌స్థాయి ఆందోళన నిర్వహిస్తామని చెప్పారు.

యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి షేక్‌సాబ్జీ మాట్లాడుతూ సంపన్న వర్గాలకు, కార్పొరేట్లకు లక్షలకోట్ల రూపాయలు రాయితీలు ఇస్తూ దేశంలో మహిళలపై వేల కోట్ల రూపాయలపన్ను భారాన్ని వేయడం

సిగ్గుచేటని అన్నారు. ఇది పరోక్షంగా దేశంలో మహిళల అనారోగ్యానికి దారితీస్తుంది. కాబట్టి కేంద్ర ప్రభుత్వం జిఎస్‌టి రద్దు చేయాలని, లేదా ఇది రద్దయ్యేవరకు ఉద్యమిస్తామని అన్నారు.

ఈ ధర్నా కార్యక్రమానికి జిల్లా యుటియఫ్ మహిళా కన్వీనర్ వి. కనకదుర్గ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో యుటియఫ్ జిల్లా అధ్యక్షులు పి.జయకర్, సహాధ్యక్షులు బి.సుభాషిణి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.వి.నరసింహారావు, ఐద్వా నాయకులు హరీష, జయలక్ష్మి, యుటియఫ్ జిల్లా నాయకులు సుభాషినీ బేగం, సుధారాణి పాల్గొన్నారు.

**తణుకు :**




యుటియఫ్ తణుకు మండలశాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అమలుచేసిన జిఎస్‌టికి వ్యతిరేకంగా ఆగస్టు 31న ర్యాలీ నిర్వహించి స్థానిక ఎంఆర్‌ఓకి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా మహిళలు బాడే శానిటరీ నాప్‌కిన్స్ మీద జిఎస్‌టి పన్నును 5% నుంచి 12%కి పెంచినందుకు నిరసనగా ఉపాధ్యాయినులు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర యుటియఫ్ మహిళా కార్యదర్శి ఎస్.జయప్రభ మాట్లాడుతూ శానిటరీ నాప్‌కిన్స్ మీద జిఎస్‌టి పన్నును పూర్తిగా రద్దుచేయాలని డిమాండ్ శారు.

రాష్ట్ర ప్రచురణల కమిటీ సభ్యులు టి.జె.జయకుమార్ మాట్లాడుతూ మహిళా సంక్షేమం కొరకు పాటుపడుచున్నాము అని గొప్పలు చెప్పు కుంటున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇలా మహిళలు వాడుకొనే శానిటరీ నాప్‌కిన్స్‌పై వేసిన జిఎస్‌టి పన్నును పూర్తిగా రద్దు చేయాలని, తద్వారా మహిళల ఆరోగ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. లేదంటే తగిన గుణపాఠం మహిళలు చెపుతారు అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సహాధ్యక్షురాలు కె.మాధవి, కార్యదర్శులు కె.వరలక్ష్మి, వి.నిర్మల, ఎంవిఎస్ మాలతి, నాగవల్లి, కెపి నిర్మల కుమారి, కె.విజయశ్రీ మండలం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**కృష్ణా జిల్లా**



శానిటరీ నాప్‌కిన్స్‌పై జిఎస్‌టిని రద్దు చేస్తూ గవర్న మెంట్‌కు నిరసన తెలియజేస్తూ ఆగస్టు 31న విజయవాడ, లెనిన్ సెంటర్‌లో ఏపియుటియఫ్ కృష్ణా జిల్లా మహిళా వింగ్ తరపున నేషనల్ ఉమెన్ టీచర్స్ ఫోరం పిలుపుమేరకు నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. మహిళలు, బాలికలు వాడుకొనే శానిటరీ నాప్‌కిన్స్‌పై ప్రభుత్వము 12% జిఎస్‌టి వేయడం సిగ్గుచేటు అన్నారు. తక్షణమే దాన్ని తొలగించి ఉచితంగా అందించవలసిందిగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ యుటియఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.లీల మాట్లాడారు. తదుపరి విజయవాడ రూరల్ ఎంఆర్‌ఓకి మెమోరాండం ఇవ్వడమైనది. ఈ కార్యక్రమంలో యుటియఫ్ రాష్ట్ర కోశాధికారి కె.సంజీవరెడ్డి, జిల్లా అధ్యక్షులు ఎస్‌పి మనోహర్‌కుమార్, జిల్లా సహాధ్యక్షురాలు భగీరధి, కార్యదర్శులు శాంతికుమారి, వరలక్ష్మి, మహిళా కన్వీనర్ కమల, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**గుంటూరు జిల్లా**




కేంద్ర ప్రభుత్వం తాజాగా తీసుకొచ్చిన జిఎస్‌టి బిల్లు వలన విద్యా రంగంపై ప్రభావం తీవ్రంగా ఉంది. చివరకు ఆడ పిల్లలు, మహిళలు ప్రతినెల వినియోగించే శానిటరీ నాప్‌కిన్స్ మీద జిఎస్‌టి పేరుతో లగ్జరీ పన్ను విధించింది. ఉన్నత పాఠశాలలు, కాలేజీలలో చదువుకునే ఆడ పిల్లలకు, మహిళలకు ఈ పన్ను శాపంగాఉంది. 16 నెలలుగా పాఠశాలలకు, సంక్షేమ హాస్టళ్ళకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాప్‌కిన్స్ సరఫరాను నిలిపివేసింది. ప్రభుత్వం ఈ బాధ్యతనుండి తప్పుకుం టుంది. దీనికి నిరసనగా ఎస్‌టిఎఫ్‌ఐ పిలుపు మేరకు నేషనల్ ఉమెన్ టీచర్ ఫోరం-ఏపి అనుబంధంగా జిల్లా ఉమెన్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో ఆగస్టు 31న జిల్లా కేంద్రంనందు నిరసన కార్యక్రమం నిర్వహించటం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉమెన్ టీచర్స్ ఫోరం నుండి సిహెచ్.పద్మావతి, బి.ఆదిలక్ష్మి, ఎండి షకీలాబేగం, మహిళా ఉపాధ్యాయులు, ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి నాయకురాలు జ్యోతి, విద్యార్థులు, ఐద్వా నుండి అరుణకుమారి, ప్రజాసంఘ నాయకులు పాల్గొన్నారు. అనంతరం డిఆర్‌ఓ నాగబాబుకి వినతిపత్రం ఇవ్వటం జరిగింది.

**అచ్చంపేట :**



ఆగస్టు 31న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అచ్చంపేట, గుంటూరు జిల్లాలో నేషనల్ విమెన్ టీచర్స్ ఫోరం పిలుపు మేరకు యుటియఫ్ ఆధ్వర్యంలో శానిటరీ నాప్‌కిన్స్‌పై విధించిన 12% జిఎస్‌టిని ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ మండల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయినీలు మరియు 9,10 తరగతి విద్యార్థినీ లతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ముందుగా యుటియఫ్ గుంటూరు జిల్లా కార్యదర్శి ఎ.నాగకుసుమ కుమారి

9,10 తరగతి విద్యార్థినీలకు శానిటరీ నాప్‌కిన్స్ యొక్క ఆవశ్యకతపై అవగాహన సదస్సు నిర్వహించి అనంతరం నిరసన కార్యక్రమం నిర్వహించుట జరిగింది. తదుపరి అచ్చంపేట మండలం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేయుట జరిగింది. ఈ కార్యక్రమానికి అచ్చంపేట మండల సహాధ్యక్షురాలు వినీల, సౌజన్య, అమరేశ్వరి, విజయకమల, జ్యోత్స్న, ఆషీషేభేగం, హజరాబి, కుమారి లక్ష్మి మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**అనంతపురం జిల్లా**



మహిళలు, ఆడపిల్లలు ప్రతినెల వినియోగించే శానిటరీ నాపికిన్స్ మీద జిఎస్‌టి పేరుతో విధించిన లగ్జరీపన్ను 12%ను వెంటనే రద్దు చేసి ప్రభుత్వ పాఠశాలలు / కళాశాలలో చదివే విద్యార్థులకు ఉచితంగా సప్లై చేయాలని నేషనల్ ఫోరం ఫర్ ఉమెన్స్ టీచర్ జిల్లా కన్వీనర్ మరియు యుటియఫ్ జిల్లాశాఖ అసోసియేట్ అధ్యక్షులు జి. ఉషారాణి డిమాండ్ చేశారు.

నేషనల్ ఉమెన్స్ టీచర్ ఫోరం ఆఫ్ ఇండియా పిలుపుమేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆగస్టు 31న జరిగిన నిరసన ప్రదర్శనలో ఉషారాణి ప్రసంగిస్తూ గత 16 నెలలుగా పాఠశాలలకు, సంక్షేమ హాస్టల్స్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాప్‌కిన్స్ సరఫరా నిలిపివేశాయని, గత 2 సం॥లుగా వీటికోసం బడ్జెట్ కేటాయింపులు లేవని విద్యారంగంలో ప్రభుత్వ బాధ్యత ఉన్నప్పటికి అవి నిర్లక్ష్యాన్ని ప్రదర్శించాయని విమర్శించారు.

రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ జిలాన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తాజాగా తీసుకొని వచ్చిన జిఎస్‌టి బిల్లు అన్ని రంగాలపై, నిత్యావసర వస్తువులపై తీవ్ర ప్రభావం పడిందని ఈ బిల్లు వల్ల విద్యారంగంలో కాగితాలపై, పెన్నులపై కూడా భారం పడిందని వీటిపై జిఎస్‌టి పన్నును వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. పెట్రోలుపై జిఎస్‌టిని అమలు చేస్తే ప్రస్తుత ధరలో సగానికి తగ్గించవలసి వస్తుందని, అది కార్పొరేట్‌కు నష్టం కనుక పెట్రోలును జిఎస్‌టి పరిధిలోకి తీసుకొని రాకపోవడము వెనుక కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరించడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉందని విమర్శించారు.

జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎం.సుధాకర్, రమణయ్యలు మాట్లాడుతూ నాపికిన్స్ మీద జిఎస్‌టి రద్దు చేయాలని, పాఠశాలలు, కాలేజీలలో చదివే విద్యార్థునులకు ఉచితముగా ఇవ్వాలని, తక్కువ ధరకే దేశంలోని పేద బడుగు, బలహీనవర్గాల స్త్రీలకు నాప్‌కిన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నిరసన ప్రదర్శన అనంతరం డిఆర్‌ఓ మల్లీశ్వరీదేవీకి వినతిపత్రం సమర్పించడమైనది. డిఆర్‌ఓ మాట్లాడుతూ నాప్‌కిన్స్ మీద జిఎస్‌టి పన్ను విషయాన్ని ప్రభుత్వానికి తెలియజేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెఎస్‌ఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు జయలక్ష్మీ, యుటియఫ్ కార్యవర్గ సభ్యురాలు సరళ, జిల్లా కార్యదర్శి రూల్, జిల్లా కౌన్సిలర్లు రేణుక, పద్మావతి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్

**DA TABLE, G.O.Ms.No.140, Dt.11.08.2017**

13000- 390-14170- 430-15460- 470- 16870- 510- 18400- 550- 20050- 590- 21820- 640- 23740-700- -25840-760- 28120- 820- 30580- 880- 33220- 950- 36070-1030- 39160-1110- 42490-1190- 46060- 1270- 49870- 1360- 53950-1460-58330-1560- 63010 - 1660-67990-1760-73270-1880-78910- 2020- 84970- 2160-91450–2330-100770-2520–110850 (80)

| Basic Pay | DA 22.008 % | Fitment 18.34% | Deference 3.668% | Adjust to PF |
|---|---|---|---|---|
| 13000 | 2861 | 2384 | 477 | 6678 |
| 13390 | 2947 | 2456 | 491 | 6874 |
| 13780 | 3033 | 2527 | 505 | 7070 |
| 14170 | 3119 | 2599 | 520 | 7280 |
| 14600 | 3213 | 2678 | 536 | 7504 |
| 15030 | 3308 | 2757 | 551 | 7714 |
| 15460 | 3402 | 2835 | 567 | 7938 |
| 15930 | 3506 | 2922 | 584 | 8176 |
| 16400 | 3609 | 3008 | 602 | 8428 |
| 16870 | 3713 | 3094 | 619 | 8666 |
| 17380 | 3825 | 3187 | 637 | 8918 |
| 17890 | 3937 | 3281 | 656 | 9184 |
| 18400 | 4049 | 3375 | 675 | 9450 |
| 18950 | 4171 | 3475 | 695 | 9730 |
| 19500 | 4292 | 3576 | 715 | 10010 |
| 20050 | 4413 | 3677 | 735 | 10290 |
| 20640 | 4542 | 3785 | 757 | 10598 |
| 21230 | 4672 | 3894 | 779 | 10906 |
| 21820 | 4802 | 4002 | 800 | 11200 |
| 22460 | 4943 | 4119 | 824 | 11536 |
| 23100 | 5084 | 4237 | 847 | 11858 |
| 23740 | 5225 | 4354 | 871 | 12194 |
| 24440 | 5379 | 4482 | 896 | 12544 |
| 25140 | 5533 | 4611 | 922 | 12908 |
| 25840 | 5687 | 4739 | 948 | 13272 |
| 26600 | 5854 | 4878 | 976 | 13664 |
| 27360 | 6021 | 5018 | 1004 | 14056 |
| 28120 | 6189 | 5157 | 1031 | 14434 |
| 28940 | 6369 | 5308 | 1062 | 14868 |
| 29760 | 6550 | 5458 | 1092 | 15288 |
| 30580 | 6730 | 5608 | 1122 | 15708 |
| 31460 | 6924 | 5770 | 1154 | 16156 |
| 32340 | 7117 | 5931 | 1186 | 16604 |
| 33220 | 7311 | 6093 | 1219 | 17066 |
| 34170 | 7520 | 6267 | 1253 | 17542 |
| 35120 | 7729 | 6441 | 1288 | 18032 |
| 36070 | 7938 | 6615 | 1323 | 18522 |
| 37100 | 8165 | 6804 | 1361 | 19054 |
| 38130 | 8392 | 6993 | 1399 | 19586 |
| 39160 | 8618 | 7182 | 1436 | 20104 |
| 40270 | 8863 | 7386 | 1477 | 20678 |
| 41380 | 9107 | 7589 | 1518 | 21252 |
| 42490 | 9351 | 7793 | 1559 | 21826 |
| 43680 | 9613 | 8011 | 1602 | 22428 |
| 44870 | 9875 | 8229 | 1646 | 23044 |
| 46060 | 10137 | 8447 | 1689 | 23646 |
| 47330 | 10416 | 8680 | 1736 | 24304 |
| 48600 | 10696 | 8913 | 1783 | 24962 |
| 49870 | 10975 | 9146 | 1829 | 25606 |
| 51230 | 11275 | 9396 | 1879 | 26306 |
| 52590 | 11574 | 9645 | 1929 | 27006 |
| 53950 | 11873 | 9894 | 1979 | 27706 |
| 55410 | 12195 | 10162 | 2032 | 28448 |
| 56870 | 12516 | 10430 | 2086 | 29204 |
| 58330 | 12837 | 10698 | 2140 | 29960 |
| 59890 | 13181 | 10984 | 2197 | 30758 |
| 61450 | 13524 | 11270 | 2254 | 31556 |
| 63010 | 13867 | 11556 | 2311 | 32354 |
| 64670 | 14233 | 11860 | 2372 | 33208 |
| 66330 | 14598 | 12165 | 2433 | 34062 |
| 67990 | 14963 | 12469 | 2494 | 34916 |
| 69750 | 15351 | 12792 | 2558 | 35812 |
| 71510 | 15738 | 13115 | 2623 | 36722 |
| 73270 | 16125 | 13438 | 2688 | 37632 |
| 75150 | 16539 | 13783 | 2757 | 38598 |
| 77030 | 16953 | 14127 | 2825 | 39550 |
| 78910 | 17367 | 14472 | 2894 | 40516 |
| 80930 | 17811 | 14843 | 2969 | 41566 |
| 82950 | 18256 | 15213 | 3043 | 42602 |
| 84970 | 18700 | 15583 | 3117 | 43638 |
| 87130 | 19176 | 15980 | 3196 | 44744 |
| 89290 | 19651 | 16376 | 3275 | 45850 |
| 91450 | 20126 | 16772 | 3354 | 46956 |
| 93780 | 20639 | 17199 | 3440 | 48160 |
| 96110 | 21152 | 17627 | 3525 | 49350 |
| 98440 | 21665 | 18054 | 3611 | 50554 |
| 100770 | 22177 | 18481 | 3696 | 51744 |
| 103290 | 22732 | 18943 | 3789 | 53046 |
| 105810 | 23287 | 19406 | 3881 | 54334 |
| 108330 | 23841 | 19868 | 3974 | 55636 |
| 110850 | 24396 | 20330 | 4066 | 56924 |

# ప్రభుత్వ ఉత్తర్వులు

1. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహణ సూచనలు
**పాఠశాల విద్య కమీషనరల్ ఉత్తర్వులు ఆర్‌సి నం.375/ ఏ & 1/2017; తేది.02.08.2017**

2. ఉద్యోగుల అంతరాష్ట్రబదిలీలు మార్గదర్శకాలు
**ఆం.ప్ర.ప్రభుత్వ సర్క్యులర్ మెమో నం.9940/**SPF & MC**/2015; తేది.07.08.2017**

3. డైట్‌లో లెక్చరర్ల పోస్టులకు స్కూల్ అసిస్టెంట్ల డెప్యుటేషన్ గురించి ఉత్తర్వు – **పాఠశాల విద్య కమీషనర్ ఉత్తర్వులు ఆర్‌సి నం.1395/**Esst.III**/2017; తేది.07.08.2017**

4. ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు పెంపుదల ఉత్తర్వు
**జిఓ ఎంఎస్ నం.138; తేది.08.08.2017**

5. ఆం.ప్ర. మోడల్ స్కూల్ మాన్యువల్ ఉత్తర్వు
**పాఠశాల విద్యా కమీషనర్ మరియు ప్రాజెక్టు డైరెక్టర్, ఏపి మోడల్ స్కూల్ ఉత్తర్వు ఆర్‌సి నం.29/**CSE/APMS/B1/2017-1**, తేది.09.08.2017**

6. సర్‌ప్లస్ ఉపాధ్యాయుల వర్క్ అడ్జస్ట్‌మెంట్ ఉత్తర్వు
**పాఠశాల విద్య కమీషనరల్ ఉత్తర్వులు ఆర్‌సి నం.190/**Esst.III**/2017;; తేది.09.08.2017**

7. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు జులై 2016 నుండి పెరిగిన నూతన కరువు భత్యం ఉత్తర్వు
**జిఓ ఎంఎస్ నం.140; తేది.11.08.2017**

8. ఆగస్టు 15 పతాకావిష్కరణల సూచనల ఉత్తర్వు
**పాఠశాల విద్య కమీషనర్ ఉత్తర్వులు ఆర్‌సి నం.550/**Esst.V**/ 2015; తేది.11.08.2017**

9. ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్స్‌కు మాన్యువల్ కౌన్సిలింగ్
**పాఠశాల విద్య కమీషనర్ ఉత్తర్వులు ఆర్‌సి నం.1396/**Esst.III**/ 2017; తేది.11.08.2017**

10. నేషనల్ ఫౌండేషన్ ఫర్ టీచర్స్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు కార్యక్రమం
**పాఠశాల విద్య కమీషనర్ ఉత్తర్వులు ఆర్‌సి నం.65/**MC/NFTW**/2017; తేది.11.08.2017**

11. పెన్షనర్స్‌కు జులై 2017 నుండి డియర్‌నెస్ రిలీఫ్
**జిఓ ఎంఎస్ నం.141; తేది.16.08.2017**

12. కామన్ సర్వీస్‌రూల్సు తయారీకి కమిటీ ఏర్పాటు ఉత్తర్వు
**పాఠశాల విద్య కమీషనర్ ఉత్తర్వులు ఆర్‌సి నం.745/**Esst.III**/2017; తేది.17.08.2017**

13. కారుణ్య నియామకాలకు సవరణ ఉత్తర్వు
**జిఓ ఎంఎస్ నం.112; తేది.18.08.2017**

14. పదవీ విరమణ పొందిన మున్సిపల్, పంచాయితీరాజ్, ఎయిడెడ్ ఉపాధ్యాయులకు అర్ధజీతపు సెలవు సౌకర్యం ఉత్తర్వు
**జిఓ ఎంఎస్ నం.148; తేది.21.08.2017**

15. మున్సిపల్ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియంకు సమాంతరంగా తెలుగు మీడియం కొనసాగించుటకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ లేఖ
**ఆర్‌సి నం.39/2017/**Coard/J3**; తేది.23.08.2017**

16. మరణించిన ఉద్యోగుల వారసులకు ఎక్స్‌గ్రేషియా పెంపుదల ఉత్తర్వు
**జిఓ ఎంఎస్ నం.114; తేది.21.08.2017**

17. మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల జీతాల చెల్లింపుకు రూ.41,22,05,000/- గ్రాంటు మంజూరు ఉత్తర్వు
**జిఓ ఆర్‌టి నం.153; తేది.22.08.2017**

18. సర్‌ప్లస్ ఉపాధ్యాయుల వర్క్ ఎడ్జస్ట్‌మెంట్‌కు మరికొన్ని సూచనల ఉత్తర్వు
**పాఠశాల విద్య కమీషనరల్ ఉత్తర్వులు ఆర్‌సి నం.190/**Esst.III**/2017; తేది.23.08.2017**

19. ఉపాధ్యాయుల అంతరరాష్ట్ర బదిలీల మార్గదర్శకాల ఉత్తర్వు
**పాఠశాల విద్య కమీషనరల్ ఉత్తర్వులు ఆర్‌సి నం.1555/**Esst.IV**/2017; తేది.01.09.2017**

## పాఠకులకు గమనిక

తెలుగు మాస పత్రికలలో ఇంగ్లీషులో ప్రభుత్వ ఉత్తర్వులు, ఇంగ్లీషులో వ్యాసాలు వంటివి ప్రచురించ రాదని పోస్టల్ శాఖ వారు అభ్యంతరం తెలిపారు. అందువలన ప్రభుత్వ ఉత్తర్వుల నంబరు, వివరాలు మాత్రమే ప్రచురించడం జరుగుతున్నది. ప్రభుత్వ ఉత్తర్వులు యధావిధిగా ప్రచురించడా నికి పోస్టల్ డిపార్టు మెంట్ వారికి, రిజిస్ట్రార్ ఆఫ్ న్యూస్ పేపర్స్ వారికి ప్రతి పాదనలు పంపడం జరిగింది. పోస్టల్ పర్మిషన్ కొరకు కృషి చేయడం జరుగుతున్నది. అసౌకర్యానికి చింతిస్తున్నాం. – **సంపాదకవర్గం**